మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
హైదరాబాద్ - బుధవారం 24 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 169 | పేజీలు:12 | వెల రూ.5
HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

ఏఐతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ సైట్ హ్యాక్




2

కాక్రోచ్ పార్టీ డైపర్ల విరాళాల ఉద్యమం



2

ఆదాయానికి మించి...

# ఆర్జించాడు

- నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరెస్ట్... రిమాండ్
- రూ. 50 కోట్ల స్థిరచరాస్థుల గుర్తింపు
- రెండు లాకర్లు స్వాధీనం
- బినామీ ఆస్తులపై దర్యాప్తు

**హైదరాబాద్,జూన్ 23(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈక్రమంలో ఆయన ఆదాయానికి మించి కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏసీబీ అధికారులు ఎక్సైజ్ శాఖ ఈసీ మల్లారెడ్డి నివాసంతో సహా బంధువులు, బినామీలకు చెందిన 11 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో 4 గృహాలు, కమర్షియల్ భవనం, 8 ఓపెన్ ప్లాట్లు సహా 10.23 ఎకరాల వ్యవసాయ భూమి వెరసి సుమారు రూ.3 కోట్లకు పైగా విలువైన ఆస్తులు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం దాదాపు రూ. 50 కోట్ల మేరకు ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని వాటి కొనుగోలు, ఆదాయ వనరులపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆస్తుల వివరాలను సేకరించి వాటి చట్టబద్ధతను పరిశీలిస్తున్నట్లు ఏసీబీ వెల్లడించింది. కాగా నిందితుని ఇంట్లో 3.31 లక్షల రూపాయలు, 50 లక్షల రూపాయల బ్యాంక్ డిపాజిట్లను ఏసీబీ అధికారులు ఫ్రీజ్ చేశారు. భార్య, కుటుంబసభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంక్ లాకర్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిందితుడు అరెస్ట్ చేసి మంగళవారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. దీంతో కోర్టు నిందితునికి రిమాండ్ విధించింది.



నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా మల్లారెడ్డి మూడు సంవత్సరాల క్రితంవిధుల్లో చేరారు. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తులున్నట్లు ఆరోపణలు రావడంతో మంగళవారం తెల్లవారుజామునే ఏసీబీ ప్రత్యేక బృందాలు నిజామాబాద్ చేరుకుని అతని కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా ఏసీబీ బృందాలు నిజామాబాద్ ప్రగతినగర్‌లోని మల్లారెడ్డి ఇంట్లో, ...మిగతా 2లో

# ‘మెట్రో’పై ముందడుగు

- కేంద్ర మంత్రులు ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- సమావేశంలో పాల్గొన్న కిషన్ రెడ్డి
- ఫేజ్-1, ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్బీఐ కాప్స్
- నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ
- సమన్వయ సభ్యులుగా కేంద్ర అధికారి, రాష్ట్ర ఎంఏయూడీ సెక్రటరీ



**హైదరాబాద్, జూన్ 23 ( మనం బ్యూరో ) :** ‘మెట్రో’ రెండో దశ విస్తరణపై కీలక ముందడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహ ర్‌లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. మెట్రో రెండో దశ విస్తరణ, ఐఆర్‌ఎఫ్‌సి నుంచి రుణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్బీఐకాప్స్‌ను నియమించాలని నిర్ణయించారు. కన్సల్టెంట్ ఇవ్వనున్న నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించనున్నారు. ఇందుకోసం సమన్వయ సభ్యులుగా కేంద్ర ప్రభుత్వ అధికారితో పాటు రాష్ట్ర ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ ఉంటారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులు ఖట్టర్, అశ్విని వైష్ణవ్ మధ్య జరిగిన సంయుక్త సమావేశంలో నిర్ణయించారు. ముందుగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. ఈ సందర్భంగా మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ, నిర్మాణ వ్యయం, అందుకు అవసరమైన రుణ సేకరణ అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్బీఐకాప్స్‌ను నియమించాలని నిర్ణయించారు. మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ ఇతర అంశాలపై ఎస్బీఐకాప్స్ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను చేపట్టనున్నారు. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి కేంద్ర ప్రభుత్వ అధికారితో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ ఉంటారు. ఈ ఇద్దరు అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు.

## తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయండి

- మొక్క జొన్న, జొన్నలను ఎంఎస్‌పిపై కొనుగోలు చేయాలి
- కేంద్ర మంత్రులకు తుమ్మల, ఉత్తమ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 23, (మనం బ్యూరో) :** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర ...మిగతా 2లో



## మళ్లీ బిల్లు సిద్ధం?



- ఈసారి 133వ రాజ్యాంగ సవరణగా..
- మహిళా చట్టం అమలు కోసం మళ్లీ తెరపైకి డీలిమిటేషన్

**ఢిల్లీ, జూన్ 23:** చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని భావించిన డీలిమిటేషన్ మళ్లీ తెరపైకి వస్తోంది. ఇందుకోసం మరోసారి రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అత్యున్నత స్థాయిలో ఇప్పటికే సంప్రదింపుల ప్రక్రియ పూర్తయినట్లు సమాచారం. ఈసారి 133వ రాజ్యాంగ సవరణ బిల్లుగా దీనిని తీసుకురానున్నట్లు తెలుస్తోంది. గత బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రతిపక్షాల వ్యతిరేకత కారణంగా వీగిపోయిన

# మమ్ముట్టి, డా.నోరికి పద్మభూషణ్

- మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌లకు పద్మశ్రీ ప్రదానం



**ఢిల్లీ, జూన్ 23:** ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ‘పద్మ’ అవార్డుల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం సాయంత్రం ఈ అవార్డులను ప్రదానం చేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తోపాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవ లందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా మిగతా వారికి నేడు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

## నక్సల్స్ హింస సమయంలో వారి చేతులు వణికాయ్

- కాంగ్రెస్ తీరుపై ప్రధాని మోడీ ధ్వజం

**ఢిల్లీ, జూన్ 23:** ప్రస్తుతం రాజ్యాంగాన్ని పైకెత్తి చూపుతున్న చేతులు... నక్సల్స్ హింస తీవ్రంగా ఉన్న సమయంలో గజగజ వణికేవంటూ కాంగ్రెస్‌ను, ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాలకు గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాలుగా ముద్ర వేసేవని, కానీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక వాటి రూపురేఖలను మార్చే సవాలును స్వీకరించిందని, అక్కడి ప్రజలను నిరాశ నుంచి బయటపడేసేందుకు కృషిచేసిందని తెలిపారు. దిల్లీలో సోమవారం జరిగిన రిపబ్లిక్ సమ్మిట్-2026లో ఆయన మాట్లాడారు. ‘‘ప్రభుత్వాలు ఎన్నిమారినా తరాలు ఎన్ని మారినా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ...మిగతా 2లో




ఒక్కరోజే 1.9కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా
హర్మూజ్‌లో ఆల్ టైమ్ రికార్డన్న ట్రంప్

9

రష్యాలో ‘హైవే ఆఫ్ డెత్’..
ఉక్రెయిన్ వ్యూహం

## కేంద్ర మంత్రి కురియన్ రాజీనామా

**ఢిల్లీ, జూన్ 23:** కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజ్యసభ పదవీ కాలం ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సారి భాజపా ఆయన్ను తిరిగి రాజ్యసభకు నామినేట్ చేయలేదు.

కురియన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. ఈ విషయాన్ని మంగళవారం రాష్ట్రపతి భవన్ ధ్రువీకరించింది. ఇప్పటి వరకు కురియన్ మైనార్టీ వ్యహారాల




శాఖతోపాటు మత్స్య, పాడి, పశుపోషణ శాఖలను కూడా సహాయ మంత్రి హోదాలో నిర్వహించారు.

ప్రస్తుతం కేంద్ర మంత్రి వర్గంలో ఏకైక క్రిస్టియన్ మంత్రి కురియన్ మాత్రమే. ఆయన రాజ్యసభ పదవీకాలం జూన్ 21తో ముగిసింది. మరో మంత్రి రవనీత్ సింగ్ బిట్టూను కూడా ఈ సారి పార్టీ రాజ్యసభకు నామినేట్ చేయని విషయం తెలిసిందే.

అమెరికా పౌరసత్వం

# మరింత ఖరీదు..!

**వాషింగ్టన్, జూన్ 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు. పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికొస్తే 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమల్లోకి వస్తే 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే ఖర్చుల మోత మోగనుంది. ఆ రుసుము 830 డాలర్ల నుంచి 1475 డాలర్లకు అంటే 645 డాలర్ల మేర పెరగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం.. దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డీహెచ్ఎస్ ప్రతిపాదించింది. 400 శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు.. తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.





యుద్ధం ముందున్న స్థితికి

## హర్మూజ్ ఎప్పటికీ తిరిగిరాదు

ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్

**టెహ్రాన్, జూన్ 23:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హర్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ ...మిగతా 2లో

# ట్రంప్‌తో ఏకాభిప్రాయం లేదు

- ఇరాన్‌కు అణ్వాయుధాలు దక్కనివ్వం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

**జెరూసలెం, జూన్ 23:** పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ తన ఆదేశాలను పాటిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఖండించారు. కొన్ని విషయాల్లో తమ మధ్య ఏకాభిప్రాయం లేదన్నారు. ‘‘ట్రంప్ నేను కోరుకున్నవన్నీ చేయరు. అలాగే ఆయన కోరుకున్నవన్నీ నేను చేయను. మేము స్వతంత్ర దేశాల నాయకులం. కొన్నిసార్లు మా అభిప్రాయాలు కలవవు. మా మధ్య ఏకాభిప్రాయం లేదు. అయినా మేము మా ప్రయోజనాల కోసం కలిసి నిలబడతాము. ఇజ్రాయెల్ ప్రయోజనాలు, భద్రత నాకు ముఖ్యం’’ అని జెరూసలెంలో నిర్వహించిన ఓ సదస్సులో నెతన్యాహు పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరినా, కుదరకపోయినా టెహ్రాన్కు తాము అణ్వాయుధం దక్కనివ్వబోమని నెతన్యాహు తేల్చిచెప్పారు. తాను ఇజ్రాయెల్ ప్రధానిగా ఉన్నంత కాలం ఇరాన్ అణ్వాయుధాన్ని పొందే అవకాశం లేదని ఉద్ఘాటించారు. ఈ అంశంలో ఎలాంటి దౌత్య పరిణామాలు చోటుచేసుకున్నా సరే, తన నిర్ణయం మారదని స్పష్టం చేశారు.



ఇరాన్ నేతతో డోభాల్ భేటీ

ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి (ఎస్ఎన్ఎస్సీ)లో రక్షణ వ్యవహారాల ఉప కార్యదర్శిగా ఉన్న ఘాదిర్ నెజామీపౌర్‌తో భారత జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ దిల్లీలో సోమవారం భేటీ అయ్యారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితులపై వారిద్దరూ చర్చించారు. బ్రిక్స్ ఎన్ఎస్ఏల సమావేశంలో పాల్గొనేందుకు నెజామీపౌర్ భారత్‌కు వచ్చారు.

యూరియా, డీఏపీ, సల్ఫర్ ఎరువులతో గతవారం హర్మూజ్‌ను దాటిన నాలుగు రవాణా నౌకలు భారత్‌లోని కృష్ణపట్నం, కాకినాడ, పారాదీప్, ముంద్రా రేవుల వైపు ప్రయాణిస్తున్నాయని కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది.

# ఏఐతో పబ్లిక్ సర్వీస్ కమిషన్ సైట్ హ్యాక్

జైపూర్, జూన్ 23: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్‌తో ఓ వ్యక్తి ఏకంగా పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను మోసం చేశాడు. ఎలాగైనా తనకే ఉద్యోగం దక్కాలన్న అత్యాశతో తోటి అభ్యర్థుల నుంచి పోటీ లేకుండా చేశాడు. చివరకు పోలీసులకు చిక్కాడు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

రాజస్థాన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాహుల్ కుమార్ మీనా




బీటెక్ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఝార్ఖండ్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. 2024లో అక్కడి ప్రభుత్వం నిర్వహించిన అసిస్టెంట్ మైనింగ్ ఇంజినీర్ పరీక్ష రాశాడు. గతేడాది జులైలో ప్రొవిజనల్ లిస్టు విడుదలైంది. 24 పోస్టులకు 78 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. తన కేటగిరీలో ఒక్క పోస్టుకు ఆరుగురు అభ్యర్థులు పోటీదారులుగా ఉన్నారు. రెండో స్థానంలో ఉన్న రాహుల్ ఉద్యోగం రాదేమోనని ఆందోళనతో తప్పుడు మార్గం ఎంచుకున్నాడు.

లిస్టులో మొదటి స్థానానికి చేరాలని కుట్ర పన్నాడు. ఇందుకోసం చాట్‌జీపీటీ, గ్రోక్, డీప్‌సీక్ వంటి ఏఐ టూల్స్ ఉపయోగించి అధికారిక వెబ్‌సైట్‌ను హ్యాక్ చేశాడు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోర్టల్లోకి వెళ్లి తనతో పోటీ పడుతున్న అభ్యర్థుల జాబితాను తొలగించాడు. సదురు అభ్యర్థులకు జాబితా నుంచి తొలగినట్లు సందేశం రావడంతో ప్రభుత్వ అధికారులను ఆశ్రయించారు. దీంతో సైబర్ పోలీసులు రంగంలోకి దిగారు. దర్యాప్తులో నిందితుడు రాహుల్ అధికారుల చేతికి చిక్కాడు. ఖాళీ సమయాల్లో ఏఐని ఉపయోగించి పలు వెబ్‌సైట్ల సర్వర్లను తనిఖీ చేసే అలవాటు ఉన్నట్లు అతడు దర్యాప్తులో పోలీసులకు చెప్పాడు.

## కాక్రోచ్ పార్టీ డైపర్ల విరాళాల ఉద్యమం

ఢిల్లీ, జూన్ 23: 'నీట్' పేపర్ లీకేజీ వ్యవహారం దేశ రాజధానిలో తీవ్ర దుమారం రేపుతోంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన ప్రదర్శనలు మంగళవారంతో



నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో, పేపర్ లీకేజీలపై తమ నిరసనను మరింత ఉధృతం చేసేందుకు ఆందోళనకారులు 'డైపర్ ఏ డే కీప్స్ లీక్స్ అవే' (రోజుకో డైపర్ లీకేజీలను అడ్డుకుంటుంది) అనే నినాదంతో ఒక వినూత్నమైన 'డైపర్ల విరాళాల ఉద్యమాన్ని' ప్రారంభించారు. జంతర్ మంతర్ వద్దకు వచ్చే వారు ఒక డైపర్‌ను తీసుకొచ్చి, దానిపై మంత్రి రాజీనామా చేయాలనే డిమాండ్‌ను రాసి ఇవ్వాలని, వాటిని విద్యాశాఖ మంత్రికి అందజేస్తామని నిరసనకారులు ప్రకటించారు.

## హార్ముజ్ ఎప్పటికీ తిరిగిరాదు

(మొదటి పేజీ తరువాయి)

తిరిగిరాదన్నారు. ''మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే'' అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హార్ముజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హార్ముజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.

## మళ్లీ బిల్లు సిద్ధం?

(మొదటి పేజీ తరువాయి)

సంగతి తెలిసిందే. ప్రతిపక్షాలు, రాష్ట్రాలు లేవనెత్తిన అనేక అభ్యంతరాలకు ఈసారి తీసుకొచ్చే బిల్లులో పరిష్కారాలను సూచించనున్నట్లు తెలుస్తోంది.



1971 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుతమున్న అంతర్రాష్ట్ర సీట్ల నిష్పత్తిలో ఎటువంటి మార్పులు లేకుండా బిల్లును రూపొందించినట్లు సమాచారం. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల్లో అంతర్గతంగా నియోజకవర్గాల సరిహద్దులు మారనున్నాయి. బిల్లు ఇప్పటికే సిద్ధమైందని, 55, 81, 82, 170, 330, 332, 334ఏ ఆర్టికల్లకు ఇది సవరణను సూచిస్తుందని తెలుస్తోంది. అందరికీ సమానంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో 50శాతం సీట్లను పెంచేలా ప్రతిపాదనలున్నట్లు సమాచారం.

**ఎస్సీ, ఎస్టీ సీట్ల పెరుగుదల**

డీలిమిటేషన్ తర్వాత లోక్‌సభలో ప్రస్తుతమున్న 84 ఎస్సీ సీట్లు 136కు పెరుగుతాయి. ప్రస్తుతం ఎస్సీలకు 15.46 శాతం సీట్లు రిజర్వుకాగా అవి 16శాతానికి విస్తరిస్తాయి. ఎస్టీ సీట్లు 47 నుంచి 70కి ఎగబాకుతాయి.

## నక్సల్స్ హింస సమయంలో వారి చేతులు వణికాయ్

(మొదటి పేజీ తరువాయి)

హింస అలాగే కొనసాగేది. సౌకర్యాలు కల్పించేవారు కాదు. ప్రభుత్వ వాహనాలు వెళ్లినా బుల్లెట్ల వర్షం కురిసేది. కానీ 2014 తర్వాత ఆ పరిస్థితి మారింది. నక్సల్ టెర్రరిజం ఇప్పుడు అంపశయ్యపై ఉంది. నక్సల్స్ ప్రభావిత జిల్లాలను మా ప్రభుత్వం ఆకాంక్షిత ప్రాంతాలుగా గుర్తించింది. ప్రస్తుతం అవే ఆయా ప్రాంతాల గ్రోత్ ఇంజిన్లుగా మారాయి. భారత్ ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థే కాదు. విశ్వసనీయ అంతర్జాతీయ శక్తి. ప్రపంచానికి వెయ్యేళ్ల భవిష్యత్తును నిర్మిస్తోంది'' అని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు.

# తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయండి

(మొదటి పేజీ తరువాయి)



వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంట నూనెల ఉత్పత్తిపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో 3 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికి పైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అదే విధంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీ అయిన మంత్రులు ఉత్తమ్, తుమ్మల ఈ ఏడాది వానాకాలం, వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డీఏపీ, యూరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందనీ, కేంద్రం కేటాయించిన కోటాకు, సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూడ్చి రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు. అదే విధంగా రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాతో భేటీ అయిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్ చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించడం రాష్ట్ర రైతాంగానికి ప్రయోజనకరంగా మారుతుందని ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల, ఉత్తమ్ వెల్లడించారు.

## ప్రతి తెలుగు ఇంట్లో అమెరికా భాగమైంది

- హైదరాబాద్ వారసత్వ సంపదను కాపాడటంలో మీ సహకారం అభినందనీయం
- మీరు డెవలప్‌మెంట్ సెంటర్ ఇస్తే మేం గ్లోబల్ సీఈవోలను ఇస్తాం
- అమెరికా 'ఫ్రీడం-250' వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, జూన్ 23 ( మనం బ్యూరో ) : హైదరాబాద్ ఐటీ రంగానికి మీరు డెవలప్‌మెంట్ ఇస్తే మేము మీకు ప్రపంచాన్ని నడిపించే గ్లోబల్ సీఈవోలను ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అమెరికా స్వాతంత్ర్యానికి 250 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్‌లో నిర్వహించిన 'ఫ్రీడం-250' వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్-అమెరికాకు ఉన్న అనుబంధం కేవలం రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న దౌత్య సంబంధం కాదనీ, ఇది ప్రజల మధ్య కుటుంబాల మధ్య ఏర్పడిన అనుబంధమని పేర్కొన్నారు. ఈ రోజు మన ఇళ్లలో అమెరికా అనేది మ్యాప్‌లో చూసే దేశం కాదు, అక్కడ చదువుకుంటున్న మన పిల్లలు, ఉద్యోగాలు చేస్తున్న బంధువులు, స్టార్టప్‌లు పెడుతున్న యువత రూపంలో అమెరికా ప్రతి తెలుగు ఇంట్లోనూ భాగమైందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు మనం అమెరికాకు వెళుతున్నాం అని కాదు, తెలుగే నేరుగా అమెరికాకు వెళ్లి పోయింది. అక్కడ వేగంగా విస్తరిస్తున్న భాషగా తెలుగు నిలవడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్-2025లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా అమెరికాతో ఉన్న ప్రత్యేక అనుబంధానికి గుర్తుగా ఇక్కడి యూఎస్ కాన్సులేట్ సమీపంలోని ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని నిర్ణయించామని గుర్తు చేశారు. డెక్కన్ సంస్కృతి ఉట్టిపడేలా నిర్మించిన యూఎస్ కాన్సులేట్ కొత్త భవనం సాంస్కృతిక దౌత్యానికి ప్రతీక అనీ, హైదరాబాద్ వారసత్వ సంపదను కాపాడటంలో అమెరికా అందిస్తున్న సహకారం అభినందనీయమని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## శాస్త్రోక్తంగా శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- జూన్ 24న అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం
- జూన్ 29న గరుడసేవ – జూలై 2న రథోత్సవం

తిరుపతి జూన్23 మనం న్యూస్: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందుగా నిర్వహించే పవిత్రమైన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మంగళవారం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. జూన్ 24 నుండి జూలై 3 వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక శోభను మరింత పెంపొందించే ఈ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, అర్చన అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఆలయ గర్భగుడి, ప్రాకారాలు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షించారు. ఈ పవిత్ర కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సుగంధాలతో పరిమళించి, భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు.వార్షిక బ్రహ్మోత్సవాలకు నాంది పలుకుతూ జూన్ 24న రాత్రి 7.30 గంటలకు అంకురార్పణం నిర్వహించనున్నారు. జూన్ 25న ధ్వజారోహణంతో సకల దేవతలను ఆహ్వానిస్తూ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమవుతాయి. ఉత్సవాల్లో భాగంగా జూన్ 28న ఆర్జిత కల్యాణోత్సవం, జూన్ 29న గరుడసేవ, జూలై 2న రథోత్సవం, జూలై 3న చక్రస్నానం, ధ్వజావరోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించనున్నారు.ఈ దివ్య బ్రహ్మోత్సవాల్లో



పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి కృపాకటాక్షాలను పొందాలని టీటీడీ కోరుతోంది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, అధికారులు, సిబ్బంది, వారి సేవకులు పాల్గొన్నారు.

# ఆదాయానికి మించి... ఆర్జించాడు

(మొదటి పేజీ తరువాయి)

సికింద్రాబాద్ మచ్చబొల్లారంలో తనిఖీలు చేపట్టి దాదాపు రూ.3 కోట్లు విలువ చేసే ఆస్తులు గుర్తించి వాటిని సీజ్ చేశారు. అలాగే మల్లారెడ్డి ఇళ్లు, బంధువులు, స్నేహితుల ఇళ్లు వెరసి మొత్తం 11 చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ నరేష్ మాట్లాడుతూ ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో ఇప్పటివరకు మల్లారెడ్డి వద్ద రూ.3 కోట్లు విలువైన ఆస్తులను గుర్తించామన్నారు. అల్వాల్‌లోని ఆయన నివాసంలో రూ.3 లక్షలు నగదు, నిజామాబాద్, సిద్దిపేటతో పాటు హైదరాబాద్‌లో ఇల్లు, ప్లాట్లు గుర్తించామన్నారు. బ్యాంకు లాకర్లను గుర్తించి వాటిని తెరిస్తే ఆయనకు సంబంధించిన ఆస్తుల వివరాలు తెలుస్తాయని, ఆయన ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

## ఏటీఎంలో పెట్టాల్సిన డబ్బులు చోరీ

### రూ.17 లక్షలతో వ్యాన్ డ్రైవర్ పరార్



హైదరాబాద్,జూన్ 23(మనం,ప్రత్యేక ప్రతినిధి) : హైదరాబాద్ నగరంలోని సంతోష్‌నగర్‌లో మంగళవారం ఏటీఎంలో పెట్టాల్సిన డబ్బును దుండగులు చోరీ చేశారు. ఏటీఎంలో డబ్బు పెట్టేందుకు వచ్చిన సిబ్బంది లోపలికి వెళ్లగానే అక్కడే బైక్ ఉన్న ఇద్దరు వ్యక్తులు వ్యాన్‌లోని రూ.17 లక్షల డబ్బు ఉన్న ట్రంక్ పెట్టెను తీసుకుని పరారయ్యారు. ఈ చోరీ తర్వాత ఆ డబ్బు తీసుకువచ్చిన వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించక పోవడంతో అతడిపైనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రంగంలోకి దిగిన పోలీసులు.. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. సంతోష్ నగర్ పరిధిలో దారి దోపిడి సంచలనం సృష్టిస్తోంది. ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో ఉన్న ఏటీఎంలలో నగదును నింపే.. ఒక క్యాష్ మేనేజ్‌మెంట్ వ్యాన్ డ్రైవర్.. మిగిలిన సిబ్బందిని ఏమార్చి రూ.17 లక్షల డబ్బుతో ఉడాయించాడు. ఈ చోరీ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందడంతో రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఆ దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా రెయిన్ బజార్-సంతోష్ నగర్ ప్రధాన రహదారిపై జరిగిన ఈ ఘటనలో వ్యాన్ డ్రైవర్.. ముందుగానే వేసుకున్న ప్లాన్ ప్రకారం.. నగదును ఎత్తుకెళ్లిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి



తిరుపతి, జూన్ 23(మనంప్రతినిధి : తిరుపతి జిల్లాలో ఆహార భద్రత ప్రమాణాల చట్టం, 2006 అమలులో భాగంగా ఆహార భద్రతాధికారులు వివిధ ఆహార వ్యాపార సంస్థల నుండి సేకరించిన ఆహార నమూనాలను ప్రభుత్వ ఆహార ప్రయోగశాలలకు పంపగా, వాటిలో కొన్ని నమూనాలు నాణ్యత లోపం కలిగినవి, తప్పుడు లేబులింగ్ కలిగినవి గా నిర్ధారణ అయినవి.

ఈ మేరకు సంబంధిత ఆహార వ్యాపార నిర్వాహకులపై ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006 ప్రకారం కేసులు నమోదు చేసి, తిరుపతి జిల్లా అడ్జుడికేటింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎదుట విచారణకు పంపించబడినవి.

విచారణ అనంతరం మొత్తం 19 కేసులలో సంబంధిత ఆహార వ్యాపార నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసుల తీవ్రత, ఉల్లంఘన స్వభావం మరియు ప్రజారోగ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూ. 3.14 లక్షల మేర జరిమానాలు విధించబడినవి.

ఈ కేసులలో తిరుపతి జిల్లా, చిన్నగొట్టిగల్లు మండలం, బాకరాపేటలోని ఒక ఐస్క్రీమ్ దుకాణం నుండి సేకరించిన వెన్నెల ఐస్క్రీమ్ నమూనా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో సంబంధిత వ్యాపారిపై రూ.6,000/-జరిమానావిధించబడింది.అలాగే తిరుపతి నగరంలోని వెంగమాంబ సర్కిల్ వద్ద గల ఒక బేకరీ స్వీట్ షాప్ నుండి సేకరించిన ఆలూ చిప్స్ నమూనా నాణ్యత లేనిదిగా నిర్ధారణ కావడంతో సంబంధిత వ్యాపారిపై రూ.15,000/- జరిమానా విధించబడింది.

## బీసీల విద్యకు 'కూటమి' దన్ను

- సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు

(అమరావతి,జూన్,23,మనం ప్రత్యేక ప్రతినిధి) : విద్యతోనే బీసీలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనేది సీఎం చంద్రబాబునాయుడు బావన. ఇటీవల ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. ఇపుడు బీసీ విద్యార్థులకు మేలు కలిగేలా నూతన విద్య సంస్థలు నెలకొల్పాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పది మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ఈ కొత్త గురుకులాల్లో 37 మంది చొప్పున్న ఉద్యోగులను భర్తీ చేయనున్నారు. ఈమేరకు మంగళవారం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో బీసీ బిడ్డలందరూ విద్య అభ్యసించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడి బయట ఏ బీసీ బిడ్డా ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశం. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు బీసీ హాస్టళ్లు, మరో ఎంజేపీ గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. సకాలంలో డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్యమిస్తోంది. దీంతో బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టింది. ఇటీవల 6 గురుకులాలు అప్ గ్రేడ్ ఎంజేపీ గురుకులాల సీట్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. కొత్తవలస(విజయనగరం), ఆత్మకూరు, గోలగముడి(నెల్లూరు), కలికిరి(అన్నమయ్య), ఓనిపెంట (కడప), నాసనకోట (శ్రీ సత్యసాయి జిల్లా) ఎంజేపీ గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేశారు. ఆయా గురుకులాలల్లో తరగతులు సైతం ప్రారంభమయ్యాయి. బడి బయట ఏ ఒక్క బీసీ బిడ్డా ఉండకూడదనే సీఎం చంద్రబాబు లక్ష్యాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. బీసీల విద్యకు ప్రాధాన్యమిస్తూ, కొత్తగా పది ఎంజేపీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. ఇటీవలే ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా కూటమి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. బీసీల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

# రాయలసీమలో 'పసిడి' పంట

- స్వర్ణగిరిగా... ఇక జొన్నగిరి
- రూ.405 కోట్లతో జియో మైసూర్ సర్వీసెస్, డెక్కన్ గోల్ మైన్స్ పెట్టుబడి
- ఏడాదికి 400 కేజీలు, 900 కేజీలు, 2 టన్నులు–దశల వారీగా పెరగనున్న బంగారం వెలికితీత
- ఉత్పత్తి అయిన బంగారం విలువలో రాష్ట్ర ఖజానాకు 4 శాతం రాయల్టీ
- గోల్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

తుగ్గలి జూన్ 23:- (మనం న్యూస్ ): బంగారు నిక్షేపాల గని అంటే కర్నాటక రాష్ట్రంలోని కేజీఎఫ్ గుర్తొచ్చేది... కానీ ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి పేరు మారుమోగనుంది. కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదిక కానుంది. దేశంలోనే ప్రైవేట్ రంగంలో అతిపెద్ద గోల్ మైనింగ్ ప్రాజెక్టు కర్నూలు జిల్లా జొన్నగిరిలో ఏర్పాటైంది. జొన్నగిరి గోల్ ఫీల్డ్కు ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రస్తుతం మొదటి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు జరగనున్నాయి. దీనికి తగినట్టుగా ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటయ్యాయి. రెండో దశలో మిగిలిన ప్రాంతంలోనూ ప్లాంట్ విస్తరించున్నారు. ప్రస్తుతం ఏర్పాటైన ఈ ప్లాంట్ ద్వారా తొలి ఏడాదికి 400 కిలోల పసిడిని ఉత్పత్తి చేయనున్నారు. వచ్చే ఏడాది నుంచి 900 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తారు. ఈ రకంగా ఏ ఏడాదికి ఆ ఏడాది



ఉత్పత్తి పెరుగుతూ... ఏడాదికి 2 టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయనున్నారు. ఈ మేరకు ప్లాంట్ సామర్థ్యాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని విస్తరించనున్నారు.

ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ఉపాధి లభిస్తుంది. ఇక ఉత్పత్తి చేసిన బంగారం ధరలో 4 శాతం రాష్ట్రానికి రాయల్టీగా వస్తుంది. మొదట తీసే 400 కేజీలకు రూ.57 కోట్లు, 900 కేజీలకు రూ.144 కోట్ల వరకూ రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

**ప్రారంభోత్సవం... శంకుస్థాపన**

కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గోల్ మైనింగ్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. అనంతరం ప్లాంట్ విస్తరణలో భాగంగా రెండో యూనిట్కు శంకుస్థాపన చేయనున్నారు. జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు రూ.405 కోట్ల పెట్టుబడితో బంగారు నిక్షేపాలు వెలికితీసే ఈ కర్మాగారాన్ని నెలకొల్పాయి. ఇందుకు అవసరమైన నీటి కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 18 కి.మీ. పైపులైన్తో 0.021 టీఎంసీలను వినియోగించనున్నారు. ఈ మేరకు రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా బంగారం ఉత్పత్తి పనులు ప్రారంభంకానున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే గనిలో ట్రయల్ రన్స్ కూడా పూర్తయ్యాయి.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

కర్నూలు జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. జొన్నగిరిలో బంగారం శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం సహా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి 11.30 గంటలకు జొన్నగిరికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్లాంట్ మొదటి యూనిట్ ను ప్రారంభించి... అనంతరం జీఈఓ మైసూర్ ప్లాంట్ రెండో యూనిట్కు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12.20 గంటలకు జొన్నగిరిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 3 గంటలకు పత్తికొండ నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం అవుతారు.

# యూరియా యాప్‌పై నిరసన.. వేముల ప్రశాంత్ రెడ్డి గృహ నిర్బంధం

## యాప్ రద్దు చేయాలంటూ వేముల డిమాండ్

## తాడ్వాయి మండలంలో రైతు ధర్నాకు బీఆర్ఎస్ నిర్ణయం

## ఇంటి నుంచి వెళుతుండగా అడ్డుకున్న పోలీసులు



**హైదరాబాద్ జూన్ 23 (మనం న్యూస్):** 'యూరియా యాప్' వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వం తెచ్చిన ఈ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలంలో ఒక భారీ రైతు ధర్నా చేపట్టాలని ప్రశాంత్ రెడ్డి నిర్ణయించారు. దీంతో

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు.. ఆ ధర్నాకు ప్రశాంత్‌రెడ్డిని వెళ్లనియకుండా పోలీసులు ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. ఇంటి నుంచి బయటకు రాకుండా ఆయనను గృహ నిర్బంధంలో ఉంచారు. అయితే, మరి కాసేపట్లో వేలాది మంది రైతులు ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ఈ ధర్నాలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయల్దేరేందుకు వేముల సిద్ధమవగా... పోలీసులు ఆయనను నిలువరించారు. ఆయనను గృహ నిర్బంధం చేశారు.

# పేరు పెట్టండి...లక్ష పట్టండి

- తెలంగాణ హౌసింగ్ బోర్డ్ బంపర్ ఆఫర్..
- పేరు సూచిస్తే లక్ష రివార్డ్
- హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి భారీ పథకం
- జూన్ 28వ తేదీ తుది గడువు

**హైదరాబాద్,జూన్23(మనం న్యూస్):** హైదరాబాద్ నగరంలో ప్రతిపాదిత భారీ గృహ నిర్మాణ పథకానికి ఆకర్షణీయమైన పేరును సూచించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రజలను కోరుతోంది. ఈ పథకానికి అత్యుత్తమ పేరును సూచించిన విజేతకు తెలంగాణ గృహనిర్మాణ సంస్థ (టీజీహెచ్‌బీ) రూ. లక్ష నగదు బహుమతిని ప్రకటించింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాంతంలో లక్ష ఇళ్లను నిర్మించాలన్నది ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ భారీ ప్రాజెక్టుకు సముచితమైన పేరును నిర్ణయించే ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలని భావిస్తున్నట్లు హౌసింగ్ బోర్డ్ వైస్-ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తమ సూచనలను హౌసింగ్ బోర్డ్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా సమర్పించవచ్చు. పేర్లను పంపేందుకు 2026 జూన్ 28వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు.

**పేద ప్రజల సొంత ఇంటి కల:**

క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల ప్రజల కోసం ప్రత్యేకంగా లక్ష ఇండ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంతర్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎటువంటి వివాదాలు లేకుండా, అందుబాటులోని ధరల్లో వివిధ వర్గాల ప్రజల సొంత ఇంటి కలలను నెరవేర్చడంలో హౌసింగ్ బోర్డుకు మంచి పేరు ఉంది. అంతే కాకుండా బోర్డు ఆధ్వర్యంలో చేపట్టి ప్రాజెక్టులకు ప్రజల నుంచి ఆదరణ తో పాటు డిమాండ్ కూడా ఉన్నదని గౌతమ్ గుర్తు చేశారు.

ఈ నేపథ్యంలో సుదీర్ఘం కాలం తరువాత చేపడుతున్న ప్రాజెక్టులో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలన్న ఆలోచనతో, ప్రజల నుంచి అందే సూచనల తోనే ఈ పథకానికి పేరును కూడా ఖరారు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోటీని నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజలు సూచించిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తామన్నారు.క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ ఐజి ఫ్లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని, ఇందుకు అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయిస్తామని, పూర్తి విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన హౌసింగ్ బోర్డ్ వైస్-ఛైర్మన్ గౌతమ్ పేర్కొన్నారు.

# పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పురోగతిలో విశిష్ట ఫలితాలు సాధించిన రవాణశాఖ



**శ్రీకాళహస్తి జూన్ 23 మనం న్యూస్:** తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయాలు ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడంలో విశిష్ట ఫలితాలను సాధిస్తున్నాయని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు.ప్రభుత్వ సేవలపై ప్రజల అభిప్రాయాలను అంచనా వేయుటకు నిర్వహించబడుతున్న ఫీడ్బ్యాక్ వ్యవస్థలో,మోటారు వాహన తనిఖీ అధికారి చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో పుత్తూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం గత రెండు నెలలుగా వరుసగా 100 శాతం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (పి3) నమోదు చేసి రాష్ట్రంలో వరుసగా రెండు సార్లు ప్రథమ స్థానం పొందడం విశేషమని

అదేవిధంగా, మోటారు వాహన తనిఖీ అధికారి దామోదర నాయుడి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మోటార్ వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం 96 శాతం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ నమోదు చేసి రాష్ట్రంలో ద్వితీయ స్థానం పొందడం కూడా ప్రశంసనీయమని తెలిపారు.ఈ ఫలితాలు సంబంధిత మోటార్ వాహనాల తనిఖీ అధికారులు, సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారులు కార్యాలయ సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతకు, వారి అంకితభావానికి, క్రమశిక్షణకుసేవా దృక్పథానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శక మర్యాదపూర్వక సేవలు అందించడంతో పాటు, సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం వల్లనే ఈ స్థాయి ప్రజాదరణ లభించిందని తెలిపారు.

# యూరియా బుకింగ్.. మరింత ఈజీ గురూ




## ఫర్టిలైజర్ యాప్‌లో కీలక మార్పులు

## సాగుకు సిద్ధమైన రైతులకు భారీ ఊరట

### ఏ పంట వేసినా.. ఎకరానికి గరిష్టంగా 2 బస్తాలే

### బుకింగ్‌రిజిస్టర్డ్ మొబైల్‌తో యూరియా బుక్ చేసుకునే సదుపాయం కల్పించిన ప్రభుత్వం

**హైదరాబాద్, జూన్ 23 (మనం న్యూస్):** వానాకాలం సీజన్ పంట సాగు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో కీలక మార్పులు చేసింది. ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఇకపై మండల యూనిట్‌గా బుకింగ్స్ జరగనున్నాయి. ఏ మండల రైతు ఆ మండలంలోనే యూరియా కొనుగోలు చేయాలి. అలాగే పంట ఏదైనా ఎకరానికి గరిష్టంగా 2 బస్తాలకే పరిమితి విధించారు. ప్రతిసారీ ఓటీపీ అవసరం లేకుండా యాప్‌ను సరళీకరించారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు రైతులు యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవచ్చు.

వానాకాలం పంట సీజన్ ప్రారంభమైంది. ఈ తరుణంలో రైతులకు సకాలంలో, పారదర్శకంగా ఎరువులను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. గతంలో ఎదురైన ఇబ్బందులు, అక్రమాలను దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ సాగు సమయానికి ఎరువుల పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసింది. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లో కీలక మార్పులు, అప్డేట్లను తీసుకొచ్చారు. గతంలో ఈ యాప్ ద్వారా ఎక్కడి వారైనా, ఏ ప్రాంతంలోనైనా యూరియా బుక్ చేసుకునే వెసులుబాటు ఉండటంతో.. స్థానిక రైతులకు ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుత సీజన్ నుంచి మండల యూనిట్ విధానాన్ని అమలుల్లోకి తీసుకొచ్చారు. దీనివల్ల రైతులు కేవలం తమ సొంత మండల పరిధిలోనే యూరియా బుకింగ్ చేసుకోవడానికి వీలుంటుంది. ఫలితంగా స్థానిక రైతులకు సకాలంలో ఎరువుల కోటా దక్కనుంది. గతంలో కొందరు ఎరువుల డీలర్లు తమకు తెలిసిన వారికి ముందే సమాచారం అందించి ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు చూపిస్తూ నిల్వలను ఆఫ్‌లైన్ ద్వారా పక్కదారి పట్టించేవారనే ఆరోపణలు వచ్చాయి. దీన్ని నిరోధించేందుకు ప్రభుత్వం యాప్‌లో అదనపు సెక్యూరిటీ, టైమ్ లాకింగ్ ఫీచర్లను జోడించింది. ఇకపై డీలర్లు తమ వద్ద ఉన్న యూరియా స్టాక్‌ను మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేసినా.. అది రైతులకు మరుసటి రోజు ఉదయం 7 గంటలకే స్క్రీన్‌పై కనిపిస్తుంది. అలాగే ఉదయం 7 గంటల తర్వాత ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తే.. అది మధ్యాహ్నం 3 గంటలకే రైతులకు అందుబాటులోకి రానుంది. ఈ నిబంధన వల్ల ఎరువుల నిల్వలపై పారదర్శకత పెరగనుంది. రైతులు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు యాప్ ఓపెన్ చేసి తమకు కావలసిన యూరియాను సులభంగా బుక్ చేసుకోవచ్చు.

గతంలో పలువురు రైతులు, వ్యాపారులు యూరియా కొరత వస్తుందనే భయంతో పంటల నమోదు సమయంలో మొక్కజొన్న పంటను ఎంపిక చేసుకునేవారు. ఎందుకంటే మొక్కజొన్న సాగు చేసే రైతులకు ఎకరాకి 5 బస్తాల యూరియా అందించే వెసులుబాటు ఉండేది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు అవసరం లేకపోయినా ఎక్కువ బస్తాలను పొంది నిల్వ చేసుకునేవారు. ఈ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవసాయ శాఖ ఈసారి నిబంధనలను కఠినతరం చేసింది. ఈ వానాకాలం సీజన్ నుంచి రైతులు ఏ పంట సాగు చేసినా సరే.. ఎకరానికి కేవలం 2 బస్తాలు మాత్రమే బుకింగ్ అవుతాయి. ఒక ఎకరం భూమి ఉన్న రైతుకు ఒకే విడతలో గరిష్టంగా రెండు బస్తాలు మాత్రమే బుకింగ్ చేసుకునేలా యాప్‌లో పరిమితి విధించారు.

సాంకేతిక ఇబ్బందులను తొలగించడంలో భాగంగా ఐటీ విభాగాధికారులు ఈ ఫర్టిలైజర్ యాప్‌ను పూర్తిగా అప్‌డేట్ చేశారు. గతంలో యూరియా బుకింగ్ చేసే సమయంలో ప్రతిసారీ మొబైల్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ వచ్చే వరకు వేచి చూడాల్సి వచ్చేది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల వల్ల ఓటీపీలు సకాలంలో రాక రైతులు బుకింగ్ చేసుకోలేకపోయేవారు. ఈ సమస్యను పరిష్కరిస్తూ.. ఇకపై ప్రతిసారి ఓటీపీతో లాగిన్ అవ్వాల్సిన అవసరం లేకుండా, రిజిస్టర్డ్ మొబైల్ ద్వారా నేరుగా యాప్‌లోకి ప్రవేశించి కేవలం కొన్ని క్లిక్‌లతోనే యూరియా బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 5 నెలల నుండి మాకు జీతాలు లేవు?

## తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ .. ఎంప్లాయిస్ మహాధర్నా





**హైదరాబాద్, జూన్ 23 (మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు.. తాము వస్తే? ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని.. ఎన్నికల మేనిఫెస్టోలో సైతం చెప్పి మాట తప్పిందని తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ మహాధర్నా చేపట్టారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి కూడా రెండున్నరేళ్లు దాటిపోయింది. కానీ, ఇప్పటికీ దాని అలాంటి ఊసే లేదన్నారు. వేతనాల కోసం ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ మంగళవారంనాడు మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మూడు నెలల నుండి మాకు జీతాలు లేవు.. బైట వడ్డీలకు తెచ్చి ఇంటి రెంట్లు, పిల్లల స్కూల్ ఫీజులు కడుతున్నామని వారు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఓ ఉద్యోగి మాట్లాడుతూ.. ఒకటే తారీఖున జీతమేస్తమన్నరు.. ఇప్పటిదాకా రెన్యూవల్ కూడా లేదు. ఏప్రిల్ నుంచి రెన్యూవల్ కావాలి.. ఏప్రిల్, మే, జూన్ కావొస్తుంది.. ఈ మూడు నెలల పెండింగ్ వేతనాలు కూడా అట్లనే ఉన్నాయి. మాకు వేరే ఏ సౌకర్యాలు కూడా లేవు. ఇంక్రిమెంట్లు లేవు.. డీఏలు లేవు. కనీసం జీతమన్నా ఇయ్యాలి.. అది కూడా లేదు కదా.. ఒకటో తారీఖు అని పేపర్లలో, మీడియాలో వస్తుంది కానీ.. దానికి సంబంధించిన ఫైల్స్ కదలడం కానీ..ఉద్యోగులకు జీతాలు క్రెడిట్ చేయడం కానీ ఏం చేయడం లేదు. బయట నుంచి వడ్డీలకు తెచ్చుకోవడం కానీ.. బంగారం తాకట్టు పెట్టుకోవడం కానీ చేసి పిల్లలకు బుక్స్ కొంటున్నం.. ఫీజులు కానీ కడుతున్నం. అద్దె కూడా.. పాలబిల్లు, కిరాణం బిల్లు ఇప్పుడు అన్నీ రేట్లు పెరిగినయ్.

**5 నెలల నుండి జీతాలు లేవు?: ఉస్మానియా ఔట్సోర్సింగ్ ఉద్యోగిని ఆవేదన**

మాకు పనికి తగ్గట్లు ప్రతినెలా సమయానికి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ధర్నాలో పాల్గొన్న మరో మహిళా ఉద్యోగి మాట్లాడుతూ.. నేను ఉస్మానియా ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా వర్క్ చేస్తున్నానంది. గత సంవత్సరాలుగా లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఐసీయూ విభాగంలో పనిచేయబట్టి 7 సంవత్సరాలు అవుతుందన్నారు. తమకు 5 నెలలుగా జీతాలు లేవని ఆవేదన వ్యక్తం చేసింది. తాము రెగ్యులర్‌గా, కంటిన్యూగా డ్యూటీకి వస్తున్నాం.. ఒక్క నెల పడ్డది అంతే.. ఇక మిగిలియ్ అయితే బడ్జెట్ లేదని అంటున్నారు. కానీ, ఇక్కడ మాత్రం బిల్ ఉందని అంటున్నారు. కానీ ఇంతవరకు ఆ బిల్లు వెళ్లలేదు. మాకు జీతాలు కూడా రాలేదు. మేం అతి కష్టం మీద డ్యూటీకి వస్తున్నాం. చేతుల్లో డబ్బుల్లేకున్నా.. మా ఇంట్లో ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా కానీ మేం డ్యూటీ చేస్తున్నాం. ఇంట్లో మా ఫ్యామిలీలో కూడా ఎవరూ ఆరోగ్యంగా లేరని వాపోయింది. సాలరీలు లేకపోతే మీరు కూడా వెళ్లిపోండని వాళ్లు కూడా అంటున్నారు. మా దగ్గర బడ్జెట్ కూడా ఏం లేదు. మా ఆయన కూడా ఈరోజు పనిచేస్తేనే రేపు పూట గడవని పరిస్థితి మాది. మేం అలాంటి కండిషన్స్లో పని చేస్తున్నాం. పేరుకు పెద్దాసుపత్రి. ఇలాంటి పెద్దాసుపత్రిలో మేం డ్యూటీ చేస్తున్నమంటేనే మహా ఎక్కువ. మా వేతనాలు ప్రభుత్వమే నేరుగా ఇవ్వాలి. సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలి. ఒక రోజు తిండి ఉండి ఇంకో రోజు తిండి లేక గడుపుకుంటున్నమంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రజా పాలన- ప్రజా ప్రభుత్వం అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ హయాంలో అత్యవసరం వైద్య సేవలందించే ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదిలాఉంటే, యుద్ధం కారణంగా 2021 నుంచి ఇప్పటివరకు గదే జీతం ఉంది.. 15 వేలుంటే అంతే.. 20 వేలు ఉంటే అంతే ఉంది.. మిగితా ధరలన్నీ పెరిగినయ్ కానీ మావి మాత్రం రూపాయి కూడా పెరుగలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు.



# ఆర్ఎస్.ప్రవీణ్‌పై కథనాలు..

## మహా న్యూస్ ఎండీపై కేసు నమోదు

**హైదరాబాద్, జూన్ 23 (మనం న్యూస్):** బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్.ప్రవీణ్‌ను ఉద్దేశించి తప్పుడు కథనాలు ప్రసారం చేశారంటూ మహా న్యూస్ చానెల్ ఎండీ వంశీకృష్ణపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోక్సో కేసు సందర్భంలో బాధితుల పక్షాన నిలబడి పోరాడిన బీఆర్ఎస్ నేత ఆర్ఎస్.ప్రవీణ్‌ను లక్ష్యంగా చేసుకుని మహాన్యూస్ చానెల్‌లో అడ్డగోలు కథనాలు ప్రసారం ప్రసారం చేసిన కథనాలు, దళిత వర్గానికి చెందిన బీఆర్ఎస్ కీలక నేత డా. ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయని, సమాజంలో వివిధ వర్గాలను రెచ్చగొట్టి ప్రశాంత వాతావరణాన్ని పాడుచేసేలా ఉన్నాయని సీహెచ్.ఉదయ్ కుమార్ అనే వ్యక్తి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన సైబరాబాద్ పోలీసులు ఘటనా స్థలం జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలోకి వస్తున్నందున కేసును జూబ్లీహిల్స్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు నిందితుడు మహా న్యూస్ వంశీపై బీఎన్ఎస్ 352 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఫైర్ సేఫ్టీ విస్మరిస్తే కఠిన చర్యలు




**మాదాపూర్,కొండాపూర్‌లో ఆకస్మిక తనికీలు**

**డీఎఫ్ఓ ఖాజా కరీముల్లా**

**హైదరాబాద్,జూన్ 23(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** భారీ భవనాలు, వాణిజ్య సముదాయాలలో అగ్నిమాపక శాఖ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా అగ్నిమాపక అధికారి-1 ఖాజా కరీముల్లా హెచ్చరించారు. ఈక్రమంలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు మంగళవారం మాదాపూర్, కొండాపూర్ ప్రాంతాల్లో వాణిజ్య సంస్థ, ఓ భారీ భవనంలో ఆకస్మిక తనికీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి ఖాజా కరీముల్లా మాట్లాడుతూ అగ్నిప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అగ్నిమాపక శాఖ నిబంధనలను పాటించాలని, లేని పక్షంలో అక్కడ జరిగే ప్రమాదాలకు ఆయా భవన యజమానులను బాధ్యలను చేస్తామన్నారు. వాణిజ్య సముదాయాలలో, భవనాలలో నివాసముంటున్న వారితో పాటు వాణిజ్య సముదాయాల్లో వచ్చే సందర్శకుల భద్రత కోసం ఖచ్చితంగా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలన్నారు. మాదాపూర్, ఎస్బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, 100 ఫీట్ రోడ్, ఎక్సెల్లో బిల్డింగ్, 7వ అంతస్తులో ఉన్న స్కై100 కిచెన్ అండ్ బార్, కొండాపూర్, న్యూ హఫీజ్‌పేట్, మార్తాండ నగర్‌లోని వెంకటేశ్వర కోలివింగ్ పీజీ హాస్టల్లో ఆకస్మిక తనిఖీలలో నిర్వహించామన్నారు. తనికీల సందర్భంగా అగ్నిమాపక పరికరాలు, వ్యవస్థల లభ్యత, వాటి పనితీరు, అత్యవసర బయటకు వెళ్లే మార్గాలు, తరలింపు మార్గాలను పరిశీలించామన్నారు. అయితే తనిఖీ బృందం పరిశీలనలో ఆయా ప్రాంగణాల్లో అగ్నిమాపక పరికరాలు అందుబాటులో లేవని గుర్తించామని, ఆయా భవన యజమానులపై అగ్నిమాపక సేవల చట్టంలోని నిబంధనల ప్రకారం డీఎఫ్ఓ తేల్చిచెప్పారు. భారీ భవనాలకు సంబంధించిన యజమానులు అగ్ని భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించి ఆయా ప్రాంగణాల భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని డీఎఫ్ఓ సూచించారు. ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్ ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతా చర్యలపై నిరంతర నిఘా సారించడంతో పాటు ఆకస్మిక తనికీలు చేపడతామని డీఎఫ్ఓ హెచ్చరికలు జారీ చేశారు.

# రాష్ట్ర సాధనలో జర్నలిస్టులు పాత్ర కీలకం

- ఉద్యమకారుల గుర్తింపులో వారికి ప్రాధాన్యత ఇవ్వాలి
- చైర్మన్ కేకే కు వినతి పత్రాన్ని అందించిన టీయుడబ్ల్యూజే



**హైదరాబాద్,జూన్23(మనం న్యస్):** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన చారిత్రాత్మక మహా ఉద్యమంలో, క్రియాశీలక పాత్రను పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి, వారి సేవలకు, త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావును బంజారా హిల్స్ లోని ఆయన నివాసంలో సమావేశమై వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో జర్నలిస్టులు కేవలం వార్తలను సేకరించి ప్రచారం చేసే బాధ్యతకే పరిమితం కాలేదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను, ఆవేదనను, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేస్తూనే, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, వాస్తవాలను ప్రజలకు చేరవేసి ఉద్యమానికి నైతిక బలం చేకూర్చడం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తించారని ఆయన అన్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న వివక్షను, సామాజిక-ఆర్థిక అసమానతలను, ప్రాంతీయ అన్యాయాలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకువచ్చారన్నారు. అనేక ప్రాంతాల్లో జర్నలిస్టులు ఉద్యమకారులతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారని, పలుచోట్ల ఉద్యమ జాయింట్ యాక్షన్ కమిటీలకు నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేశారు. ఉద్యమ సమయంలో పోలీసులు జర్నలిస్టులపై లాఠీచార్జీలు జరిపిన సంఘటనలు ఎన్నో చోట్ల చోటుచేసుకున్నాయని, ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా యూనివర్సిటీతో పాటు పలు చోట్ల పోలీసులు కెమెరాలను ధ్వంసం చేయడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, గాయపర్చడం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. అయినప్పటికీ విధినిర్వహణలో జర్నలిస్టులు వెనుకడుగు వేయలేదని, తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను నిర్వర్తించారన్నారు. అలాగే ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నందుకు పలువురు జర్నలిస్టులు తమ ఉద్యోగాలను కూడా కోల్పోయారని, కొందరు యాజమాన్యాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నారని, మరికొందరు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, అయినా వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి తెలంగాణ సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేశారని విరాహత్ తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక కమిటీ ఈ అంశాన్ని సానుభూతితో పరిశీలించి, ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని సేవలందించిన జర్నలిస్టులకు ఉద్యమకారులుగా గుర్తింపు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.తెలంగాణ ఉద్యమ చరిత్రలో జర్నలిస్టుల సేవలు, త్యాగాలు చిరస్థాయిగా నిలిచేలా కమిటీ న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు.

**సమగ్రంగా అధ్యయనం చేసి న్యాయం చేస్తాం:**

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ ప్రారంభం అయ్యిందని, రాజకీయ, రాజకీయేతర రంగాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు కమిటీ చైర్మన్ కె. కేశవరావు టీయుడబ్ల్యూజే బృందంతో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆయా కోణాల్లో సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఉద్యమ సాక్ష్యాలను పరిగణలోకి తీసుకొని, ఆయా రంగాల ఉద్యమకారులను గుర్తించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు ఆయా జిల్లాల నుండి సేకరించిన సమాచార నివేదికలు, ఆయా వర్గాలతో ప్రత్యేక సంప్రదింపులు నిర్వహించి, ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో సీనియర్ పాత్రికేయులతో కమిటీ సమావేశమై వారి సలహాలు కూడా తీసుకుంటుందని కేశవరావు అన్నారు. కమిటీ చైర్మన్ కేకే ను కలిసిన వారిలో విరాహత్ అలీతో పాటు టీయుడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కల్యారి రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ. రాజేష్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఆడ.. పిల్ల

కష్టం విలువ తెలిసిన ఆడది
ఇష్టాల్ని చంపుకొని బ్రతికేస్తుంది
నష్టాన్ని దరి చేరకుండా భద్రపరుచుకుంటుంది
కన్నీళ్లు కంటిగడప దాటిపోకుండా
నిగ్రహం వహిస్తుంది ఒక్కపూట తిన్నా రాణిలా
హుందాగా గడుపుతుంది
ఒంటరి పరుగే అయినా
నవ్వుతూ గమ్యాన్ని వెతుకుతుంది
తన అలసట తెలియనీయకుండా
చెమటను పవుటకొంగుతో కప్పెట్టేస్తుంది
నిరంతర పోరాటమే అనంతరం ఆరాటమే
మదిలో ఆలోచనల గలాట
ప్రతి తలంపులో వేదనల తలాట
చెప్పుటకలవిగాని కోలాటాల నడుమ
చిక్కుకున్న చందమే ఆడపిల్లమ్మ
బ్రతకనిద్దాం బరువేమవుతుంది
భవిష్యత్ బావుందనుకో...
నీ.. నా... బాధ్యత తీసుకుంటుంది
లేదనుకో ఎవడో ఎదవ చేతిలో బలవుతుంది
ఆడ.. పిల్ల కదా..! ఈడ.. పిల్ల కాదు కదా...!!
రాబందుల లోకంలో..
ఊరకుక్కల చెరలో వున్నాం కదూ..!

**- వాసి జ్యోత్స్న**
9866843005

## స్నేహం

అందరు మిత్రులు కారు
హలో మిత్రులు... లాభాపేక్ష కోరే మిత్రులు
మిత్రత్వంలో శత్రుత్వ మిత్రులు
కొందరే కొందరు
శ్రేయస్సు కోరే మిత్రులు
ఒకరో ఇద్దరో యశస్సు కోరే
మిత్రద్వయాలు
నిజమైన మిత్రుడు దొరికిన నాడు
వాడు అదృష్ట వంతుడు...
స్నేహం...కలకండ ముక్కలు
ప్రేమానురాగాల తేనె చుక్కలు
తుది దాక మరుల మొలక లా
వెంట ఉండే...ప్రాణానికి ప్రాణహితుడు
మిత్రత్వం లో సర్వోన్నతడు

**- రేడియమ్**
9291527757

## జన్ జి!

అన్ని తరాలు
గానుగెద్దుల్లా కాలాన్ని మోయవు
అవి బొద్దింకలే కావచ్చు

ఒకచోట గుమిగూడితే ప్రకంపనలు!
ఒక తరం తర్కించుకుని
ఏకాభిప్రాయానికి వచ్చిందా
గత కాలపు విలువలన్నీ
తలకిందులు కాక తప్పదు!

ప్రజాస్వామ్యం
ప్రమాదంలో పడినప్పుడు
ఒక్క ఇన్స్టాగ్రామ్ చాలు
వరుస తుఫానులు సృష్టించడానికి!
బలమైన చేతులు ఇకపై
గోళ్లు గిల్లుకుంటాయనే భ్రమలొద్దు
పునాదులు తవ్వి చూస్తాయి
చేతుల్లోని మొబైల్స్ అందర్నీ ఏకం చేస్తాయి!
ఒక్క పిలుపు చాలు
మేడిపండు ప్రజాస్వామ్యమా
నీ రహస్య తంత్రులను తెంచి
నిప్పులు రాజేయడానికి!

దేశపు వెన్నెముకలు
నిటారుగా నిలబడ యత్నిస్తుంటే
బ్రతకలేక బ్రతుకీడుస్తున్న పెద్ద తరమా
లేచి చప్పట్లు కొట్టక తప్పదు!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
9440233261

**ఎడిట్ పేజీ కోసం**
**మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@ gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి**
**– ఎడిటర్**

# పాఠశాల ప్రగతికి 'గ్రంథాలయం' మెట్టు



వినడం, చదవడం, రాయడం బాల్యాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన ఆయుధాలు. తొలకరిలోనే ఈ ఆయుధాలను ధరించడం వల్ల సృజనాత్మక ఆలోచనలకు పుట్టినిల్లుగా మారుతుంది. ఇందుకు గ్రంథాలయాలు ప్రధానంగా తోడ్పడుతాయి. పాఠశాల స్థాయిలో మెదడుకు మేత పెట్టే పుస్తకాలు అందుబాటులో ఉంచడం వల్ల పుస్తక పఠనం, పరిశీలన, అవగాహన, ఆలోచనాత్మక అనుభవం ప్రోది చేసుకునే అవకాశముంటుంది. పిల్లలు తరగతివారి విద్యా సామర్థ్యాలు సాధించడానికి భాషను రాయడం, చదవడం తప్పనిసరి. ఇందుకు సరైన అవకాశాలు ఏర్పరచకపోతే విద్యార్థికి మనం తీవ్ర నష్టాన్ని కలిగించినవారమవుతాము. పిల్లలు విషయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి తరగతి గది లేదా ఇంటివద్ద తగినన్ని కథల పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తా పత్రికలు, పిల్లల పత్రికలు అందుబాటులో ఉంచాలి. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వెయ్యికిపైగా పాఠశాలల్లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని తలపెట్టడం పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేందుకు దోహదపడుతుంది.

గ్రంథాలయాలు ఊహాశక్తిని పెంపొందిస్తాయి. ప్రపంచానికి కిటికీలు తెరుస్తాయి. జీవితంలో లక్ష్యాన్ని సాధించడానికి, జీవనాణ్యతను మెరుగుపరచడానికి తోడ్పడుతుంది. అందువల్ల బాల్యం నుంచే పిల్లలకు గ్రంథాలయంను పరిచయం చేయాలి. రకరకాల పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించాలి. పాఠ్యాంశాలు, హోంవర్క్ నుంచి విరామం పొందేలా గ్రంథాలయాలు రూపుదిద్దుకోవాలి. జ్ఞానాన్ని వెతకడానికి, కొత్త సమాచారం పొందడానికి అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉండాలి. దీంతో విద్యార్థులు తమ జీవితాల్లో చదివే కళను అలవర్చుకుని తమ విద్యకు సహాయపడే శక్తిని పొందుతారు. భాష, సాహిత్యం, సాంస్కృతిక చైతన్యం పరిమళించడానికి దారులు వేస్తాయి. భావితరాలకు చరిత్రను అందించే వేదికలుగా నిలుస్తాయి. గ్రంథాలు, శిలా శాసనాలు, తాళపత్రాలు, రాగి రేకులు తదితరమైనవి కాలక్రమేణా కనుమరుగై తెరలమీదకు రూపాంతరం చెందాయి. మూఢాచారాలను పారద్రోలి ప్రజల్లో చైతన్యం నింపడానికి ఒకప్పుడు గ్రంథాలయ ఉద్యమాలు సాగాయి.



మహాత్మాగాంధీ తదితర జాతీయ నాయకులు, రచయితలు రాసిన వ్యాసాలు, గ్రంథాలు నాడు దేశవ్యాప్తంగా గ్రంథాలయ ఉద్యమాల ద్వారానే ప్రజలకు చేర్చి, చైతన్యపరిచినవి. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఏటా నవంబరు 14 నుంచి 20 వరకు నిర్వహించే సాంప్రదాయం మన దేశంలో 1968లో ప్రారంభమైంది. చదువరులను గ్రంథాలయాలు ఆకర్షించడానికి ఏప్రిల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాన్ని పాటించే సాంప్రదాయాన్ని 'అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్' 1958లో ప్రారంభించింది. తర్వాత దీన్ని అనేక దేశాలు అనుసరించాయి.

కేంద్ర ప్రభుత్వం 2023 బడ్జెట్లో చిన్న పిల్లలకు సంబంధించిన నాణ్యమైన సమాచారాన్ని (పుస్తకాలు, ఆడియో, విజువల్, బొమ్మల పుస్తకాలు) 'నేషనల్ డిజిటల్ లైబ్రరీ'లో పొందుపరిచే అవకాశం కలుగజేసింది. తెలంగాణ ప్రభుత్వం కూడా 'మన ఊరు-మన బడి' పథకంలో భాగంగా గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పడింది. ఈమేరకు 2023 జూన్ 20న విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాశాఖ పది వేల ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలు, రీడింగ్ కార్నర్లు, 1,600స్మార్ట్ తరగతి గదులను ప్రారంభించింది. ఇందులో జాగ్రఫీ, భాషలు, శైలి సహా వివిధ స్థాయిల్లో నాణ్యమైన విషయ పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 1,138 పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు రీడింగ్, రైటింగ్ స్కిల్స్, సమాజం పట్ల అవగాహన కలిగివుండడానికి అవకాశాలు మెరుగు కానున్నాయి. ఇప్పటికీ కొన్ని ప్రైవేటు సంస్థలు విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తిని కలిగిస్తున్నాయి. 'రూమ్ టు రీడ్' అనే సంస్థ నాలుగేళ్లుగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలకు వెయ్యికిపైగా రకరకాల పుస్తకాలు అందించి గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. విద్యార్థులు చదివేందుకు ఇష్టపడే విధంగా గదికి రంగురంగుల పెయింటింగ్ చేసి కథలు, నవలలు, రంగురంగుల బొమ్మలు, గణితం, సైన్స్, దేశభక్తుల చరిత్ర, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో తరగతి విద్యార్థులకు వారంలో రెండు రోజులు గ్రంథాలయంలో గంట పాటు పుస్తక పఠనానికి సమయం కేటాయించారు. ఎవరైనా పుస్తకాలను ఇంటికి అడిగితే రిజిస్టర్లో విద్యార్థుల వివరాలు నమోదు చేసి ఇచ్చే సౌకర్యం కల్పించారు.

గ్రంథాలయాలు పాఠశాలలకు పరిమితం కాకుండా బయట కూడా ఏర్పాటు కావాలి. సాధారణ విద్యార్థులకే పరిమితం కాకుండా ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల కోసం గుజరాత్‌లోని వడోదరలో ఓ స్వచ్ఛంద సంస్థవారు ఓ గ్రంథాలయంను నిర్వహిస్తున్నారు. ఇందులో పుస్తకాలు, వేల సంఖ్యలో ఫ్లాష్ కార్డులు, పిక్చర్ కార్డులు అందుబాటులో ఉంచారు. ఇవి ఆటిజం పిల్లలు తేలికగా చదువుకునేలా ఉంటాయి. మరో విశేషం ఏంటంటే, ఈ గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలు ఆటిజం పిల్లలే చూసుకుంటున్నారు. ఇక మొబైల్ ఫోన్లకు అతుక్కుపోతున్న పిల్లల దృష్టిని మరల్చడానికి మణిపూర్‌కు చెందిన దంపతులు చిరు ప్రయత్నం చేసి విజయం సాధించారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకొని 'మిరాకిల్ వర్ప్యూమ్'ను ప్రారంభించారు. ఇందులో కథల పుస్తకాలతోపాటు ఎన్సైక్లోపిడియా, డిక్షనరీలు, కంప్యూటర్ సైన్స్, మానవ సంబంధాలు, చరిత్ర, సంగీతం, సాహిత్యం, మల్టీ మీడియా వంటి పలు అంశాలకు సంబంధించిన పుస్తకాలతో పాటు పలువురు ప్రముఖుల బయోగ్రఫీలను ఇందులో ఉంచారు. అలాగే ఢిల్లీలో 'బి.సి.రాయ్ చిల్డ్రన్స్ రీడింగ్ రూమ్ అండ్ లైబ్రరీ' పేరుతో ఏర్పాటు చేసిన అతిపెద్ద గ్రంథాలయం ఇది. 1967 నవంబరు 12న అప్పటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ దీన్ని ప్రారంభించారు. ఇందులో 40 వేలకు పైగా వివిధ భాషల పుస్తకాలున్నాయి. చిన్నారుల్లో విజ్ఞానాన్ని, దేశభక్తిని, సామాజిక అవగాహనను పెంచేందుకు తోడ్పడుతోంది. ఇలాంటి గ్రంథాలయాలు దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చినప్పుడు పిల్లల అభిరుచి మారి భవిష్యత్తుకు పటిష్ట పునాది పడుతుంది.

**- కోడం పవన్ కుమార్**
9848992825

# అప్పుల పునాదులపై ఆశల సౌధం..



సొంతిల్లు...ప్రతి సామాన్యుడి జీవితంలో అతిపెద్ద కల. కానీ ఆ గూడు కట్టుకునే క్రమంలో మధ్య తరగతి ప్రజలు తమ బతుకుల్ని, పిల్లల భవిష్యత్తును ఎలా తాకట్టు పెడుతున్నారన్నది ఇప్పుడు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అంశం. 'అందరికీ సొంతిల్లు', 'సులభమైన వాయిదాలు' అంటూ ఊరిస్తున్న ప్రకటనల వెనుక..రక్తం పీల్చుతున్న వాస్తవ పరిస్థితులు మన కళ్ళ ముందే కదలాడుతున్నాయి. ఒకప్పుడు రిటైర్మెంట్ వయసుకు దగ్గర పడుతున్నప్పుడు మాత్రమే సొంతింటి గురించి ఆలోచించేవారు. నేటి కార్పొరేట్ కల్చర్, బ్యాంకులు ఇస్తున్న భారీ రుణాలు, సమాజంలో పెరుగుతున్న పోటీ తత్వం యువతను పాతికేళ్లకే ఇంటి రుణాల వైపు నెడుతున్నాయి. స్తోమతకు మించి భవిష్యత్తులో రాబోయే జీతాన్ని ముందే లెక్కలేసుకుని లక్షలకు లక్షలు అప్పులు చేస్తున్నారు. నెల ఒకటో తేదీ రాగానే భయం వేస్తోంది. నా జీతం 60 వేలు, అందులో 40 వేలు ఈఎంఐకే పోతోంది. మిగిలిన 20 వేలతో ఇంటి అద్దె, రేషన్, పిల్లల ఫీజులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు అంటూ సగటు ఓ ప్రైవేట్ ఉద్యోగి కన్నీటి పర్యంతమవడం వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.

నెలసరి వాయిదాలు చెల్లింపుల కోసం మధ్యతరగతి కుటుంబాలు తమ ప్రాథమిక అవసరాలను సైతం త్యాగం చేస్తున్నాయి. చిన్న చిన్న కోరికలను చంపుకుంటున్నాయి. విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని భావించే క్రమంలో పిల్లలను నాణ్యమైన విద్యకు దూరం చేస్తున్నాయి. నెలవారీ వాయిదాల భయంతో పిల్లలను మంచి స్కూళ్లలో చదివించలేక సాధారణ పాఠశాలలకు మారుస్తున్న తల్లిదండ్రులు ఎందరో. అప్పులు తీర్చలేని క్రమంలో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించాల్సిన దుస్థితి బడుగు జీవులది.



సాధారణంగా మధ్యతరగతి వారి ఆదాయం పరిమితంగా ఉంటుంది. బ్యాంకులోను తీసుకుని ఇల్లు కొన్నప్పుడు, ఆ ఆదాయంలో సగానికి పైగా నెలసరి వాయిదాలకే సరిపోతుంది. ఏళ్లు గడుస్తున్నా జీతాలు పెరిగే వేగం కంటే ఖర్చులు పెరిగే వేగం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉండటం వల్ల నెలాఖరు వచ్చేసరికి జేబులు ఖాళీ అవుతున్నాయి. అనుకోని వైద్య ఖర్చులు రావడం, ఉద్యోగంలో ఒడిదుడుకులు ఎదురవడం, ఆర్థిక మాంద్యం వంటి పరిస్థితులు సగటు పేద, మధ్యతరగతి జీవిని మరింత కృంగదీస్తున్నాయి. ఇలాంటి చిన్న కుదుపు వచ్చినా సరే వారి ఆర్థిక ప్రణాళిక పేకమేడలా కూలిపోతోంది.

ఒకపక్క ఇంటి ఈఎంఐ కట్టడానికి, మరోపక్క ఆ నెల గడవడానికి మధ్యతరగతి ప్రజలు క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, అధిక వడ్డీలకు బయట అప్పులు చేయడం ప్రారంభిస్తారు. ఇది ఒక ప్రమాదకరమైన విషవలయం లాంటిది. ఒక అప్పు తీర్చడానికి మరో అప్పు చేయడం. వడ్డీల మీద వడ్డీలు పెరిగిపోయి అసలు కంటే వడ్డీలే భారం కావడం వంటి పరిణామాలు బలవన్మరణాలకు ఉసిగొలుపుతున్నాయి. మరో మార్గం కానరాక ఆత్మహత్యలే శరణ్యం అనుకునే పరిస్థితికి దారితీస్తున్నాయి. ఈ చక్రంలో చిక్కుకుని నిత్యం అప్పుల వాళ్ల వేధింపులు తట్టుకోలేక, పరువుపోతుందన్న భయంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. కరోనా తర్వాత పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. ఉద్యోగాలు కోల్పోయిన వారు, వ్యాపారాల్లో నష్టపోయిన వారు ఈఎంఐలు కట్టలేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రికవరీ ఏజెంట్ల వేధింపులు తాళలేక పోతున్నారు. ఒక్క నెల వాయిదా దాటితే చాలు.. బ్యాంకుల నుంచి వరుస ఫోన్ కాల్స్. రెండు నెలలు దాటితే ఇంటి ముందుకు రికవరీ ఏజెంట్లు. పరువు పోతుందనే భయంతో, ఆ క్షణానికి గట్టెక్కడానికి అప్పుల మీద అప్పులు, క్రెడిట్ కార్డుల మీద నగదు విత్ డ్రాలు చేస్తూ ఊబిలో కూరుకుపోతున్నారు. ఎప్పుడూ ఒకటే టెన్షన్.. ఏ క్షణాన ఉద్యోగం పోతుందో, ఏ క్షణాన బ్యాంకు నుంచి నోటీసు వస్తుందోనని! ఒక ఇల్లు కొనడం అంటే నాలుగు గోడలు కొనడం కాదు, భద్రతను కొనుక్కోవడం. కానీ ఆ భద్రత పేరుతో జీవితాంతం అభద్రతా భావంతో బతకాల్సి రావడం దారుణమైంది మరొకటి లేదు. 'సొంతిలు' అనే సామాజిక హోదా కోసం, ఏమాత్రం ఆర్థిక ప్రణాళిక లేకుండా వేసే అడుగులు.. జీవితాన్ని అంధకారంలోకి నెట్టేస్తాయని చెప్పడానికి అనేకమంది పేద మధ్యతరగతి జీవుల గాథలే సజీవ సాక్ష్యం. ఇల్లు కొనాలనుకునే ముందు మన స్తోమత ఏంటి? అత్యవసర పరిస్థితులు వస్తే తట్టుకునే ప్రత్యామ్నాయం ఉందా? అని ప్రతి ఒక్కరూ తమను తాము ప్రశ్నించుకోవాల్సిన సమయం ఇది. ఉద్యోగ భద్రత లేకపోవడం, జీతాలు పెరగకపోవడం, అనారోగ్య సమస్యలు, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు వంటి కారణాలతో మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఒకవైపు ఇంటి రుణ ఈఎంఐలు, మరోవైపు పిల్లల విద్యా ఖర్చులు, వైద్య ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల కుటుంబ బడ్జెట్ను కుదేలు చేస్తున్నాయి. చాలా కుటుంబాలు ఇతర అవసరాలను వాయిదా వేసుకుంటూ, తమ కోరికలను త్యాగం చేస్తూ ఈఎంఐలు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొందరు అదనపు ఉద్యోగాలు చేయడం, వ్యక్తిగత రుణాలు తీసుకోవడం వంటి మార్గాలను ఆశ్రయిస్తున్నారు. అయితే పరిస్థితులు మరింత క్లిష్టంగా మారినప్పుడు ఈఎంఐలు చెల్లించడం కష్టసాధ్యమవుతోంది. కొన్ని సందర్భాల్లో ఇళ్లను వేలంవేసే పరిస్థితులు కూడా తలెత్తుతున్నాయి. దీంతో సొంతింటి కల ఆనందాన్ని ఇవ్వాల్సిన చోట ఆందోళనలకు కారణమవుతోంది. సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అందమైన భావోద్వేగం, కానీ అది మన రోజువారీ ప్రశాంతతను హరించేదిగా మారకూడదు. తమ ఆదాయం, భవిష్యత్ అవసరాలను కచ్చితంగా అంచనా వేసుకుని మాత్రమే ఇంటి బడ్జెట్ ప్లాన్ చేసుకోవాలి. కనీసం ఆరు నెలల ఈఎంఐలు, ఇంటి ఖర్చులకు సరిపడా డబ్బును అత్యవసర నిధిగా పక్కన పెట్టిన తర్వాతే ఇంటి లోన్ కు వెళ్లడం సురక్షితం. అదే సందర్భంలో కలలు కనడం తప్పు కాదు, కానీ ఆ కలల సాకారం మన వర్తమానాన్ని, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేదిగా ఉండకూడదు. అప్పుల ఊబిలోకిపోకుండా, వాస్తవిక ఆర్థిక ప్రణాళికతో అడుగులు వేసినప్పుడే 'సొంతింటి కల' నెరవేరుతుంది.

**- నీలేష్**
8341399599

# విలువలను మింగేస్తున్న అశ్లీలం



తల చెడినా తత్వం చెడకూడదన్నది పెద్దల మాట. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా సత్ప్రవర్తనను, సదాలోచనలను విడిచిపెట్ట కూడదన్నదే దాని అంతరార్థం. మనసులో మంచితనం, ఆలోచనల్లో వివేకం, మాటల్లో సంస్కారం ఉంటే అవే మనిషి పురోగతికి సోపానాలుగా నిలుస్తాయి. కానీ నీచమైన కోరికలు, వికృత ఆలోచనలు సమాజానికీ ముప్పుగా పరిణమిస్తాయి. దురదృష్టవశాత్తూ నేడు అలాంటి ఆందోళనకర పరిస్థితులే నెలకొన్నాయి. అసభ్య, అశ్లీల దృశ్యాలకు బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతుండగా, వాటి ప్రభావంతో జుగుప్సాకర ఘటనలు అధికమవుతున్నాయి. ఫలితంగా మన సమాజంలో నైతిక విలువలు క్షీణిస్తున్నాయి.

భారతదేశంలో అంతర్జాల వినియోగదారుల సంఖ్య దాదాపు 90 కోట్లకు చేరుకుంది. పాఠశాల విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ కనిపిస్తోంది. నిజానికి జ్ఞాన వికాసానికి, ప్రభుత్వ సేవల వినియోగానికి, సమాచార మార్పిడికి, వినోదం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించడానికి అంతర్జాలం ఎంతో ఉప యుక్తంగా మారింది. అయితే ఇంట్లో దీపం కింద చీకటి ఉన్నట్లే, ఈ సాంకేతిక విప్లవం వెనుక అశ్లీల కంటెంట్ విస్తరణ కూడా ఆందోళన కలిగిస్తోంది. దాని ప్రభావంతో వ్యక్తిగత జీవితాలే కాకుండా సామాజిక వ్యవస్థ కూడా సంక్షోభంలోకి జారిపోతోంది.

సహజత్వం, క్రియేటివిటీ పేరిట వెబ్ సిరీస్‌ల్లోకి చేరుతున్న పచ్చి బూతుమాటలు, రిధిదాటిన శృంగార సన్నివేశాలు- ఓటీటీల ద్వారా నేరుగా నట్టింట్లోకి వచ్చిపడుతు న్నాయి. ఇక పోర్న్ వెబ్ సైట్లు, యాప్ల లో మెదళ్లను కలుషితం చేసే వికృత ఇత్రాలు, దృశ్యాలు వరదలా పారుతున్నాయి. ఈ స్థితి తప్పించేందుకు అశ్లీల వెబ్‌సైట్లు, యాప్లపై వేటేస్తున్నట్లు కేంద్రం తరచూ చెబుతోంది. చీడపురుగుల వంటి అలాంటి యాప్లు, వెబ్సైట్లను ఎప్పటికప్పుడు గుర్తించి నిషేధాజ్ఞలు విధిస్తుంటేనే అవి రాజేస్తున్న సామాజిక విధ్వంసాన్ని కొద్దిమేరకైనా నివారించగలం!

నిరుడు కోల్కతాలో వైద్యురాలిపై పాశవిక అత్యాచారానికి పాల్పడిన రాక్షసుడు నీలిచిత్రాలకు బానిసయ్యాడని పోలీసుల విచారణలో తేలింది. అతడి ఫోన్లో హింసాత్మక పోర్న్ కంటెంట్ ఉన్నట్లు వెల్లడైంది. హైదరాబాద్‌లో రోత వీడియోలను చూడటానికి అలవాటుపడిన మరో ప్రబుద్ధుడు కన్న కూతురితో తప్పుగా ప్రవర్తించి, ఆమె ప్రతిఘటించడంతో బండరాయితో మోది హతమార్చాడు. పచ్చని సంసారాలు కుప్పకూలుతున్నాయి. భర్తల పైశాచిక ప్రవృత్తికి ఎదురు చెప్పలేని ఎంతో మంది గృహిణుల ఆరోగ్యాలు దెబ్బతినిపోతున్నాయి.

ఇలాంటి దారుణాలన్నీ ప్రభుత్వాల దృష్టికి వస్తున్నాయా? చిన్న పామునైనా పెద్దకర్రతో కొట్టాల్సిందే. అలాంటిది అశ్లీల దృశ్యాలనే అనకొండను అడ్డుకోవాలంటే ఎంత వ్యవస్థాగత కృషి అవసరం? ఆన్‌లైన్ ఆటలు ఆడేటప్పుడో, సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూస్తున్నప్పుడో, ఇంకేదో సమాచారం చదువుతున్నప్పుడో ఉన్నట్టుండి అశ్లీల కంటెంట్ ప్రత్యక్షమ టవుతుంది. ఆల్గారిథమ్ల మాయ మూలంగా ఫోన్ పట్టుకునే ఎంతోమంది చిన్నారులు, యువత తెలియకుండానే ఘోరమైన ఊబిలో దిగబడిపోతున్నారు.

అంతర్జాలంలోకి పోటెత్తుతున్న అశ్లీల కంటెంట్‌కు అలవాటుపడుతున్న వారు చిన్న పిల్లలు, మహిళలపై వేధింపులు, కిడ్నాపులు, లైంగిక దాడులకు ఒడిగడుతున్నారని మనస్తత్వ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశానికి వెన్నెముకలాంటి నవతరం ఇలా గాడితప్పుతుంటే, ఇండియా నిజమైన అభివృద్ధిని ఎప్పటికి సాధించగలుగుతుంది? అశ్లీల కంటెంట్‌కు అలవాటుపడుతున్న చిన్నారులు, యువతలో హింసాత్మక ప్రవర్తన, దూకుడు స్వభావం పెరుగుతున్నాయని మనస్తత్వ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేధింపులు, కిడ్నాపులు, లైంగిక దాడులు వంటి నేరాలకు ఇది పరోక్ష కారణంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అశ్లీల చిత్రాలను వీక్షించే వారి సంఖ్య అధికంగా ఉన్న దేశాల్లో భారతదేశం ఉండటం ఆందోళన కలిగించే విషయం. అశ్లీల కంటెంట్ కారణంగా నాశనమవుతున్న జీవితాలను కాపాడాలంటే సంబంధిత వెబ్‌సైట్లపై కఠిన నియంత్రణలు విధించాల్సిన అవసరం ఉంది. నిషేధాల నుంచి తప్పించుకోవడానికి పేర్లు, రూపాలు మార్చుకుని తిరిగి ప్రత్యక్షమయ్యే వెబ్‌సైట్లను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలి. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

సామాజిక మాధ్యమాల్లో విస్తరిస్తున్న అసభ్యకర రీల్స్, వీడియోలపై కూడా సమర్థవంతమైన నియంత్రణ అవసరం. పలు అధ్యయనాల ప్రకారం, టీనేజర్లలో సగానికి పైగా పిల్లలు పదమూడేళ్ల వయస్సుకే అశ్లీల దృశ్యాలకు పరిచయం అవుతున్నారు.

ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల ఆన్లైన్ కార్యకలాపాలను జాగ్రత్తగా గమనించాలి. పాఠశాల స్థాయి నుంచే వారికి నైతిక విలువలు, బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించాలి.

పలు అధ్యయనాల ప్రకారం టీనేజర్లలో సగానికి పైగా పిల్లలు పదమూడేళ్ల వయస్సుకే అశ్లీల దృశ్యాలకు పరిచయం అవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను జాగ్రత్తగా గమనించాలి. పాఠశాల స్థాయి నుంచే వారికి నైతిక విలువలు, బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించాలి. అప్పుడే అశ్లీలత అనే ప్రమాదకర వలయంలో చిక్కుకుంటున్న భావితరాన్ని రక్షించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయగలం.

భావితరాన్ని కాపాడుకోవడం కోసం ఇప్పుడే సమాజం, ప్రభుత్వం, తల్లిదండ్రులు కలిసికట్టుగా చర్యలు చేపట్టాలి.'

**- హరిప్రసాద్ దూపాటి**
9963456992



# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, జూన్ -23(మనం ప్రతినిధి ):** ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి కిచెన్ లోకి వెళ్లి బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ చార్ట్ ప్రకారం ఈ రోజు ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. స్టోర్ రూమ్ లో పప్పులు, నూనె, నెయ్యి, ఇతర పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నిల్వకు సంబంధించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు కచ్చితంగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... విద్యార్థులు అందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాలు శ్రద్ధగా చదువుకోవాలని తెలిపారు. పరిశీలనలో మండల ప్రత్యేక అధికారి క్రాంతి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, సర్పంచ్ జ్యోత్స్న తదితరులు ఉన్నారు.

# రైతులు సంక్షేమమే సర్కార్ ధ్యేయం

## సన్న రకాలు సాగు చేయండి

### విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల/గొల్లపల్లి జూన్ 23 (మనం ప్రతినిధి):** రైతుల సంక్షేమం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీం నగర్ (శ్రీరాముల పల్లి ) రైతు వేదిక లో విత్తన మేళా కార్యక్రమాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కువమార్ మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో పెద్ద ఎత్తున వారి ధాన్యం, మొక్కజొన్న దిగుబడి వచ్చిందని అన్నారు. అధికారుల సమన్వయంతో పనిచేసి రికార్డు స్థాయిలో ధాన్యం, మక్కలు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. కొనుగోలు చేసిన నాలుగు ఐదు రోజుల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి తెలిపారు. ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం సహకరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. వానాకాలం సీజన్ లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల విత్తనాలు మాత్రమే రైతులు సాగు చేయాలని మంత్రి అడ్లూరి కోరారు. గొల్లపల్లి మండలం శ్రీరాములు పల్లి గ్రామంలో రూ. 70 లక్షలతో ప్రమాదకరం గా ఉన్న కరెంట్ వైర్లు తొలగించినట్లు మంత్రి వివరించారు. గ్రామంలో ఐకేపీ సెంటర్ తో పాటు గ్రౌండ్ ప్రతిపాదనలు వచ్చాయని గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు సంఘ భవనాలు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715 తదితర నాణ్యమైన వరి విత్తనాలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించి మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా పంట నాణ్యత పెరిగి రైతులకు ఆర్థికంగా మరింత లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. గతంలో పెద్ద ఎత్తున రైతులు యూరియా స్టాక్ చేసే వారిని కొత్తగా తీసుకువచ్చిన యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధిక మొత్తంలో యూరియా వాడటం వల్ల భూసారం తగ్గుతుందని అన్నారు. రోడ్డు రకాల ధాన్యానికి డిమాండ్ లేదని కలెక్టర్ తెలిపారు. రైతులు సన్న వడ్లు సాగు చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ఈనెల 23వ తేది నుంచి 31వ తేది వరకు రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఏడు రకాల విత్తనాలు మాత్రమే సాగు చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు మరియు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్

- విద్యార్థులు 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా సమాజంలో అవగాహన కల్పించాలి
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**సుల్తానాబాద్, జూన్ 23 (మనం న్యూస్):** మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విద్యార్థులు 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా మారి సమాజంలో అవగాహన కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన వారోత్సవాల సందర్భంగా మంగళవారం సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో ఉండటం అభినందనీయమని పేర్కొన్నారు. మంచి విలువలు, క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడరని అన్నారు. ఇందుకు కృషి చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించిన ఆయన, తమ గ్రామాలు, కాలనీలు, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులు 'యాంటీ డ్రగ్ సోల్జర్స్'గా ముందుండి సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు.మత్తు పదార్థాలు మొదట ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ, తర్వాత వ్యసనంగా మారి వ్యక్తి ఆరోగ్యం, విద్య, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వల్ల శారీరక, మానసిక సమస్యలతో పాటు కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని తెలిపారు. అందువల్ల విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా ఇటువంటి సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కష్టపడి పనిచేయాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర శ్రమతోనే ఉన్నతాధికారులు, క్రీడాకారులు, కళాకారులు, నాయకులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు. లక్ష్యంపై దృష్టి సారించి కృషి చేస్తే ప్రతి విద్యార్థి జీవితంలో విజయాన్ని సాధించగలడని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి నార్కోటిక్ టీం ఇన్స్పెక్టర్ రాజ్కుమార్, జూలపల్లి ఎస్సై మల్లేష్, ఎలిగేడు ఎస్సై మధుకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజెన్లకు సర్కారు భరోసా

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సంజయ్ కుమార్



**జగిత్యాల జూన్ 23:(మనం న్యూస్ ):** జన్మనిచ్చిన తల్లి దండ్రులు వృద్ధాప్యంలో నిరాధరణకు గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తల్లి దండ్రుల భద్రత చట్టం-2026 తెచ్చిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వయోధికుల వేధింపుల నివారణకు అవగాహన పక్షోత్సవాల సందర్భంగా టాస్క ముద్రించిన అవగాహన పిలుపు పత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం లోని వృద్ధుల భద్రతకు, సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.జిల్లా కేంద్రంలో ప్రభుత్వం తరపున తన వినతి మేరకు,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో వృద్ధాశ్రమము నిర్మాణం పూర్తయ్యిందని త్వరలో అందుబాటులో కి వస్తుందని , అల్పాహారం, వైద్య సేవలు, వినోదకార్యక్రమాల కోసం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయించామన్నారు. పిల్లల నిరాధరణకు గురవుతున్న సీనియర్ సిటిజెన్స్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, వారి సంఘాల ప్రతినిధులు గౌరిశెట్టి విశ్వనాథం, పి. హన్మంత్ రెడ్డి, ఎం. డి. యాకూబ్ తదితరుల సేవలను అభినందించారు. సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం సీనియర్ సిటిజెన్స్ కమిషన్ ఏర్పాటు కు సీ ఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని, జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజెన్స్ సేవలకు అసోసియేషన్ భవన్ నిర్మాణంకు ప్రభుత్వ స్థలం, నిధులు కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, ఎం. డి. యాకూబ్, కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు,ఆర్గనైజింగ్ కార్యదర్శులు కే.సత్యానారాయణ, వి.పురుషోత్తం రావు,బాలయ్య, సంయుక్త కార్యదర్శులు సయ్యద్ యూసుఫ్, ఎం. డి. ఇక్బల్,కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం, మెట్ పల్లి అధ్యక్షులు వొజ్జల బుచ్చి రెడ్డి, బొబ్బాటి కరుణ, విజయ లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

**జగిత్యాల జూన్ 23(మనం ప్రతినిధి):** జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ జగిత్యాల జిల్లా ఆధ్వర్యం లో అదనపు కలెక్టర్ బీఎస్ లత అధ్యక్షతన జరిగింది.

ఎస్సీ ఎస్టీ యాక్ట్ అమలు పై సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నితిన్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుజాత, ఆర్.డి.ఓ. మధుసూదన్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్, డి.ఎస్.పి పురుషోత్తం,జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు టివి సూర్యం, తుమ్మల గంగారం,నక్క అశోక్, బొల్లి కిషన్, వేణు, మానిటరింగ్ కమిటీసభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాత మంత్రి సీతక్క



- జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి

**మంగపేట, జూన్ 23,మనం ప్రతినిధి:** అభివృద్ధి ప్రదాత మంత్రి సీతక్క అని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి అన్నారు మంగళవారం అకినేపల్లి మల్లారం నుండి ఎస్టి కాలనీ వరకు గల పంచాయతీరాజ్ రహదారి అభివృద్ధిలో భాగంగా యం ఆర్ ఆర్ నిదుల నుండి మంజూరైన రూ రెండు కోట్ల సీ సీ రహదారి నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సాంబశివరెడ్డి భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ అకినేపల్లి మల్లారం ఎస్టీ కాలనీ గ్రామాల ప్రజలు కోరిన వెంటనే సీ సీ రహదారి నిర్మాణానికి రూ రెండు కోట్ల నిధులను మంజూరు చేసిన మంత్రి సీతక్కకి ఎప్పుడు రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు రహదారి కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన రహదారి నిర్మాణం పూర్తి చేయాలని సాంబశివరెడ్డి సూచించారు ఈ కార్యక్రమంలో ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్కీ వెంకన్న కాంగ్రెస్ నాయకులు ధూళిపాల బాలకృష్ణ కాంట్రాక్టర్ రాకేష్ గ్రామస్తులు లక్కీ రాజ్యం తదితరులు పాల్గొన్నారు

# సన్న వడ్లు సాగు చేయాలి

- పంట మార్పిడి చేయాలి
- సహజ వ్యవసాయ పద్ధతులు పాటించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల , జూన్ -23(మనం ప్రతినిధి ):** రైతులు పంట మార్పిడిలో భాగంగా సన్న వడ్లు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ₹రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాల₹ కింద రైతు వేదికల్లో విత్తన మేళా ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కార్యక్రమంలో భాగంగా వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై ప్రారంభించారు. పలువురు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. రైతు వేదిక ఆవరణలో మొక్క నాటారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనం, హాస్టళ్లలో సన్న బియ్యం వినియోగిస్తున్నారని,రేషన్ షాప్ లలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్వల్పకాలం పంటలు వేయాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచించిన బీపీటీ 5204, కే ఎన్ ఎం 7715, జై శ్రీ రామ్, ఆర్ ఎన్ ఆర్ 15048, డబ్ల్యూ జీ ఎల్ 44, కే ఎన్ ఎం 1638 హెచ్ ఎంటీ సోన సన్న వడ్లు సాగు చేయాలని తెలిపారు. లైసెన్స్ ఉన్న షాప్ ల నుంచి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, రసీదు పొందాలని సూచించారు. దానిని జాగ్రత్తగా భద్రపర్చాలని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు కింద ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. 30 ఏండ్ల వరకు దిగుబడి వస్తుందని, సబ్సిడీపై మొక్కలు, బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన మూడు ఏండ్ల తర్వాత దిగుబడి వస్తుందని, అంతర పంటలు సాగు చేయవచ్చని, అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. సహజ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు ఆ వైపు మళ్ళాలని పిలుపు నిచ్చారు. సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఇక్కడ సిబ్బంది ఉన్నారని తెలిపారు. రైతులకు వ్యవసాయ అధికారులు సహకారం అందిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, మండల ప్రత్యేక అధికారి క్రాంతి, తహసీల్దార్ నారాయణరెడ్డి, సర్పంచ్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులపై 17వ విడత సామాజిక తనిఖీ



**దమ్మపేట, జూన్ 23 (మనం న్యూస్) :** దమ్మపేట మండలంలో 17వ విడత సామాజిక తనిఖీ మంగళవారం నుండి ప్రారంభమవుతుందని సమన్వయ సమావేశంలో ఎస్ఆర్పి కుమార్, తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులు, పిఆర్ పనులు పెన్షన్ లు, డ్వాక్రా గ్రూప్‌ల మీద తనిఖీ ఉంటుందని, అన్ని రికార్డులు పూర్తి స్థాయిలో ఇచ్చి ఆడిట్ జరిపించాలని ఎంపీడీవో బి రవీంద్రారెడ్డి, తెలియజేశారు. అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు అందుబాటులో ఉండి, ఆడిట్ పూర్తి చేయాలని, ఆడిట్ చేసే అధికారులకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వసతి ఏర్పాట్లు చూసుకోవాలని ఎం పి ఓ రామారావు, తెలిపారు. అందరు (టీ ఏ లు) (ఎఫ్ ఏ)లు అందుబాటులో ఉండి అన్ని పనులు చూపించి,ఆడిట్ చేపించాలని వి.సుధాకర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆడిట్ డిఆర్పీలు, కార్యదర్శులు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

# విబి జీ రాం జీ పథకాన్ని రద్దు చేయాలి



- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ఖమ్మం, జూన్ 23(మనం న్యూస్):** వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గర్ అండ్ అజీవిక మిషన్ (విబిజి రాంజీ) పథకం గ్రామీణ పేదల ఉపాధిని దెబ్బతీసేవిధంగా రూపొందించారని ఈ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. గతంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సవరించి నూతనంగా పలు నిబంధనలను చేర్చారని ఈ నిబంధనలతో ఉపాధి కరువవుతుందని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం భారతీయ కేత్ మద్దూర్ యూనియన్ పిలుపు -మేరకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విబిజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని దాని స్థానంలో తిరిగి -మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, పని దినాలను పెంచాలని, దినసరి కూలీ రూ.700 గిట్టుబాటు అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. 'ఆందోళనకారులను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పేదల వ్యతిరేక ప్రభుత్వమని పేదలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా ఉన్న పథకాలకు తూట్లు పొడుస్తుందన్నారు. దశాబ్దాల కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా -వచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడంతో పాటు ఉపాధిని దెబ్బ తీయడం, గ్రామీణ పేదలను ఇబ్బంది పెట్టే రీతిగా నిబంధనలు రూపొందించి నూతన పథకాన్ని జూలై ఒకటి నుంచి అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. రెండుసార్లు ఫోటో తీసే పద్ధతిని తక్షణం రద్దు చేయాలని, గతంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథాతదంగా అమలు చేయాలన్నారు. గతంలో కేంద్రం 90 శాతం భరిస్తే రాష్ట్రాలు పది శాతం భరించేవని ఇప్పుడు రాష్ట్రాల వాటా 40 శాతానికి పెంచి కేంద్రం భారాన్ని రాష్ట్రాలపై మోపుతుందని ఆరోపించారు. డీజిల్, గ్యాస్, పెట్రో ధరలను పెంచడం ద్వారా నిత్యావసర వస్తువుల -ధరలు పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సైతం వైఫల్యం చెందిందని, కొత్త పింఛన్లు జూన్ రెండు నుంచి ఇస్తామని చెప్పిన ఇంత వరకు ఆ ఊసు లేదని సురేష్ తెలిపారు. నెలకు రూ.2,500 మహిళలకు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని పింఛన్ల పెంపు జరగలేదని, రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల -బీమా సరైన రీతిలో అమలు కాలేదని సురేష్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జాతీయ ఉపాధి హామీ పరిరక్షణ కోసం -పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, -ఆదినారాయణ, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, ఏనుగు గాంధీ, యంగళ ఆనందరావు, ప్రజా సంఘాల నాయకులు తాటి నిర్మల, -పగిళ్ల వీరభద్రం, సత్యనారయణ, వీరబాబు, సుధాకర్, గోపాలరావు, మహేష్, ఈశ్వరమ్మ, రంజాన్బీ పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్కు అందజేశారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై జిల్లా వ్యాప్తంగా అవగాహన



**జగిత్యాల, జూన్23(మనం న్యూస్):** జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, మాదకద్రవ్యాల నిర్మూలన మరియు యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడే లక్ష్యంతో జగిత్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు యువత ఆరోగ్యాన్ని, విద్యా భవిష్యత్తును, కుటుంబ సంబంధాలను మరియు సమాజ శాంతి భద్రతలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని వివరించారు. ఈ సందర్భంగా పోలీసులు అదికారులు మాట్లాడుతూ.... మాదకద్రవ్యాల వ్యసనం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశ అభివృద్ధిని కూడా దెబ్బతీసే సామాజిక సమస్యగా మారిందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు స్నేహితుల ప్రభావం, తప్పుడు ప్రచారం లేదా ఆసక్తి కారణంగా మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే గంజాయి, డ్రగ్స్, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, రవాణా, నిల్వ మరియు విక్రయం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత తమ జీవిత లక్ష్యాల సాధన కోసం విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఇతర సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు మరియు సమాజంలో ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఎక్కడైనా తెలిసినట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని తెలిపారు.

ఈ అవగాహన కార్యక్రమాలలో పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనం కథనానికి స్పందన

# బస్టాండ్‌లోకి బస్సులు

## అధికారులను ఏర్పాటు చేసి పర్యవేక్షణ
## రెండు రోజులుగా బస్టాండ్ వద్ద డిపో మేనేజర్
## బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సిబ్బంది ఏర్పాటు




మనం ఎఫెక్ట్

గజ్వేల్ జూన్ 23 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలో బస్టాండు పూర్తయి నప్పటికీ కూడా బస్సులు బస్టాండ్ లోకి వెళ్లకుండా రోడ్డుపైనే పార్కు చేస్తున్నారని ఇటీవల మనం పత్రికలో వార్తలు రావడం జరిగింది. ఈ విషయాన్ని గమనించిన డిపో మేనేజర్ మంగళవారం ఉదయం నుండి ఒక అధికారిని ఏర్పాటు చేయడంతో పాటు బస్సుల రాకపోకలను మైకు ద్వారా తెలియపరచడం జరిగింది. రోడ్డుపైన బస్సు నిలపకుండా ప్రతి ఒక్క బస్సు బస్టాండ్ లోకి వెళ్లేలా చూడడం జరిగింది. కథనం విషయాన్నీ తెలుసుకున్న డిపో మేనేజర్ రెండు రోజులుగా బస్టాండ్ వద్దనే ఉంటూ ప్రయాణికులకు బస్సు డ్రైవర్ కండక్టర్లు కూడా సూచనలు చేసినట్లు తెలిసింది. వీటితో పాటుగా ట్రాఫిక్ సిఐ కూడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండే విధంగా ట్రాఫిక్ కానిస్టే బుళ్లను ఏర్పాటు చేయడం. ఇకముందు కూడా బస్సులను బస్టాండ్లోకి వెళ్లే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది ఈ రోజే కాకుండా ప్రతిరోజు కూడా బస్సులలో బస్టాండ్ వెళ్లేలా చూడాల్సిన బాధ్యత డిఎం పైన ఉంది.

# అసత్య ప్రచారాలకు కాంగ్రెస్ కౌంటర్

- యూరియా కొరత పేరుతో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవంలేదు
- బీఆర్ఎస్, బీజేపీ అసత్య ప్రచారాలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు
- రైతులకు యూరియా కొరత లేదని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యేలు
- కామారెడ్డిలో కాంగ్రెస్ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం, నిర్మాణ వ్యయాన్ని పార్టీయే భరిస్తుంది
- ప్రెస్ మీట్లో డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, ఎమ్మెల్యేలు మదన్మోహన్ రావు, తోట లక్ష్మీకాంతరావు



కామారెడ్డి, జూన్ 23 (మనం న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొని మాట్లాడుతూ., రైతులకు యూరియా, ఇతర ఎరువుల సరఫరాలో ఎలాంటి కొరత లేదని, వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. యూరియా కొరత పేరుతో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొన్నారు.

**ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు నిర్వహించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాంటి అసత్య ప్రచారాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాలతోనే సమాధానం చెబుతోందన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి వర్గానికి మేలు చేసే విధంగా పాలన సాగుతోందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సొంత కార్యాలయ నిర్మాణంపై ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. 140 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి కామారెడ్డి జిల్లా కేంద్రంలో సొంత కార్యాలయం లేకపోవడం విచారకరమని, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ చొరవతో పార్టీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు.

**కాంగ్రెస్ బలోపేతానికి కేంద్రంగా కార్యాలయం**

పార్టీ కార్యాలయ నిర్మాణానికి అయ్యే ఖర్చును కాంగ్రెస్ పార్టీయే భరిస్తుందని, కార్యకర్తలపై ఎలాంటి ఆర్థిక భారం మోపబోమని స్పష్టం చేశారు. కార్యాలయ నిర్మాణం పూర్తయిన తర్వాత అది జిల్లాలో పార్టీ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారడంతో పాటు కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చే వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ కార్యాలయం కోసం స్థల కొనుగోలుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కలిసి రూ.4.80 లక్షల ఆర్థిక సహకారం అందించిన విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్



గజ్వేల్, జూన్ 23 మనం న్యూస్ః గజ్వేల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి ఆధ్వర్యంలో 'ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా' అనే లక్ష్యంతో కాశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం నాడు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన గజ్వేల్ బిజెపి నాయకులు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, 4వ వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ దాడిపల్లి భాస్కర్, నాయకులు దేవులపల్లి మనోహర్, నత్తి శివకుమార్, కోదండం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకట్ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మరియు మండల ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్ కుమార్, బారు అరవింద్, బిజెపి పట్టణ కార్యదర్శి చిక్కుడు ప్రసాద్, కేతవత్ ఆంజనేయులు, రాజేశ్వర్ చారి, తిప్పతి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన మేళాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి

- నానో యూరియా, డీఏపీలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 23 (మనం బ్యూరో): ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన విత్తన మేళాలను అన్నదాతలు , ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గద్వాల జోగులాంబ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐజ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో ఏడు రకాల వరి వంగడాలను మాత్రమే సాగు చేయాలని సూచించినందున, రైతులు మంచి డిమాండ్ ఉన్న వీటినే సాగు చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి లభ్యత తక్కువగా ఉండే గ్రామాల్లో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు కందులు, వేరుసెనగ, కూరగాయలు, తదితర పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు నానో యూరియా, డిఏపి వినియోగించేలా డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది మొక్కజొన్న పంటను రికార్డ్ స్థాయిలో పండించారన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సేకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ మండలాల వారీగా యూరియా యాప్ ను ప్రారంభించారు. పలువురు రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న కందుల విత్తనాలను పంపిణీ చేశారు. డీలర్లు ఏర్పాటు చేసిన విత్తనాలు, ఎరువుల స్టాల్స్ ను పరిశీలించి నిబంధనల ప్రకారం రైతులకు విక్రయించాలనీ సూచించారు.

అనంతరం కలెక్టర్ సమీపంలోనీ జెడ్పిహెచ్ఎస్ ను సందర్శించారు. మన ఊరు మనబడి ద్వారా పాఠశాలలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి అడిగారు. పాఠశాల విద్యార్థి రవిచంద్ర ఈనెల 24న. హైదరాబాద్లో నిర్వహించనున్న మోడల్ యునైటెడ్ నేషనల్ ఆర్గనైజేషన్ కార్యక్రమానికి ఎంపికైనందున పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఐజ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అలాగే సాదా బైనమా, భూభారతి, తదితర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, ఐజ పిఎసిఎస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఆత్మ అధికారి జగ్గు నాయక్, ఎంఏఓ జనార్ధన్, తహసిల్దార్ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర రావు, ఏఈఓ లు, ఇతర అధికారులు, ఆదర్శ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలి



- బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం

గజ్వేల్, జూన్ 23 మనం న్యూస్ః కేంద్ర ప్రభుత్వం వెంటనే గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్. డి. వో కు వినతి పత్రం అందజేశారు. గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం నాడు స్థానిక ఆర్డిఓకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘ నాయకులు మాట్లాడుతూ సనాతన ధర్మంలో గోవుకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అందుకే హిందువులందరు గోవును గోమాత గా పూజి స్తారని, గోరక్షణ ప్రతి హిందువు యొక్క కర్తవ్యమని సంఘ అధ్యక్షులు దేశపతి శంకర శర్మ అన్నారు.

# ప్రభుత్వ విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

- ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అత్యాధునిక వసతులు, సౌకర్యాలు
- పబ్లిక్ స్కూల్ లలో నర్సరీ నుండి ఇంటర్మీడియట్ వరకు నిరంతర విద్య
- పెద్దకొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన ఆర్జేడీ సోమిరెడ్డి



ఉమ్మడి మహబూబ్ నగర్, జూన్ 23 (మనం బ్యూరో)ః రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీపీఎస్) ఏర్పాటు కార్యక్రమం వేగంగా ముందుకు సాగుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఈడబ్ల్యూఐడీసీ క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్ రెడ్డి, నాగర్కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, జిల్లాస్థాయి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆర్జేడీ యం. సోమిరెడ్డి సందర్శించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్గా ఎంపికైన ఈ ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక, ఉన్నత, పాఠశాలల్లో ఇంటర్మీడియట్ కళాశాలలో ఉన్న భౌతిక వసతులు, ప్రస్తుతం ఉన్న తరగతి గదుల పరిస్థితి, విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ అవసరాలు, నిర్మాణ విస్తరణ అవకాశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఒక్కో తెలంగాణ పబ్లిక్ స్కూల్ను రూ.15 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నాగర్కర్నూల్ జిల్లాలో ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు, పోల్కంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్గా ప్రభుత్వం ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టిందని గుర్తు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఒక పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్గా ఏర్పాటు చేయాలనే సంకల్పంతో కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగర్కర్నూల్ నియోజకవర్గంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కల్వకుర్తి నియోజకవర్గంలో వెల్దండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అలాగే జిల్లాలో కొనసాగుతున్న మోడల్ స్కూల్ను కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వ్యవస్థలోకి తీసుకురావడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నిరంతర విద్యా విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఇంగ్లీష్ మీడియం బోధన అందించడంతో పాటు డిజిటల్ క్లాస్రూమ్స్, స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్లు, సైన్స్ ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే క్రీడా మైదానాలు, ఇండోర్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదికలు, పోషకాహార భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, ఆధునిక మరుగుదొడ్లు, వైద్య సేవలు వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఉచిత రవాణా సదుపాయం కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు , తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు నగర స్థాయి విద్యా వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అందుబాటులో ఉన్న సుమారు ఆరు ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించి, భవిష్యత్లో నిర్మించాల్సిన అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, పరిపాలనా భవనాలు, వసతి గృహాలు, భోజనశాలలు, క్రీడా మైదానాల ఏర్పాటుకు సంబంధించిన అవకాశాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించారు. డ్రోన్ సాంకేతికత సహాయంతో పాఠశాల ప్రాంగణాన్ని చిత్రీకరించి, భవిష్యత్ అభివృద్ధి పనులకు సంబంధించిన సమగ్ర నివేదికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఈడబ్ల్యూఐడీసీ రామచంద్రరావు, సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, ఎంఈఓ ఉమాదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావంతో వర్షభావ పరిస్థితులు





- సన్నరకాల వరి సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి
- నీటి కొరత ప్రాంతాల్లో ఆరుతడి పంటలు సాగు చేయాలి
- విత్తన మేలాను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, జూన్ 23(మనంప్రతినిధి)ః ఎల్ నినో ప్రభావం మొదలై జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సాగునీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని రైతులు అందుకు అనువైన పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం వల్ల పంటలకు సాగునీటి కొరత తీవ్రమవుతుందని పెట్టుబడి పెట్టి నష్టపోకుండా తక్కువ నీటితో పండించే పంటలు సాగు చేయడం పై రైతులు దృష్టి పెట్టాలన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విత్తన మేలా కార్యక్రమాలను కలెక్టర్ పర్యవేక్షించారు. సిద్ధిపేట అర్బన్ మండలం పొన్నాల రైతువేదికలో వ్యవసాయ శాఖ నిర్వహించిన విత్తన మేలా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రైతులు తమకున్న వనరులను అంచనా వేసి సాగు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వరి పండిస్తున్న రైతులు సన్న రకాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అందులో ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల విత్తనాలను వేసుకోవాలని సూచించారు. సాగునీటి కొరత ఉన్న పొలాల్లో పప్పు దినుసులు, నూనె గింజలు, ఇతర ఆరుతడి పంటలను సాగు చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం విత్తనమేల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని ఈనెల 23 నుండి 30 వరకు విత్తనాల పంపిణీ జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు చిన్ని శ్రీనివాస్ రెడ్డి ఆర్గానిక్ పద్ధతిలో పండిస్తున్న అరటి, బొప్పాయి, మునగ తోటలను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఏఓ స్వరూప రాణి, ఏఈఓ మీరా, సర్పంచులు వెంకటయ్య, మౌనిక నరేందర్, ఉపసర్పంచ్ సృజన సంపత్ రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రణాళికతో నిర్వహించాలి తీరాలి

- ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలి
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 23 (మనం బ్యూరో): జిల్లాలో ఓటరు జాబితాను తప్పులు లేకుండా సమగ్రంగా రూపొందించేందుకు చేపట్టిన ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా ఈనెల 25 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అన్ని మండలాల తహసిల్దార్లు, బిఎల్ఓ లు, ఇతర అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ... పోలింగ్ స్టేషన్ల వారీగా సంబంధిత బిఎల్వోలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అంశాలన్నింటిని ఓటర్లు ఫారాలలో పూరించేలా అవగాహన కలిగించాలన్నారు. ఈ విషయంలో బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారం కూడా తీసుకోవచ్చన్నారు. బిఎల్ఓ లు ప్రతిరోజు ఎన్ని ఇండ్లు తిరుగుతున్నారు, ఓటర్ల నుంచి ఫిలప్ చేయబడ్డ ఫారాలు ఎన్ని తిరిగి వచ్చాయనే సమగ్ర డేటాను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్ లో నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ అధికారులు ప్రతిరోజు రివ్యూ నిర్వహించనున్నట్లు చెప్పారు. బి ఎల్ఓ లకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత తహసిల్దారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. ఎవరైనా ఓటర్లు నిర్దేశిత వెబ్సైట్లో స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవడానికి కూడా అవకాశం ఉందన్నారు. 2002 ఓటర్ లిస్టును ప్రామాణికంగా తీసుకొని ప్రస్తుతం ఎలాంటి తప్పులు లేని సమగ్ర ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ పై మాస్టర్ ట్రైనర్ తిమ్మారెడ్డి క్షుణ్ణంగా వివరించారు. ఈ సమావేశ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, సూపర్వైజర్లు, బిఎల్ఓ లు, తదితరులు పాల్గొన్నారు.


# వరి రకాల సాగుపై దృష్టి సారించాలి



ములుగు, జూన్ 23 (మనంన్యూస్)ః రైతులు ధృవీకరించిన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించడంతో పాటు ప్రభుత్వ బోనస్ పొందే అవకాశం ఉన్న ఏడు వరి రకాల సాగుపై దృష్టి సారించాలని అధికారులు సూచించారు. కొక్కొండ రైతు వేదికలో మంగళవారం సహాయ వ్యవసాయ సంచాలకులు ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ మేళాలో ప్రభుత్వం బీపీటీ-5204, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్- 44, జైశ్రీరామ్, ఆర్ఎన్ఆర్-15048 అనే ఏడు వరి రకాలకు మాత్రమే బోనస్ అందజేయనున్నట్లు వివరించారు. రైతులు అధిక సంఖ్యలో ఈ ఏడు రకాల వరి విత్తనాలను సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందాలన్నారు. నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను వినియోగించడం ద్వారా పంట దిగుబడులు పెరిగి ఆర్థికంగా లాభపడే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు స్థానిక విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు వస్తాయి

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగే దిశగా ప్రయత్నించాలి
- నిర్దేశిత పారామీటర్స్‌లో మెరుగైన ర్యాంక్ సాధించాలి
- ఫిన్లాండ్ దేశ విద్యా వ్యవస్థ అమలుకు కృషి
- ఎంఈఓలు నిరంతరం పాఠశాలలను పర్యవేక్షిస్తుండాలి
- జ్ఞాన దీప్తి శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 23 (మనం బ్యూరో): ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేస్తేనే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని బెటాలియన్ పోలీస్ ట్రైనింగ్ సెమినార్ హాల్లో జ్ఞాన దీప్తి పేరుతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన పాఠశాలల ప్రారంభ మార్గ దర్శక శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతులతోపాటు ప్రీ ప్రైమరీ తరగతుల్లో కూడా విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యాశాఖకు సంబంధించిన 32 పారామీటర్స్ లో మన జిల్లా మంచి ర్యాంకింగ్ సాధించేలా ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో తమ విధులను నిర్వర్తించాలన్నారు. యుడైస్ అప్డేట్ పక్కాగా ఉండాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఇటీవల తాను విద్యాశాఖ అధికారులతో కలిసి ఫిన్లాండ్ దేశంలో పర్యటించి, అక్కడి విద్యావ్యవస్థను అధ్యయనం చేయడం జరిగిందని తెలిపారు. కొన్ని అంశాలను మన వద్ద కూడా అమలు చేసి మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలాల విద్యాధికారులు తమ పరిధిలోని పాఠశాలలను ప్రతినెల 15వ. తేదీలోగా సందర్శించి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు లీవ్ లెటర్ ఇవ్వకుండా పాఠశాలలకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్య ఇస్తోందన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 15 రోజుల్లోగా పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. పోషణ్ యాప్ లో ఎప్పటికప్పుడు వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రత్యేక పునఃశ్చరణ తరగతుల ద్వారా చదువులో వెనుకబడ్డ విద్యార్థులు మెరుగుపడేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పిపిటీ ద్వారా మాస్టర్ ట్రైనర్ అగస్టీన్ వివిధ అంశాలపై సమగ్రంగా శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, బెటాలియన్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ పాణి, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నాపత్రాల లీకేజీ పరీక్షల రద్దుపై భారీ నిరసన

## మానవహారం నిర్వహించిన కాంగ్రెస్

## పాల్గొన్న డీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న



కొత్తగూడెం టౌన్, జూన్ 23 (మనం న్యూస్): విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతు,ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల రద్దు ఘటనలకు నిరసనగా డీసీసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన సభ, మానవహారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం విద్యానగర్ కాలనీ నుంచి సూపర్ బజార్ వరకు కార్యకర్తలు, కలిసి భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపర్ బజార్ సెంటర్లో మానవహారం ఏర్పడి నిరసన తెలియజేశారు.'పేపర్ లీక్ దొంగలను అరెస్ట్ చేయాలి', 'విద్యార్థుల కలలు కూల్చొద్దు','బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి' అంటూ నినాదాలు చేశారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే భారతరఫ్ చేయాలని కోరారు. సంవత్సరానికి రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని ఇచ్చిన హామీని తొక్కుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న మోడీ, విద్యార్థులకు వెంటనే క్షమాపణ చెబుతూ, వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ ను మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీసీటీవీ, స్ట్రాంగ్ రూమ్ భద్రత, కఠిన చట్టాలు అమలు చేయాలి' అని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థికి అండగా మేమున్నాం అని భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురం లలిత కుమారి, ప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, రాష్ట్ర నాయకులు ఆళ్ళ మురళి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వై శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, హనుమంతు, జానీ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎం ప్రసాద్ బాబు, పైడా రాజేంద్రప్రసాద్, లోశెట్టి నాగార్జున, జిల్లా కార్యదర్శులు నూకల రంగారావు, ఆన్తోటి పౌల్, కొత్తగూడెం టౌన్, చుంచుపల్లి సుజాతనగర్, లక్ష్మీదేవి పల్లి పాల్వంచ మండలాల అధ్యక్షులు పరమేష్ యాదవ్, భువన సుందర్ రెడ్డి, అజయ్ కుమార్, సునీల్, దేవరగట్ల ప్రసాద్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సత్తిరెడ్డి, చింతలపూడి రాజశేఖర్, నాగేశ్వరరావు, కార్పొరేటర్లు సర్పంచులు యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు ఊపిరి

## కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడిని కలిసిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్

## కొత్త స్థలంపై కేంద్రానికి ప్రతిపాదనలు

## 10 రోజుల్లో ఫీజిబిలిటీ నివేదిక ఇవ్వాలని అధికారులకు కేంద్ర మంత్రి ఆదేశం



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23 (మనం ప్రతినిధి): దశాబ్దాలుగా భద్రాద్రి జిల్లావాసులు ఎదురుచూస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇప్పటికే ప్రతిపాదించిన స్థలాలు సాంకేతిక కారణాలతో అనుకూలం కాదని తేలడంతో ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించిన ప్రభుత్వం, అక్కడ సాధ్యాసాధ్యాల పరిశీలనను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడిని కలిసి ఎయిర్‌పోర్టు నిర్మాణంపై విస్తృతంగా చర్చించారు.

### గత రెండు ప్రతిపాదనలకు సాంకేతిక అడ్డంకులు

కొత్తగూడెం సమీపంలో గతంలో ప్రతిపాదించిన రెండు స్థలాల్లో విద్యుదీకృత రైల్వే మార్గం, కొండలు అత్యంత సమీపంలో ఉండటం వల్ల విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భద్రతా ప్రమాణాలు నెరవేరడం లేదని ఫీజిబిలిటీ అధ్యయనాల్లో తేలిందని మంత్రి తుమ్మల వివరించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మరో అనుకూలమైన స్థలాన్ని గుర్తించి, దానిపై సమగ్ర నివేదిక రూపొందించేందుకు ఏవియేషన్ సంస్థను నియమించినట్లు తెలిపారు.

### కొత్త స్థల ప్రతిపాదనపై 10 రోజుల్లో నివేదిక

కొత్తగా ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించి ఫీజిబిలిటీ నివేదికను పది రోజుల్లో అందజేయాలని కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రక్రియలను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.

### భద్రాచలం భక్తులకు వరం..

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఏటా లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్పోర్టు అందుబాటులోకి వస్తే దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని చెప్పారు.

### పారిశ్రామిక, విద్యా రంగాలకు కొత్త ఊపు..

సింగరేణి బొగ్గుగనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, బీపీఎల్ వంటి ప్రముఖ పరిశ్రమలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇప్పటికే ప్రత్యేక పారిశ్రామిక గుర్తింపు పొందిందని తుమ్మల తెలిపారు.

జిల్లాలో ఉన్న అటవీ సంపద, ఖనిజ వనరులు, ఎకో టూరిజం అవకాశాలు, ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు విమానాశ్రయం మరింత బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు. దీనివల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు విద్యా, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం..

ఎయిర్పోర్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, అనుమతుల ప్రక్రియలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన భద్రాద్రి గ్రీన్ఫీల్ ఎయిర్పోర్టు త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# అటవీ-రెవెన్యూ భూ వివాదాల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలి



- ఇసుక తవ్వకాల అనుమతులపై రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్త సర్వే నిర్వహించాలి
- భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త తనిఖీలు నిర్వహించి నివేదికలు అందించాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూన్ 23 (మనం ప్రతినిధి): జిల్లాలో అటవీ, రెవెన్యూ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన (జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ) సమావేశంలో డీసీపీ రామ్ రెడ్డి, అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, అటవీ ప్రాంతాల్లోని ఇసుక రీచ్ల నుంచి ఇసుక రవాణా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే జరగాలని సూచించారు. ఇసుక తవ్వకాల అనుమతులకు సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్త సర్వే నిర్వహించాలని ఆదేశించారు.రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి సంయుక్త తనిఖీలు చేపట్టి పూర్తి స్థాయి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల కోసం అవసరమైన అటవీ భూములకు సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 30వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. గెజిట్లో నమోదైన కొన్ని పోడు భూముల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో బి. గంగయ్య, ఇన్చార్జి డీఎఫ్వో నవీన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో వెలుగుమట్ల పేదల సొంతింటి కల సాకారం...

- ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి
- వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



ఖమ్మం, జూన్ 23(మనం బ్యూరో): ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగు ఉన్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీకి ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆదేవిధంగా ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలను పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సహాయం విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. పునాదుల నిర్మాణం పూర్తయిన తర్వాత, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశ పూర్తయిన తర్వాత, తుదిదశ పనులు పూర్తయిన తర్వాత మొత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైనప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిచిపోకుండా కొనసాగించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహాయం, పరిపాలనా అనుమతులు సకాలంలో అందించడంతో పాటు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసచారి, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఘన నివాళులు

కొత్తగూడెం టౌన్, జూన్ 23(మనం న్యూస్): భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో భారత జనసంఘ్ వ్యవస్థాపకులు, మహానేత డాక్టర్ శ్యామల ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శీలం విద్యాసాగర్ మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయత,ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రవచించిన అత్యంత ప్రసిద్ధ నినాదం:'ఒక దేశంలో రెండు విధానాలు, రెండు, ఇద్దరు ప్రధానులు ఉండవు' రాజ్యాంగాలుదేశం కోసం ఆయన చేసిన త్యాగాలు, చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. కొత్తగూడెం పట్టణం హనుమాన్ బస్తి సెంటర్ 144 వ బూత్ నందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు , అలివేలు, పట్టణ కార్యదర్శి సుహాసిని మరియు మహిళా మోర్చా అధ్యక్షులు యామిని, ఎస్టి మోర్చా అధ్యక్షులు భూక్యా పూర్ణ, ఎస్సీ మోర్చా అధ్యక్షులు హృదయ్, బీజేపీ జిల్లా నాయకులు నోముల రమేష్, ఆదిమూల రాములు, రాయుడు నాగేశ్వరరావు, రాజమౌళి కార్యకర్తలు భాస్కర్ గౌడ్, జగదీష్, రవి శంకర్ మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి నివేదిక విజయాలను నమోదు చేయాలి

- జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి
- రోడ్డు ప్రమాదాల తగ్గుదలపై గత ఏడాదితో పోల్చి విశ్లేషణ చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలి
- 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై జిల్లా అధికారులతో



ఖమ్మం, జూన్ 23(మనం బ్యూరో): 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం విజయగాథలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి శాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.ప్రతి శాఖ నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయదగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కోవాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికల్లో పొందుపరచాలని సూచించారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్ల సవరణ చర్యల వల్లమరణాల సంఖ్యలో వచ్చిన తగ్గుదలను గత ఏడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని గురుకుల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకూడదని, నిరుపేదలు, అనాథలు,ఒంటరి తల్లిదండ్రుల పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ ఖాళీ సీట్లను భర్తీ చేయాలని సూచించారు. మంచి విద్య పిల్లలకు జీవితాంతం ఉపయోగపడే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టీజీఎంఐడీసీ, మన ఇసుక వాహనం ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని, ఖమ్మంజిల్లాలో ఇసుక సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో నాణ్యమైన ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేటాయింపులు కూడా టీజీఎంఐడీసీ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి అన్ని శాఖలు తమ అవసరమైన ఇసుక ప్రతిపాదనలు పంపాలని సూచించారు.99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై రూపొందించే బుక్లెట్లో ప్రతి శాఖ విజయ గాథలు, ఉత్తమ కేస్ స్టడీలు, థీమ్ వారీగా ఎంపిక చేసిన ఉత్తమ ఫొటోలను పొందుపరచాలని సూచించారు. బుక్లెట్ పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో బుక్లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు.99 రోజుల కార్యక్రమంలో ప్రారంభమైన పనులకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను కూడా బుక్లెట్లో చేర్చాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యాచరణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు ఇప్పటివరకు అద్భుతంగా పనిచేశారని అభినందించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఖమ్మం జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు నిర్వహించిన పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమంలో 11,326 ఫైళ్లను పరిష్కరించామని తెలిపారు. జిల్లాలోని 571 గ్రామాలు, 177 పట్టణ వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.మాతృ మరణాల రేటును సున్నాకు తీసుకురావాలనే లక్ష్యంతో తల్లి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. 'ప్రతి ప్రసవం సురక్షితం' కార్యక్రమం ద్వారా హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ తో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఎక్స్రే వాహనాల ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలు, రోడ్డు భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బాలల భద్రత వారోత్సవాలు నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. 53 మంది అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు అందించినట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 610 మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు.వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించి రైతు భరోసా, నానో యూరియా వినియోగం, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, పంట అవశేషాల దహనం నివారణ, వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ పామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నేల ఆరోగ్య నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే విద్యా వారోత్సవాలు, యువజన, క్రీడా వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీలో ఎలాంటి అక్రమాలు జరగలేదు

- టిఆర్ఎస్ కౌన్సిలర్ల పబ్లిసిటీ స్టంట్ ఆపాలి
- మున్సిపల్ ఛైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ



వైరా, జూన్ 23 (మనం న్యూస్): వైరా మున్సిపాలిటీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని టిఆర్ఎస్ కౌన్సిలర్ల పబ్లిసిటీ స్టంట్ ను ఆపాలని వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ హితవు పలికారు.మంగవారం వైరా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మున్సిపాలిటీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని అన్నారు. బిల్లులన్నీ పూర్తి పారదర్శకంగా ఉన్నాయని స్పష్టం చేశారు .గడచిన నాలుగు నెలల్లో జరిగిన అభివృద్ధి ఏంటో ప్రజలందరికీ తెలుసునన్నారు. తన చాంబర్లో ఎవరిని కించపరిచే విధంగా మాట్లాడలేదని చిన్న విషయాన్ని గోరంత ను కొండ అంత లుగా చూపిస్తూ మాట్లాడుతున్నారని ప్రైవేట్ చాంబర్లో జరిగిన చిన్న సంఘటన అని ఆమె వివరణ ఇచ్చారు. వారికి ఎటువంటి అపోహలు అక్కరలేదని అవినీతి రహితంగా పరిపాలనందించటం ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఇప్పటికైనా అభివృద్ధికి సహకరించాలని పబ్లిసిటీ స్టంట్ ను పక్కనపెట్టి సహకరించాలని ఆమె కోరారు. ఏ వార్డు పైన పక్షపాతం చూపించకుండా అభివృద్ధిలో ముందుంటామని కొన్ని పనులు ముందు కొన్ని పనులు తర్వాత ఆలస్యంగా జరిగే పరిస్థితులు కూడా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. మేము వచ్చిన 4 నేల ల కాలంలో వాటర్ లేక కొన్ని వార్డుల్లో ఇబ్బంది పడుతుంటే తగిన చర్యలు తీసుకున్నామని,మేము చేసిన పన్నును ప్రజలు గమనిస్తున్నారని కౌన్సిల్ మీటింగులు 95 పాయింట్ ల లో ఏజెండా పెట్టారు అని అంటున్నారని ఇవన్నీ కొన్ని చేసిన పనులకు ఎజెండా మాత్రమేనని ఆమె తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహాయ సహకారాలతో మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పార్టీలు కతీతంగా అభివృద్ధి పనులకు కలిసి రావాలని ప్రతిపక్ష కౌన్సిలర్లకు సూచించారు. అవినీతి సహించేదేలే గానీ అందులో భాగంగా అవినీతికి తావు లేకుండా కొంతమంది ఉద్యోగంలో కూడా తొలగించామని చంద్రకళ పేర్కొన్నారు. అందరి సహకారంతో వైరా మున్సిపాలిటీ అభివృద్ధి చేసుకొని క్లీన్ పట్టణంగా తీర్చిదిద్దాలనేదే మా ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉండ్రు వరలక్ష్మి, ముళ్ళపాటి విజయలక్ష్మి, బత్తుల సుమతి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొళ్ల గంగారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు, వీరశెట్టి సీతారాములు, శీలం చంద్రశేఖర్ రెడ్డి, ఉయ్యూరి రామకృష్ణ, తోటకూర శ్రీకాంత్ ,పువ్వాళ్ళ రాము తదితరులు పాల్గొన్నారు.

## మీ తప్పులను కవర్ చేసుకోవడానికి భారత్‌పై నిందలా?

### విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్



ఢిల్లీ, జూన్ 23: పీఓకేలో ఆందోళనలతో పాటు సింధూ జలాల ఒప్పందానికి సంబంధించి పాక్ మంత్రి చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ దేశం ఇలాంటి నీచ ప్రయత్నాలకు పాల్పడుతోందని మండిపడింది. ఆ మంత్రి చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమేనని తేల్చి చెప్పింది. అసలేం జరిగిందటే.. ఇటీవల పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇటీవల పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఈ ఆందోళనల వెనుక భారత్ ప్రభావం ఉందంటూ నోరు పారేసుకున్నారు. అంతటితో ఆగకుండా.. పాకిస్థాన్ నీటి భద్రతకు ముప్పు వాటిల్లిందని భావిస్తే భారత్‌పై యుద్ధానికి కూడా వెనుకాడబోమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో స్పందిస్తూ ఖవాజా వ్యాఖ్యలకు దీటుగా బదులిచ్చారు.''తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ఆ దేశంలో జరుగుతోన్న మావన హక్కుల ఉల్లంఘన నుంచి ప్రపంచం దృష్టి మళ్లించేందుకు పాక్ ఇలాంటి విఫల ప్రయత్నాలు చేస్తోంది. ఈ కల్పిత ఆరోపణలను మేం తోసిపుచ్చుతున్నాం. పాకిస్థాన్ బలవంతపు ఆక్రమణలో ఉన్న ప్రాంతాలలో (పీఓకేను ఉద్దేశిస్తూ) దశాబ్దాలుగా ఆర్థిక దోపిడీ కొనసాగుతోంది. అక్కడి ప్రజలు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు. పాలనాపరమైన అణచివేత విధానాల ఫలితంగానే ప్రస్తుతం అక్కడ నిరసనలు జరుగుతున్నాయి. ఆ ఆందోళనలపై పాక్ ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోంది. అమాయక పౌరులపై కాల్పులు చేయడంతో పాటు ఔషధ సరఫరా, ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేసింది. ఈ బలవంతపు చర్యల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దురాగతాలకు గానూ అంతర్జాతీయ సమాజం పాక్ను జవాబుదారీగా నిలబెడుతుందని ఆశిస్తున్నాం'' అని రణ్‌ధీర్ వెల్లడించారు.

# రష్యాలో 'హైవే ఆఫ్ డెత్'..

## ఉక్రెయిన్ లాజిస్టిక్స్ లాక్‌డౌన్ వ్యూహం



మాస్కో, జూన్ 23: రష్యా రాజధాని మాస్కోకు ఉక్రెయిన్ మనశ్శాంతిని కరవు చేసింది. వరుస డ్రోన్ దాడులతో నగరం తగలబడుతోందా అన్న పరిస్థితి నెలకొంది. యుద్ధాన్ని ఏకంగా రష్యా రాజధాని గుండెల పైకి కీవ్ తీసుకొచ్చింది. మరోవైపు ఆక్రమిత క్రిమియాకు రష్యా ప్రధాన భూభాగం నుంచి ఎలాంటి సరకులు, ఇంధనం చేరకుండా ఉక్రెయిన్ కట్టడి చేస్తున్నాయి. దీంతో యుద్ధం సెగ రష్యాకు బలంగా తాకుతోంది. ప్రపంచంలోనే అత్యధిక చమురు ఉత్పత్తి చేసే దేశాల జాబితా టాప్-3లో ఉండే రష్యా దేశీయంగా ఇంధన కొరత ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

రష్యా ప్రధాన భూభాగంలోని రోస్టవ్ ఆన్ డాన్ పట్టణం నుంచి ఆక్రమిత మారియపోల్, మెలిటోపోల్ మీదుగా క్రిమియాకు వెళ్లే ప్రధాన హైవేను ఆర్-280గా పిలుస్తారు. ఈ మార్గం నుంచే సైనిక దళాలు, ఇంధనం, ఇతర సరకులు రష్యా ఆక్రమిత ప్రాంతాలకు చేరేవి. కెర్చి వంతెనపై దాడులు పెరగడంతో దానికి ప్రత్యామ్నాయంగా క్రెమ్లిన్ వ్యూహకర్తలు ఆర్-280 ఎంచుకొన్నారు. ఉక్రెయిన్ సైన్యంలోని 412 నెమిసోవ్ (గ్రీకు భాషలో ప్రతీకారానికి దేవత పేరు) బ్రిగేడ్‌లోని అన్ మ్యాన్డ్ సిస్టమ్స్ ఫోర్స్ ఈ విషయాన్ని గ్రహించింది. అమెరికా తయారీ హార్నెట్ , స్థానికంగా తయారు చేసిన మోరిగన్ డ్రోన్లను వాడి భారీగా దాడులు చేసింది. ఫలితంగా ఈ మార్గంలో ఆర్-280 మీద ట్రాఫిక్ 70% పైగా పడిపోయింది. ట్యాంకర్లు, సైనిక వాహనాలు ఈ మార్గంలో వెళ్లాలంటే భయపడిపోతున్నాయి. ముఖ్యంగా ఈ డ్రోన్లు రష్యాలోని ఓ హైవేను దాదాపు నిర్మానుష్యంగా మార్చేయడం గమనార్హం.


ఇక ఎఫ్‌పీ-2, బెహెమోత్ డ్రోన్లను కూడా ఉక్రెయిన్ వాడుతోంది. ఇవి 50-300 కిలోమీటర్ల దూరంలో లక్ష్యాలను ఛేదించగలవు. వీటి రాకతో మిడ్ రేంజిలో రష్యాపై దాడులు గతేడాది 28 రెట్లు పెరిగాయని అంచనా. ఇవి కేవలం లాజిస్టిక్స్‌నే కాకుండా రష్యా ఎయిర్ డిఫెన్స్‌లను కూడా దెబ్బతీస్తున్నాయి. యుద్ధం మొదలైన ఫిబ్రవరి 2022 నుంచి 2026 ఏప్రిల్ చివరి వారం వరకు ఉక్రెయిన్ దళాలు ఇంధన రిఫైనరీలే లక్ష్యంగా 158 దాడులు చేశాయి. వీటిల్లో రష్యాలోని అతిపెద్ద 33 రిఫైనరీల్లో కనీసం 24పై దాడులు చేశాయి. ర్యాజన్, సరటోవ్ రిఫైనరీలపై ఏకంగా దాదాపు 15 చొప్పున దాడులు జరిగాయి. సిజ్రాపై మే చివరికి 11వ సారి దాడి జరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి మే లోపు 16 చమురు శుద్ధి కర్మాగారాలు ఉక్రెయిన్ దాడుల్లో దెబ్బతిన్నాయి. ఈ దాడుల్లో రోజుకు 7,00,000 బ్యారెళ్ల రిఫైనింగ్ సామర్థ్యం పడిపోయింది. రష్యాలో చమురు శుద్ధి సామర్థ్యం 2009 తర్వాత తొలిసారి కనిష్ఠానికి పడిపోయింది. ఇక జనవరి నుంచి 30కి పైనున్న రిఫైనరీల్లో చూస్తే ఇది రోజుకు 2.8 మిలియన్ బ్యారెళ్లకు పైగా ఉత్పత్తిలో కోత పడినట్లైంది. ఉక్రెయిన్ దాడులు, చమురు శుద్ధి సామర్థ్యంలో అడ్డంకుల కారణంగా ముడిచమురు ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గింది. రోజుకు 4.6 లక్షల బ్యారెళ్ల ముడిచమురు తగ్గిందని పారిస్లోని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ అంచనా వేసింది.

**రష్యా నరాలను తెంపుతున్న డ్రోన్లు**

యుద్ధాల్లో దళాలకు అవసరమైన మందుగుండు, ఇంధనం, ఆహారం, బ్యాకప్ పంపడం చాలా ముఖ్యం. వీటిని కట్ చేస్తే ఎంతటి సైన్యమైనా కొన్ని వారాల్లో చేతులెత్తేస్తుంది. తాజాగా ఉక్రెయిన్ రష్యా విషయంలో లాజిస్టిక్స్ లాక్‌డౌన్ ప్లాన్ అమలుచేస్తోందని నిపుణులు అంటున్నారు. నేరుగా రష్యా దళాలపై దాడులు తగ్గించి.. వారి సరఫరాలను అడ్డుకోవడంపై దృష్టిపెట్టింది. దేశీయంగా తయారుచేసిన మధ్య శ్రేణి డ్రోన్లను ఇందుకోసం రంగంలోకి దింపింది. సరిహద్దులకు దూరంగా రష్యా లోపలి ప్రాంతాల్లోని ఇంధన కాన్వాయ్లు, మిలిటరీ ట్రక్కులు, రైళ్లు, ఇతర వాహనాలపై దాడులు చేసింది. ముఖ్యంగా రష్యా స్వాధీనం చేసుకొన్న క్రిమియాకు సరఫరాలను తెంపేస్తోంది. ఇటువంటి 150 దాడులను అమెరికా విశ్లేషకులు రికార్డు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచే ఇంధనం తరలిస్తున్న కనీసం 20 రైళ్లను ధ్వంసం చేసిందంటే అర్థం చేసుకోవచ్చు. యుద్ధంలో విజయాలు సాధిస్తున్నామని రష్యా ఎంత చెబుతున్నా.. ఆ విజయాలకు భరించలేనంత మూల్యం చెల్లించుకొనేలా ఉక్రెయిన్ చేస్తోంది.

## ఫలితాలపై అసంతృప్తి రీ వాల్యుయేషన్‌కు అప్లై చేశా..

### ఫలితం సాధించా: అవని కేజ్రీవాల్!



రాంచి, జూన్ 23: ఏకంగా 24 మార్కులు పెరిగి.. దేశ టాపర్ల సరసన నిలిచింది. ఈ అద్భుత ఘనత సాధించింది ఝార్ఖండ్‌లోని రాంచీకి చెందిన అవనీ కేజ్రీవాల్. డీపీఎస్ సేల్ టౌన్‌షిప్ స్కూల్లో కామర్స్ విద్యార్థినిగా చదివిన ఆమె, సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో తొలుత 95.2 శాతం మార్కులు సాధించింది. ఫలితాలు బాగానే ఉన్నప్పటికీ తన ప్రదర్శనకు వచ్చిన మార్కులు సరిపోవని భావించిన అవనీ, సమాధాన పత్రాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసింది. అక్కడే అసలు ట్విస్ట్ చోటుచేసుకుంది. రీవాల్యుయేషన్ అనంతరం ఆమె మార్కులు ఏకంగా 24 పెరిగాయి. దీంతో ఇంగ్లీష్ కోర్, అకౌంటెన్సీ, బిజినెస్ స్టడీస్, ఎకనామిక్స్, అప్లైడ్ మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల్లో పూర్తి మార్కులు సాధించి 500కి 500 స్కోర్‌తో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. అదనపు సబ్జెక్ట్‌గా తీసుకున్న గ్రాఫిక్స్‌లో కూడా 99 మార్కులు సాధించింది.

ఫలితాలు ప్రకటించిన రోజే తనకు పూర్తి సంతృప్తి కలగలేదని అవనీ చెబుతోంది. ఏడాది పొడవునా తాను పడిన కష్టానికి తగిన ఫలితం రాలేదని భావించానని, అందుకే రీవాల్యుయేషన్‌కు వెళ్లానని తెలిపింది. తన సమాధానాలపై, తన శ్రమపై ఉన్న నమ్మకమే ఈ నిర్ణయం తీసుకునేలా చేసిందని చెప్పింది. అవనీ విజయ రహస్యం కూడా ఆసక్తికరంగానే ఉంది. రోజుకు ఎన్ని గంటలు చదివానన్నది కాదు.. ఎన్ని లక్ష్యాలు పూర్తి చేశానన్నదే ముఖ్యమని ఆమె చెబుతోంది. ప్రతిరోజూ రెండు లేదా మూడు టాపిక్‌లు పూర్తి చేయాలని నిర్ణయించుకుని, అవి పూర్తయ్యే వరకు క్రమశిక్షణతో చదివేదాన్నని తెలిపింది. సోషల్ మీడియా విషయంలోనూ విద్యార్థులకు ఆమె ఒక సందేశం ఇచ్చింది. దాన్ని పూర్తిగా దూరం పెట్టాల్సిన అవసరం లేదని, కానీ చదువుకు ఆటంకం కలిగించకుండా పరిమితంగా ఉపయోగించాలని సూచించింది. వ్యాపారవేత్త మితేష్ కేజ్రీవాల్, గృహిణి పూనమ్ కేజ్రీవాల్ దంపతుల కుమార్తె అయిన అవనీ భవిష్యత్తులో బిజినెస్ మేనేజ్‌మెంట్లో ఉన్నత విద్యను అభ్యసించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే సీయూఈటీ-యూజీ 2026 పరీక్ష కూడా రాసింది. భవిష్యత్తులో సొంత వ్యాపారాన్ని స్థాపించి విజయవంతమైన ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని కలలు కంటోంది. అవనీ సాధించిన ఈ ఘనతపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఆమె విజయం వేలాది మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయా చౌహాన్ పేర్కొన్నారు.

## ఒక్కరోజే 1.9కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా

### హార్ముజ్‌లో ఆల్ టైమ్ రికార్డన్న ట్రంప్



వాషింగ్టన్, జూన్ 23: అమెరికా-ఇరాన్ల మధ్య శాంతి ఒప్పందంతో హార్మూజ్ జలసంధిలో నౌకాయానం తిరిగి ఊపిరి పీల్చుకుంటోంది. తాజా పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. నిన్న ఒక్కరోజే 1.9 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు రవాణా జరిగిందని, ఇది ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొన్నారు. చమురు ధరలు పడిపోతున్నాయని ప్రపంచం సురక్షితమైన ప్రదేశంగా మారిందంటూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు చేశారు. ఇక ఇరాన్‌తో ఒప్పందం గురించి ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఆ దేశం అంగీకరించిందన్నారు. ''నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేసినప్పటికీ.. భవిష్యత్తులో అత్యున్నత స్థాయిలో అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించింది. అణు నిజాయతీకి ఇది ధీమా కల్పిస్తోంది. ఇందుకు వాళ్లు కట్టుబడి లేకుంటే తదుపరి చర్చలు ఉండవు. దీనితోపాటు ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ఆధారంగా ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మూజ్‌ను తెరిచి ఉంచేందుకు నేను అంగీకరించాను. దిగ్బంధనాన్ని తిరిగి ప్రారంభిస్తే నౌకలు ప్రస్తుతం ఉన్నచోటే నిలిచిపోతాయి. కానీ, ప్రస్తుతానికి అలా జరగడం అసాధ్యంగా కనిపిస్తోంది. అమెరికా విడుదల చేసే నిధులతో ఆహారం, వైద్య సామగ్రి వంటి వాటిని మాత్రమే వాళ్లు కొనుగోలు చేయగలరు. అంతేకాదు, వాటిని పూర్తిగా అమెరికా నుంచే కొనాల్సి ఉంటుంది. ఇరాన్కు ఇప్పుడివి ఎంతో అవసరమని భావిస్తున్నా. సంప్రదింపులు జరుగుతున్నాయి'' అని ట్రంప్ పేర్కొన్నారు.

# తృణమూల్ చీఫ్‌గా మమత తొలగింపు

### చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే అనూప్రాయ్
### జాతీయ వర్కింగ్ కమిటీ ఏర్పాటు
### ప్రతిపక్ష నేత రితబ్రత వెల్లడి



ఢిల్లీ, జూన్ 23: తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి రెబల్ గ్రూపు ఒకే రోజు రెండు షాకులిచ్చింది. ఆమెను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించామని ప్రకటించింది. అంతేకాకుండా మరింత మంది ఆమె మద్దతుదారులు తమవైపు వచ్చారని వెల్లడించింది. మమతకు కీలక అనుచరుడైన కోల్కతా మాజీ మేయర్ ఫర్హాద్ హకీం తమ గ్రూపులో చేరినట్లు రెబల్ గ్రూపునకు నాయకత్వం వహిస్తున్న రితబ్రత బెనర్జీ తెలిపారు. పశ్చిమ బెంగాల్లో సోమవారం ప్రభుత్వం బడ్జెట్ను ప్రవేశపెట్టింది. అనంతరం కోల్‌కతా న్యూటౌన్‌లో రెబల్ ఎమ్మెల్యేలంతా సమావేశమయ్యారు. ఈ భేటీకి దాదాపు 500 మంది జిల్లాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మమతను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నట్లు రితబ్రత ప్రకటించారు. 30 మంది సభ్యులతో జాతీయ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. తమదే అసలైన తృణమూల్ అని స్పష్టం చేశారు. తమ నిర్ణయాన్ని ఎన్నికల సంఘానికి తెలియజేస్తామని రితబ్రత వెల్లడించారు. మమతా బెనర్జీ ప్రధాన సలహాదారుగా ఉండాలనుకుంటే స్వాగతిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో తృణమూల్ ఎన్నికల గుర్తును ప్రధానంగా ఉంచారు. మమత, అభిషేక్ చిత్రాలను తొలగించారు. ఫర్హాద్ హకీం, అరూప్ బిశ్వాస్, రథిన్ ఘోష్, సబీనా యాస్మిన్లను ఉపాధ్యక్షులుగా నియమించారు. రితబ్రత బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సాహాలను ప్రధాన కార్యదర్శులుగా ప్రకటించారు.

## కాబోయే భార్యే లోయలోకి తోసేసింది..

### పూణె వ్యాపారవేత్త మృతి కేసులో ట్విస్ట్



పూణె, జూన్ 23: మహారాష్ట్రలోని పూణెలో కాబోయే భార్యను ఫొటో తీస్తూ లోయలో పడి వ్యాపారవేత్త కేతన్ విశాల్ అగర్వాల్ మృతిచెందిన ఘటన కీలక మలుపు తిరిగింది. అది ప్రమాదం కాదని, ప్రణాళిక ప్రకారం చేసిన హత్య అని పోలీసులు నిర్ధరించారు. కేతన్‌ను అతడి కాబోయే భార్యే చంపేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. 26 ఏళ్ల కేతన్ అగర్వాల్ జూన్ 18న చారిత్రక లోహగఢ్ కోట వద్ద 400 అడుగుల లోతు లోయలో పడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. తాము ట్రెక్కింగ్‌కు వచ్చామని, కేతన్ తనను ఫొటోలు తీస్తుండగా హోరుగాలికి పట్టుతప్పి లోయలో పడిపోయాడని అతడి కాబోయే భార్య సియా గోయల్ నాడు పోలీసులకు తెలిపారు. దీంతో ప్రమాద ఘటనగా భావించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. అయితే, విచారణ సమయంలో సియా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. ఆ తర్వాత లోతుగా దర్యాప్తు చేయగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఆ సమయంలో సియా మరో వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నట్లు తెలిసింది. కేతన్‌ను పెళ్లి చేసుకోవడం ఆమెకు ఇష్టం లేదని దర్యాప్తులో బయటపడింది. దీంతో ఆమె ఈ హత్యకు కుట్ర పన్నింది. ఔటింగ్ అని చెప్పి లోహగఢ్ కోట వద్దకు వెళ్లిన తర్వాత.. సియా, ఆమె ప్రియుడు కలిసి కేతన్‌ను లోయలోకి తోసేశారు'' అని పోలీసులు వెల్లడించారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. పుణె సమీపంలోని గహుంజే ప్రాంతానికి చెందిన కేతన్ తన కుటుంబ స్థిరాస్తి వ్యాపార కంపెనీలో డైరెక్టరుగా ఉన్నారు. అతడికి సియాతో ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరిగింది. నవంబరులో జరిగే పెళ్లి వేడుక కోసం రూ.17కోట్లతో ఉదయ్పుర్లోని ప్యాలెస్ను బుక్ చేశారు. బంధువులను తీసుకెళ్లేందుకు రెండు హెలికాప్టర్లను కూడా ముందే మాట్లాడుకున్నారు. ఈ క్రమంలోనే జూన్ 19న సియా పుట్టినరోజు కావడంతో వీరంతా లోహగఢ్ కోటకు వెళ్లారు. అక్కడే ఈ హత్య ఘటన చోటుచేసుకుంది.

# రేవంత్ స్కీం వెనుక భారీ స్కామ్

### ప్రతి పథకం వెనుక దోపిడీకి స్కెచ్ ఉంటది?
### మెట్రో భూములపై రేవంత్ కన్ను పడింది?
### ఢిల్లీలో రేవంత్, కిషన్‌రెడ్డిలు కొత్త డ్రామా
### ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దు.. తుగ్లక్ నిర్ణయం
### సీఎం రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలపై కేటీఆర్



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పథకం పేరుతో పత్తిత్తులా ప్రగల్భాలు పలుకుతారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారన్నారు. ఇది తుగ్లక్ నిర్ణయం అని కేటీఆర్ మండిపడ్డారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తయ్యి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# ఆ బాధ నన్ను ఎప్పటికీ వదిలిపోదు



### అసెంబ్లీలో విజయ్ కీలక ప్రసంగం
### విజయ్‌పై ఉదయనిధి వ్యక్తిగతదాడి

చెన్నై, జూన్ 23: తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకులకు గట్టిగా బదులిచ్చారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు.

''మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారు'' అని విజయ్ అన్నారు.

ఈ సందర్భంగా నీట్ వివాదం గురించి విజయ్ సభలో ప్రసంగించారు. నీట్ విధానం విద్యా వ్యవస్థలో అసమానతలను సృష్టిస్తోందని, దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడులో ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉన్నట్లు సీఎం పునరుద్ఘాటించారు. హిందీ భాషను రుద్దేందుకు కేంద్రం చేస్తోన్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రసంగంలో భాగంగా ఎన్నికల ప్రచార సమయంలో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనను విజయ్ ప్రస్తావించారు. ''41 మంది ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద ఘటన నన్ను ఎంత వేదనకు గురిచేసిందో మాటల్లో చెప్పలేను. ఆ బాధ నన్ను ఎన్నటికీ వదలదు. ఆ ఘటన విషయంలోనూ మాపైనే నిందలేశారు. ఇది అత్యంత దారుణం. రాజకీయాలు ఇంత క్రూరంగా ఉంటాయా?'' అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాల గురించి స్పందిస్తూ డీఎంకేపై విజయ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ''కేవలం ఒక కుటుంబానికే (డీఎంకేను ఉద్దేశిస్తూ) ప్రాధాన్యమివ్వడం మా రాజకీయ విధానం కాదు. తమిళనాడులోని ప్రతి కుటుంబానికి మా సేవలందిస్తాం. అదే మా రాజకీయం. అదే మా పాలనా విధానం'' అని విజయ్ పేర్కొన్నారు.


తమిళనాడులో రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో విజయ్ చేసిన ప్రసంగానికి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కౌంటర్ ఇస్తూ వ్యక్తిగత విమర్శలు చేశారు. విజయ్-సంగీత విడాకుల అంశాన్ని ప్రస్తావించారు.

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన, రైతుల నిరసన అంశాలను విజయ్ ప్రస్తావించారు. ప్రతిపక్ష పార్టీలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను అర్థం చేసుకొని, మద్దతు ఇవ్వాలని రైతులను సీఎం కోరారు.

ఈ వ్యాఖ్యలపై అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న ఉదయనిధిస్టాలిన్ స్పందించారు. ''ప్రతిపక్షాలు రెచ్చగొట్టడం వల్లే రైతులు నిరసన తెలుపుతున్నారని విజయ్ పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. చిన్న స్టోరీ చెప్తానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రైతుల గౌరవానికి భంగం కలిగించేవిగా ఉన్నాయి. చెంగల్పట్టు కోర్టులో భర్తకోసం భార్య వెతికే కథ మాత్రమే తమిళనాడు ప్రజలకు తెలుసు'' అంటూ ఉదయనిధి చేసిన విమర్శలు చర్చనీయాంశంగా మారాయి.

## వారిని నేనే కల్పించా..

# ఆ ఏర్పాట్లు నేనే చేశా



- సమావేశాలన్నిసానుకూల వాతావరణంలో జరిగాయ్?
- తెలంగాణ అభివృద్ధి కోసం ఎప్పుడైన కృషి చేస్తా
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో తిష్ట వేసిన రేవంత్ పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేలా తానే సమన్వయం చేసినట్లు వెల్లడించారు. రెండు రోజుల క్రితం జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం(23న) కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మరో సమావేశం నిర్వహించినట్లు ఆయన చెప్పారు. అయితే, ఇరువురి నడుమ ఈ సమావేశాలు అత్యంత సానుకూల వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి తనకు రెండుసార్లు లేఖ రాసి కేంద్ర మంత్రులతో భేటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన అభివృద్ధి అంశాల్లో తన వంతు సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.

# అమృత్.... అగమ్య గోచారం

**పేట మున్సిపాలిటీలో గుంతల రోడ్లు**

**వర్షం వస్తే రహదారులన్నీ బురదమయం**

**ఛీ..ఛీ.. అంటున్న పట్టణ వాసులు**

**చోద్యం చూస్తున్న ఎమ్మెల్యే, పట్టించుకోని అధికార పక్షం**

**పట్టణ ప్రజలకు ఎంతకాలం ఈ పనిష్మెంట్**

**పట్టణ సమస్యలను గాలికి వదిలేసిన స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల**



**సూర్యాపేట జూన్ 23 (మనం ప్రతినిధి)** పేట జిల్లా కేంద్ర పురపాలక పట్టణ ప్రజల పరిస్థితి ముందు నుయ్యి... వెనక గొయ్యి.. అన్నచందంగా తయారైంది.. పట్టణంలోని ఏ గల్లి చూసిన అడుగున లోతు గుంటలోతు వర్షం నీటి జలాలతో అటు వాహనదారులు ఇటు పాదాచార్లకు సైతం పరీక్ష పెడుతున్నాయి అకమ్న గోచరంగా మారిన ఈ దుస్థితి చూసి పట్టణ ప్రజలు లబోదిబోమంటున్నారు... కేంద్ర ప్రభుత్వం పట్టణ అభివృద్ధి ని దృష్టిలో పెట్టుకొని సుమారు 300 కోట్ల రూపాయలతో అమృత్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.. ఈ పథకం ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పట్టణ ప్రజలకు మాత్రం అమృత్ పథకం ఫలాలు అందని ద్రాక్ష పండు అనే చందంగా మారి పట్టణ ప్రజలకు నరకాన్ని చూపిస్తుంది.. కేంద్ర ప్రభుత్వం సూర్యాపేట మున్సిపాలిటీకి అమృత్ పథకం కింద పట్టణ అభివృద్ధికి సుమారు 300 కోట్ల రూపాయలతో కేఎన్ఆర్ సంస్థ టెండర్ దక్కించుకుంది ఈయనే పద్యంలో పేట పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టింది.. రెండేళ్ల క్రితం మొదటిగా చింతల చెరువు నుండి ప్రారంభమైన ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు సుమారు మూడు సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడం చూస్తే అటు ప్రభుత్వం యంత్రాంగం ఇటు సదర్ కాంట్రాక్టు గుత్తేదారుని అలసత్వమా ఏమో తెలియదు గానీ సూర్యాపేట పట్టణ ప్రజలకు మాత్రం ప్రతిరోజు.. నరక కూపంల మారింది.. ఎటువైపు ఏ గల్లి ఏ రోడ్డు చూసినా.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పేరుతో రోడ్లు మొత్తం మూరెడు అడుగు లోపల గుంటలు పడి నీరు నిలవడం ఎటు చూసిన దర్శనమిస్తుంది.. దీనికి ప్రధాన కారణం డ్రైనేజ్ పైప్ లైన్ వేసిన రోడ్డును మళ్లీ కంకరా సిమెంట్ తో పూడ్చకుండా తీసిన మట్టినే మళ్లీ కప్పడంతో... పట్టణంలో రోడ్లన్నీ మట్టితో గుంటలు పడ్డాయి.. దీంతో ప్రజలు బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రావాలంటే గగ్గోలు పెడుతున్నారు.. ఈ రోడ్లను చూసి ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఎక్కడ ప్రమాదాలకు గురవుతామో తెలియని పరిస్థితి ప్రజలకు దాపరించింది.. ఇటీవల ఈ రోడ్ల పుణ్యమా అంటూ.. ఎంతోమంది వాహనదారులు పైప్ లైన్ కోసం తీసిన గుంటలు సరిగా పూడ్చక పోవడంతో ప్రమాదవశాత్తు వాహనదారులు మట్టి గుంటలో వాహనం స్లిప్ అయ్యి కింద పడి క్షతగాత్రులైన సంఘటనలు పేట మున్సిపాలిటీ లో ఏ గల్లీలోకి వెళ్లి అడిగిన ప్రజలే తాము పడుతున్న గోసను.. వివరిస్తారు...అభివృద్ధి మాట దేవుడెరుగు.. ఇక్కడ ప్రాణా సంకటంగా మారి.. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పుణ్యమా అని క్షతగాత్రులు అవుతున్నామంటూ.. స్థానిక ప్రజలు వాపోతున్నారు... ఒక్క మాటలో చెప్పాలంటే... సూర్యాపేట పట్టణ ప్రజలు.. చి చి అంటూ ..అధికార ఇటు ప్రతిపక్ష స్థానిక ఎమ్మెల్యే పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. సూర్యాపేట పట్టణ ప్రజలను పాలకులు మర్చిపోయి... ఎన్నో ఏండ్లు అవుతుందనే భావన కొంతమంది ప్రజల నుండి వ్యక్తమౌతుంది... ఇప్పటికే గతంతో పోలిస్తే పేట పట్టణ అభివృద్ధి శూన్యం... కేంద్ర సర్కార్ బడ్జెట్ తో.. చేసిన అరోకోరో పనులు అందులో ముఖ్యంగా. అమృత్ పథకం పేరుతో చేసిన పనులైన పూర్తిస్థాయిలో చేశారా అంటే అదీ లేదు.. పట్టణలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పుణ్యమా అని తీసిన గుంటలు కంకర సిమెంట్ తో ప్యాచ్ వర్క్ వేయాల్సింది పోయి గుత్తేదారుడు.. తాత్కాలికంగా మట్టి కప్పి. వదిలేయడం... ఇదంతా చూస్తూ పేట మున్సిపాలిటీ అధికారులు.. నిమ్మకు నీలెత్తినట్టుగా వ్యవహరిస్తుండటం... పట్టణ ప్రజల్ని ఆగ్రహాన్ని గురిచేస్తుంది... ఇక వర్షాకాలం వచ్చేసింది.. ఎటువైపు చూసినా గల్లి లోని ఏర్పడ్డ గుంటలు ప్రజలకు నరకానికి దారిలా కనిపిస్తుంది... ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తులు క్షేమంగా ఇంటికి వస్తారా లేదా.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతుండడం గమనార్ధం.. ప్రజల నుండి మున్సిపాలిటీ కి రావాల్సిన వివిధ రకాల పనుల రూపంలో బకాయిలు పేట పట్టణ ప్రజలు నుండి ముక్కు పిండి వసూలు చేస్తున్న మున్సిపల్ శాఖ.. అదే ప్రజలకు ఇబ్బందులు కలిగితే.. ఆ సమస్యను గుర్తించి పరిష్కరించకపోవడం ఏంటని ప్రశ్నలు మెజార్టీ ప్రజల నుండి వినపడుతుంది .. అంతేకాకుండా తమకేంటి ఈ దుస్థితి ఏర్పడిందని.. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇది ఇలానే గుంటల మయంగా మారిన రోడ్లు ఇలానే కొనసాగితే...ప్రజా సమస్యలపై కలిసివచ్చే.. ప్రజా సంఘాలు కలిసి వచ్చే ప్రతిపక్ష పార్టీల నేతలతో కలిసి స్థానికంగా ప్రజలు పేట మున్సిపాలిటీ అలాగే కలెక్టరేట్ ముట్టడికి.. సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది... దీనికి అధికారపక్షంలో సైతం కొందరు ప్రజాప్రతినిధులు సైతం లోపాయి కారణంగా మద్దతు తెలపడం చూస్తే ప్రజల నుండి ఎంత వ్యతిరేకత ఒత్తిడి ఉందో ఇట్టే అర్థమవుతుంది.. దీనికి కొన్ని రాజకీయ పక్షాలు సైతం గొంతు కలిపి రోడ్ల దుస్థితిని చూసి ప్రజలు పడుతున్న ఇబ్బందులకు బాసటగా నిలిచి ప్రభుత్వం ఉన్నతాధికారులని నిలదీసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం.. గత రెండున్నర ఏండ్లుగా పేట పట్టణ పరిస్థితి జరుగుతున్న పరిణామాలను నిశ్చితంగా గమనిస్తూ వస్తున్న ప్రజలు సూర్యాపేట పట్టణ అభివృద్ధి పట్ల పట్టణంలో ఏ నలుగురు వ్యక్తులు ఒక్కచోట కలిసి మాట్లాడిన రాష్ట్ర సర్కార్ పై తీవ్ర విమర్శలు గుప్పిస్తుండడం కొసమెరుపు..



**పట్టణ సమస్యలను గాలికి వదిలేసిన జగదీష్ రెడ్డి**

నియోజకవర్గ కేంద్రంలో అమృత్ పథకంను పూర్తిస్థాయి అమలు చేయడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ అధికారుల తీరుతో పట్టణ ప్రజలు నా నా తంటాలు పడుతున్నారు అయినప్పటికీ స్థానిక శాసనసభ్యులు మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి ఏమాత్రం పట్టించుకోకుండా పట్టణ వాసులను గాలికి వదిలేశారని విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి శాసనసభ్యులుగా మూడు పర్యాయాలు ఎన్నికైన జగదీశ్వర్ రెడ్డి గతంలో లాగా ప్రజలు ఎదుర్కొంటున్న పట్టణ సమస్యల పట్ల స్పందించే పరిస్థితి కనిపించడం లేదంటూ పట్టణవాసులు చెవులు కోరుకుంటున్నారు... పాలకుల అసమర్ధతను ఎత్తిచూపాల్సిన స్థానిక ఎమ్మెల్యే ఆ దిశగా ఏమాత్రం పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తుంది కనీసం పట్టణంలో మున్సిపల్ అధికారుల పనితీరును కూడా సమీక్షించలేని నిస్సహాయ స్థితిలో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఉండటం పేట పట్టణ ప్రజల్ని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. జగదీశ్వర్ రెడ్డి తన తీరును ఇప్పటికైనా మార్చుకోకుంటే రాబోయే రోజుల్లో అనేక విమర్శలను ఎదురుకోక తప్పదు అనడంలో సందేహం లేదు...

# రైతులకు శాస్త్రీయ పరిశోధన ఫలితాలు చేరాలి





- **ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండ రాజి రెడ్డి**

**ములుగు, జూన్ 23(మనంన్యూస్):** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో 12వ రాష్ట్ర స్థాయి సాంకేతిక కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి (వైస్ ఛాన్సలర్) డాక్టర్ దండ రాజి రెడ్డి ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూన్ 23 నుండి 25 వరకు మూడు రోజుల పాటు ఈ సాంకేతిక సదస్సు నిరంతరాయంగా కొనసాగనుంది. ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ దండ రాజి రెడ్డి తన అధ్యక్షోపన్యాసంలో మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు ప్రయోగశాలల్లో చేసే పరిశోధనల ఫలితాలు ఆలస్యం కాకుండా వెంటనే క్షేత్రస్థాయిలోని ఉద్యాన రైతులకు చేరాలని ఆకాంక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని (ఐటీ), ఆధునిక కృత్రిమ మేధస్సును (ఏఐ) వినియోగించుకుంటూ శాస్త్రవేత్తల సలహాలను సకాలంలో అందుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని కూరగాయలు, పూలు, పండ్ల ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ (ఆహార శుద్ధి) రంగంలో పరిశోధనలు ముమ్మరం చేయాలని, దీనివల్ల కోత అనంతర నష్టాలను నివారించవచ్చని శాస్త్రవేత్తలకు దిశా నిర్దేశం చేశారు. ఉద్యాన రైతులు ఆహార శుద్ధి పరిశ్రమల వైపు మొగ్గు చూపాలని కోరుతూ, త్వరలోనే సరికొత్త సాంకేతిక సలహాలను రైతులకు అందుబాటులోకి తెస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం నిపుణులు డాక్టర్ ఐ. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో మిర్చి, పసుపు వంటి సుగంధ ద్రవ్యాల పంటలపై శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు నిరంతరం సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అప్డేట్గా ఉండాలని పిలుపునిచ్చారు. డాక్టర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు వాతావరణ ఆధారిత ఉద్యాన సూచనలు అందించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ వై.జి. ప్రసాద్ వాతావరణ మార్పులను తట్టుకునే 'క్లైమేట్ స్మార్ట్ హార్టికల్చర్' మరియు ఉద్యానవన రంగంలో సమాచార సాంకేతికత (ఐఖీ) అమలుపై సమగ్రంగా మాట్లాడారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సులో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ మరియు డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జె. చీనా, యూనివర్సిటీ కన్సల్టెంట్ డా.కె.వీరాంజనేయులు, టెక్నికల్ అడ్వైజర్ డా.జి.పి. సునందిని, పరిశోధనా విభాగం సంచాలకులు డాక్టర్ డి. లక్ష్మీనారాయణ, విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ టి. సురేష్ కుమార్, విశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారి డా. ఎం. రాజశేఖర్, సాంకేతిక కార్యదర్శి పిడిగాం సైదయ్య పాటు బోధన సిబ్బంది, మరియు పెద్ద సంఖ్యలో రైతులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వివిధ అగ్రో-క్లైమాటిక్ జోన్ల అధిపతులు, పరిశోధనా స్థానాల అధిపతులు, కళాశాలల అసోసియేట్ డీన్లు, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, బోధనా సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# గ్రంధాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- **చదువుతోపాటు విజ్ఞానాన్ని అందిస్తాయి**
- **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**నల్లగొండ, జూన్ 23 (మనం ప్రతినిధి ):** గ్రంథాలయాలు చదువుతోపాటు, విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.పాఠకులతో పాటు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పుస్తకాలు, తాగునీరు, టాయిలెట్లు, ఇతర ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వై ఫై సౌకర్యం ఉందా అని అడిగారు. ఈ సందర్భంగా పాఠకులు స్పందిస్తూ గ్రంథాలయంలో తమకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు లేవని తెలిపారు.



# రైతులు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పంటలను ఎంచుకోవాలి

- **ఈ సంవత్సరం తక్కువగా వర్షాలు కురిసే అవకాశం ఉంది**
- **రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి**
- **జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్**

**నల్లగొండ, జూన్ 23 (మనం ప్రతినిధి ):** రైతులు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలను ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ చెప్పారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండల కేంద్రంలో రైతు వేదికలో నిర్వహించిన విత్తనమేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విత్తన మేళాకు హాజరైన రైతులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, అంతేకాక రానున్న సీజన్లో నీరు తగ్గే అవకాశం ఉందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని నీరు తక్కువ అవసరమయ్యే పంటలను సాగు చేయాలని, అలాగే మెరుగైన విత్తనాలు, మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే సరైన దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఇలాంటి పరిస్థితులలో ఎలాంటి పంటలు వేసుకోవాలో, ఎలాంటి విత్తనాలు వాడాలో రైతు



వేదికలలో వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలను తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 140 రైతు వేదికలలో విత్తనమేల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. వరి పండించే రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు ఆలోచించాలని, అలాగే వరిలో సన్న రకాల పండించాలన్నారు. ముఖ్యంగా వర్షం తక్కువగా ఉన్న సమయంలో ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కనగల్ మండల వ్యవసాయ అధికారి, తహసిల్దార్ పద్మ, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కనగల్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న హ్యాం రోడ్ల పైలాన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పైలాన్ తో పాటు ,పరిసరాలు, రైలింగ్ ,సుందరీకరణ పనులపై ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలి



**యాదాద్రి భువనగిరి, జూన్ 23 (మనం ప్రతినిధి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్....పాఠశాలలో కొత్తగా ఎన్ని అడ్మిషన్లు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మొత్తం ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారు, ప్రతిరోజు విద్యార్థుల హాజరు శాతం ఎంత ఉందని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ పాఠశాలకు హాజరయ్యారా, ఎంత మంది గైర్హాజరులో ఉన్నారో వివరాలు తెలుసుకున్నారు. గైర్హాజరైన విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, వారి ఇళ్లకు ఫోన్ చేసి తల్లిదండ్రులతో మాట్లాడి వెంటనే పాఠశాలకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ , ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం పాఠశాలలో నూతనంగా నిర్మాణంలో ఉన్న తరగతి గదులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, ఇంకా పెండింగ్లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తరగతి గదుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. తదుపరి మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, రోజు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం ఉందా లేదా అని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. కిచెన్ మరియు స్టోర్ రూమ్ను కూడా పరిశీలించి, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు. పరిశుభ్రత, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడకుండా పని చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర నకిలీ పత్తి విత్తనాల ముఠాను పట్టుకున్న తుర్కపల్లి పోలీసులు

**యాదాద్రి భువనగిరి, జూన్ 23 (మనంప్రతినిధి):** రైతులకు నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్న అంతరాష్ట్ర ముఠాను యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. 150 కిలోల నకిలీ బిజి-ఐఐ పత్తి విత్తనాలు మరియు ఒక నిందితుడి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి బిల్లా బిజి-ఐఐ 999 పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు - సుమారు 70 కిలోలు (2 బ్యాగులలో ప్యాక్ చేయబడి ఉన్నాయి). లూజ్/విడి నకిలీ పత్తి విత్తనాలు సుమారు 80 కిలోలు (3 బ్యాగులలో ప్యాక్ చేయబడి ఉన్నాయి). వాటిని స్వాధీనం చేసుకున్నారు, వాటి విలువ సుమారు రూ. 10,00,000/- (పది లక్షల రూపాయలు. నమ్మదగిన సమాచారం మేరకు, తుర్కపల్లి పోలీసులు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తుర్కపల్లి బస్టాండ్ ముందు నిందితుడైన దొండపాటి మల్లికార్జున రావును అదుపులోకి తీసుకున్నారు. అతడు నిషేధిత బిజి-ఐఐ పత్తి విత్తనాలను గుంటూరు నుండి సిద్దిపేటకు అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడు. విచారణలో, తెలంగాణ రాష్ట్రంలో నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా సేకరించి, రవాణా చేసి, విక్రయించడం ద్వారా లాభం పొందాలని ఎ1 (మల్లికార్జున రావు), ఆంధ్రప్రదేశ్లోని చిత్తూరు



జిల్లాకు చెందిన ఎ2 (శంకర్) తో కలిసి కుట్ర పన్నినట్లు తేలింది. అనుమానాస్పద స్థితిలో ఉన్న ఎ1 దొండపాటి మల్లికార్జున రావును పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. ఈ విత్తనాలు వేస్తే ఎక్కువ దిగుబడి, మంచి పంట వస్తుందని నమ్మించి అమాయక రైతులకు విక్రయించేందుకు ఈ నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. మల్లికార్జున రావు గతంలో గుంటూరు జిల్లాలో విత్తనాలు, పురుగుల మందుల వ్యాపారం చేసేవాడని, శంకర్ సహాయంతో ఈ విత్తనాలను అక్రమంగా సేకరించి, తెలంగాణలోని రైతులకు వీటిని అసలైన బిజి-ఐఐ పత్తి విత్తనాలుగా నమ్మించి విక్రయించడానికి ప్రయత్నించినట్లు తదుపరి విచారణలో వెల్లడైంది. పోలీసులు తనిఖీ చేయగా, మొత్తం 5 బ్యాగులలో క్రింది విత్తనాలు లభ్యమయ్యాయి బిల్లా బిజి-ఐఐ 999 పేరుతో ఉన్న నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు - సుమారు 70 కిలోలు (2 బ్యాగులు). లూజ్/విడి నకిలీ పత్తి విత్తనాలు - సుమారు 80 కిలోలు (3 బ్యాగులు).ఈ విత్తనాల నిల్వ, రవాణా మరియు విక్రయాలకు సంబంధించి ఎలాంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్, బిల్లులు, ఇన్వాయిస్లు, రవాణా అనుమతులు, స్టాక్ రిజిస్టర్లు లేదా అధికారిక పత్రాలను నిందితుడు చూపించలేకపోయాడు. పరారీలో ఉన్న నిందితుడు శంకర్ (చిత్తూరు జిల్లా, బి.కొత్తకోట) ను పట్టుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి నిషేధిత, నకిలీ పత్తి విత్తనాల వల్ల విత్తనాలు మొలకెత్తకపోవడం, పంట నష్టం వాటిల్లడం జరిగి అమాయక రైతులు తీవ్ర ఆర్థిక నష్టాల్లో మునిగిపోయే ప్రమాదం ఉంది. నకిలీ విత్తనాల తయారీ, రవాణా మరియు విక్రయాలకు పాల్పడుతున్న నెట్వర్క్ను గుర్తించి, వాటిని నిర్మూలించడానికి నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడే వారందరిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. నకిలీ విత్తనాల అమ్మకం, నిల్వ లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు సహకరించి నమ్మదగిన సమాచారాన్ని అందించాలని, తద్వారా రైతు సమాజాన్ని రక్షించడానికి సమర్థవంతమైన చర్యలు తీసుకోవచ్చని పోలీసులు రైతులకు మరియు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఆపరేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ అక్షాన్ష్ యాదవ్, ఐపీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, అడిషనల్ ఎస్పీ సిహెచ్. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో.. యాదాద్రి డివిజన్ ఎస్డీపిఓ పి. శ్రీనివాస్ నాయుడు , యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ ఎం. శంకర్, తుర్కపల్లి ఎస్ఐ శ్రీ మొహమ్మద్ తఖీయుద్దీన్, తుర్కపల్లి మండల వ్యవసాయ అధికారి (ఎం ఏ ఓ) శ్రీమతి కె. శ్రీ ఉమ మరియు తుర్కపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది సమక్షంలో విజయవంతంగా నిర్వహించబడింది.

# ఎల్లంపేట గ్రామంలో కలెక్టర్ పర్యటన

**మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యటన.**

**పల్లె దవాఖాన తనిఖీ చేసి ఓపీ రిజిస్టర్ పరిశీలన**

**వనమహోత్సవంలో భాగంగా రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటిన కలెక్టర్.**



**కామారెడ్డి, జూన్ 23 (మనం జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గ్రామంలోని పల్లె దవాఖానను తనిఖీ చేసి ఓపీ రిజిస్టర్ను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసి, మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహ నిర్మాణాన్ని పూర్తి చేసిన గ్రామానికి చెందిన బుద్ధి నవీనను అభినందించి, ప్రభుత్వం తరపున గుర్తింపుగా గోడ గడియారాన్ని అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మట్టి పెల్లి సైదులు ఎన్నిక



**సూర్యాపేట, జూన్ 23, మనం న్యూస్:** ఈ నెల 20 నుంచి 22 వరకు మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలో సూర్యాపేట జిల్లాకు చెందిన మట్టి పెల్లి సైదులు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మట్టి పెల్లి సైదులు విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ వస్తున్నారని, 2001, 2003, 2007 లలో సంఘాలలో పని చేశారు. 2009 లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర విభజన అనంతరం 2014లో సూర్యాపేట జిల్లా ఏర్పడిన తర్వాత తొలి జిల్లా కార్యదర్శిగా ఎన్నికై, గత 12 సంవత్సరాలుగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాక్షులుగా నియమించినట్లు అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యపై ఉప కులాలు దృష్టి సారించాలి



- ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ మడిపల్లి శ్యామ్ మాదిగ

మహాదేవపూర్ జూన్ 23మనం న్యూస్ః మహాదేవపూర్ మండల కేంద్రంలో ముఖ్య సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది దీనికి ముఖ్యఅతిథిగా మడిపల్లి శ్యామ్ మాదిగ హాజరై మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు నుండి ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో త్యాగాలు చేసి పోరాటాలు చేసి అమరులైన మాదిగ మాదిగ ఉప కులాల బిడ్డలు మనకు అందించిన ఫలితాలే ఈరోజు ఎస్సీ వర్గీకరణ రూపంలో ఉప కులాలకు అందుబాటులోకి వచ్చాయి అందులో భాగంగా మందకృష్ణ మాదిగ గోటు విలేజ్ కార్యక్రమం ద్వారా మాదిగలకు విద్యారంగంలో ముందు వరుసలో ఉంచాలని పిలుపుమేరకు ఈరోజు మహాదేవపూర్ మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో ఉన్న ఎస్సీ ఉపకులాలు వర్గీకరణ ఫలితాలు పొందాలని సూచించారు జిల్లా ఉపాధ్యక్షులు డోర్నాల రాజేందర్ మాదిగ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరపునరేష్. టౌన్అధ్యక్షుడు చింతకుంట్ల సదానందం. సీనియర్ నాయకులు నల్లబుగ్గధర్మయ్య, చింతకుంట్ల రాందాస్ చింతకుంట్లరాము. లింగాల సుశాంత్. చింతకుంట్ల సాయి. లింగాల సుదర్శన్. చింతకుంట్ల సతీష్. కొలుగూరి శ్రీకాంత్.తో పాటు పలువురు పాల్గొన్నారు

# 99 రోజుల ప్రగతి కార్యాచరణలో విశిష్ట ఫలితాలు సాధించిన ములుగు జిల్లా

**ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో ప్రజలకు చేరువైన ప్రభుత్వ పరిపాలన వినూత్న కార్యక్రమాలు, ఉత్తమ విధానాల అమలుతో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిన ములుగు జిల్లా**

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలి**

**ప్రతి శాఖ కార్యక్రమాలపై ప్రత్యేక డాక్యుమెంటేషన్ రూపొందించాలి**

**జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన ప్రజాపాలన ప్రత్యేక అధికారి హనుమంత్ కె. జండాగే**



**ములుగు, జూన్ 23, మనం ప్రతినిధి:** 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ములుగు జిల్లా విశిష్ట ఫలితాలు సాధించిందని, ఈ ప్రణాళిక ద్వారా ప్రజలకు ప్రభుత్వ పరిపాలన మరింత చేరువైందని, వినూత్న కార్యక్రమాలు, ఉత్తమ విధానాల అమలుతో ములుగు జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని ప్రత్యేక అధికారి హనుమంత్ కె. జండాగే, ఐఏఎస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లాలో గత 99 రోజుల కాలంలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన పురోగతి, శాఖల వారీ విజయాలు, అమలు చేసిన వినూత్న కార్యక్రమాలపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జఈ సమావేశంలో ప్రత్యేక అధికారి హనుమంత్ కె. జండాగే, ఐఏఎస్, జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అన్ని శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజావాణి, గ్రామసభల ద్వారా అందిన భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించిన వివరాలు తెలిపారు. ఫైల్ క్లియరెన్స్, పారిశుధ్యం, వైద్య ఆరోగ్య సేవలు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లాలో గణనీయమైన పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో ములుగు జిల్లా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ విశిష్ట ఫలితాలు సాధించిందన్నారు. ప్రజలకు నేరుగా చేరువయ్యే విధంగా ప్రభుత్వ పరిపాలనను అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని అభినందించారు. జిల్లాలో గత 99 రోజులలో చేపట్టిన కార్యక్రమాల అమలును శాఖల వారీగా సమీక్షిస్తూ, ఇప్పటికే సాధించిన లక్ష్యాలతో పాటు ఇంకా పూర్తికాని అంశాలను గుర్తించి, వాటి పూర్తి కోసం సంబంధిత అధికారులు సమిష్టిగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రతి శాఖ అమలు చేసిన కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరిందని తెలిపారు. సమీక్షలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల గ్రామసభలు, బాల్య వివాహాల నిరోధానికి చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా వారోత్సవాలు, విద్యార్థులకు అందించిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన శిక్షణ, మహిళా సాధికారతకు ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమం ద్వారా జిల్లాలో మహిళలు సాధించిన విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యాల కల్పన, ఆయిల్ పామ్ సాగు కోసం అర్హులైన రైతుల గుర్తింపు, కొత్త విద్యా సంవత్సరానికి పాఠశాలల సన్నద్ధత, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, మహాలక్ష్మి, చేయూత, కొత్త రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాల అమలు, జిల్లాలో చేపడుతున్న వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిని కూడా సవివరంగా సమీక్షించారు. జ సాధించిన విజయాలను సమగ్ర నివేదిక రూపంలో సిద్ధం చేస్తున్నామని, ఇంకా పెండింగ్లో ఉన్న లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 'ప్రగతి' అంటే అభివృద్ధి, 'ప్రణాళిక' అంటే కార్యాచరణ అని పేర్కొంటూ, అభివృద్ధిని సాధించేందుకు ప్రణాళికాబద్ధమైన పని విధానం అవసరమని తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని, జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ప్రత్యేక అధికారి సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో ములుగు జిల్లా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ విశేష ఫలితాలు సాధించిందని ప్రత్యేక అధికారి హనుమంత్ కె. జండాగే, ఐఏఎస్ తెలిపారు. జిల్లాలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నేరుగా ప్రజలకు చేరే విధంగా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందన్నారు. ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువయ్యేలా సేవల అందింపు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి, మహిళా సాధికారత, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాలలో జిల్లాలో అమలు చేసిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు. ఇప్పటికే సాధించిన విజయాలను సమగ్రంగా నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేస్తున్నామని, ఇంకా నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం ఇదే సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిపారు. ములుగు జిల్లా అమలు చేస్తున్న పలు వినూత్న కార్యక్రమాలు ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలిచే స్థాయిలో ఉన్నాయని ప్రత్యేక అధికారి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్వో వికాస్ మీనా, అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జీ, డీఆర్వో రవికుమార్, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, జూన్ 23(మనంన్యూస్):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాను లోపరహితంగా, సమగ్రంగా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో నమోదు కావాలని సూచించారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని, జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని అన్నారు. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు నోటీసుల జారీ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని, అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు.తూర్పు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 799 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణలో బీఎల్వోలతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బీఎల్ఏలు కూడా సమన్వయంతో పనిచేస్తారని చెప్పారు.ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి పౌరుడి పేరును నమోదు చేయడం, అనర్హుల పేర్లను తొలగించడం, అవసరమైన సవరణలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరించడం, కొత్తగా అర్హులైన ఓటర్లను గుర్తించడం, మరణించిన లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలు నమోదు చేయడం జరుగుతుంది. ప్రస్తుతం ఓటర్లను వెరిఫై చేయడం జరుగుతుంది. దీని కోసం ప్రతి ఇంటికి ముందుగా ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారాలను రెండు ప్రతులుగా అందజేసి, వాటిని ఎలా పూరించాలో మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ద్వంద్వ ఓటర్లను గుర్తించి, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బిఎల్వోలు ప్రతి ఇంటిని సందర్శించారు. ఇలా సందర్శించే సందర్భాలలో ఇంటికి తాళం వేసి ఉన్న సందర్భాల్లో అట్టి ఇంటిని మూడు సార్లు సందర్శిస్తారు..ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతానికి ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి. సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సంబంధాల అధికారి బి. ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌పై అవగాహన కల్పించిన పోలీస్




**భీమదేవరపల్లి, జూన్ 23 మనం న్యూస్:** మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూరులో డ్రగ్స్ పై ప్రయాణికులకు ముల్కనూర్ పోలీస్ అవగాహన కల్పించారు. సోమవారం రోజున ముల్కనూర్ బస్టాండ్ ప్రాంగణంలో అధికారుల ఆదేశాల మేరకు ముల్కనూర్ పోలీస్ మండల పరిధిలోని గ్రామాల ప్రయాణికులకు డ్రగ్స్ వాడకంపై అవగాహన కల్పిస్తూ తమ పిల్లల భవిష్యత్తు బంగారు బాట వేసేందుకు, పిల్లలపై తీసుకోవాల్సిన శ్రద్ధను ప్రయాణికులకు సూచనలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ముల్కనూర్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శంకర్, రఘు ,మహేందర్, వీరస్వామి, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులైన చిదురాలరాజమల్లు, మాడుగుల ఈశ్వర్ ప్రయాణికులుతదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

- విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు



**ములుగు, జూన్ 23, మన ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం వెంకటాపురం మండలంలోని జవహర్నగర్ మోడల్ స్కూల్ను జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యా బోధన విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు పాఠశాలలోని కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ల్యాబ్లను పరిశీలించిన విద్యార్థులు ప్రయోగాత్మక విద్యపై అవగాహన పెంపొందించుకునేలా ల్యాబ్లను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. లైబ్రరీని సందర్శించి, విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇంచార్జ్ అరుణ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## గురిజాల రైతు వేదికలో ఘనంగా సీడ్ మేళా ప్రారంభం



**నర్సంపేట, జూన్ 23(మనంన్యూస్):** ఖరీఫ్ సీజన్ను దృష్టిలో ఉంచుకుని గురిజాల రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన సీడ్ మేళా కార్యక్రమాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్ కలిగి ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తన రకాలకు మాత్రమే బోనస్ ఇవ్వడం జరుగుతుందని, వాటిని మాత్రమే ఈ సీడ్ మేళాలో అధీకృత డీలర్ల ద్వారా అమ్మకాలకు పెట్టడం జరిగిందని తెలిపారు.పంటల ఎంపికలో వర్షపాత పరిస్థితులను పరిగణలోకి తీసుకొని మధ్య కాలిక స్వల్పకాలిక రకాలను పెంచుకోవాలని ఎమ్మెల్యే గారు అన్నారు.వర్షాభావ పరిస్థితులు నెలకొంటే పప్పు ధాన్యాలు , జొన్న,నువ్వులు, మరియు కూరగాయలు సాగుకు వంటి ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యూరియాను సిఫార్సు చేసిన మోతాదులోనే వినియోగించాలని, రెండో దఫా నుంచి నానో యూరియాను తప్పనిసరిగా ఉపయోగించాలని రైతులను కోరారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు. రైతులు అంతర పంటలు సాగు చేయడంతో పాటు తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంచుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు ఒకే చోట అన్ని విత్తనాలు అందుబాటులో ఉంచడంలో హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలై శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయ నిర్మల, డీహెచ్వో శ్రీనివాస్, ఏడీఏ శ్రీనివాస్, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, వ్యవసాయ అధికారి కృష్ణకుమార్, సర్పంచ్లు గురిజాల చంద్రరావు, చిన్న గురిజాల కమలాకర్, జీజీఆర్పల్లి బుస నర్సయ్య, గుంటూరుపల్లి రజిత, వ్యవసాయ విస్తరణాధికారులు అశోక్, సింధు, సంధ్య, త్రివేణి, అబిద్ హుస్సేన్తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## పలు ప్రారంభోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ జాలి

**భీమదేవరపల్లి, జూన్ 23 మనం న్యూస్:** మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూర్ లో పలు పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం రోజున మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూరులోని 14వ వార్డు సభ్యులు ముత్యం అశోక్ ఆధ్వర్యంలో 25 లక్షల రూపాయల ఈజీఎస్ నిధులతో రోడ్డు అభివృద్ధి పనులను సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు సౌకర్యం వారం రోజులపాటు ప్రైవేట్, ముల్కనూర్ సొసైటీ కి సంబంధించిన 7 రకాల సన్నపు వరి విత్తనాలు, కూరగాయల, పత్తి, తదితర వ్యవసాయ సంబంధిత విత్తనాల తోపాటు నానో యూరియా, డి ఏ పి, ఇలాంటి రసానిక ఎరువులను మండల పరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఏవో కమలహాసన్, ప్రైవేట్ వ్యవసాయ సంబంధిత యాజమాన్య స్టాల్ల ప్రతినిధులు, రైతులు వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి




- పిల్లల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్డేట్లను వేగవంతం చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్

**ములుగు, జూన్ 23, మనం ప్రతినిధిః** జిల్లాలో ఆధార్ నమోదు, ఆధార్ అప్డేషన్, బయోమెట్రిక్ అప్డేట్ ప్రక్రియలను వేగవంతం చేసి ప్రతి అర్హుడికి ఆధార్ సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, ఆధార్ సేవల పురోగతి, చిన్నారుల ఆధార్ నమోదు, విద్యార్థుల బయోమెట్రిక్ అప్డేట్ ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆసుపత్రుల్లో వ్యాక్సినేషన్ సమయంలోనే ఆధార్ నమోదు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ, పోస్టల్ శాఖల సమన్వయంతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. 5 నుండి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ అప్డేట్ ఉచితంగా అందుబాటులో ఉన్నందున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అప్డేట్ ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. 18 సంవత్సరాలు పైబడిన వారి ఆధార్ నమోదు వెరిఫికేషన్ పెండింగ్ కేసులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, జిల్లాలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రాలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా ప్రవేశ పరీక్షలు, ఇతర సేవల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు తమ ఆధార్ నమోదు, అప్డేట్ ప్రక్రియలను ముందుగానే పూర్తి చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో రవికుమార్, డీఎస్పీ కిషోర్, యూఐడీఏఐ హైదరాబాద్ ఆర్వో శ్రావణ్,ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్,డీడబ్ల్యూఓ, డీఈఓ, డీఎంహెచ్వో, ఎల్డీఎం, పోస్టల్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి

- యువతను డ్రగ్స్ బారిన పడకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి
- అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి



**ములుగు, జూన్ 23, మనం ప్రతినిధి:** ములుగు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత చర్యల బలోపేతం, మాదకద్రవ్యాల నియంత్రణ, యువతను డ్రగ్స్ బారిన పడకుండా రక్షించడం వంటి అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి జిల్లా రోడ్డు భద్రత కమిటీ, జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశాల్లో జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణ, మాదకద్రవ్యాల నియంత్రణ, అక్రమ రవాణా నివారణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, రహదారులపై సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం, వేగ నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు వేగంగా అందుబాటులో ఉండేలా వైద్యశాఖ, ట్రాఫిక్ నియంత్రణలో పోలీస్ శాఖ, రహదారి నిర్వహణలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో గంజాయి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్, ఎక్సైజ్, అటవీ, విద్య, వైద్య ఆరోగ్య శాఖలు ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, ప్రజా ప్రదేశాల పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత శాఖలు పరస్పర సమాచారాన్ని పంచుకుంటూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ కృష్ణ వేణి,డి ఆర్ ఓ రవికుమార్,డీఎస్పీ కిషోర్, డిఎంహెచ్వో, డి ఈ ఓ,డబ్ల్యుఓ,డి ఎల్ పి ఓ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీడ్ మేళ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్



**మహదేవ్ పూర్ జూన్ 23 మనం న్యూస్ః** మహదేవపూర్ మండలంలోని రైతువేదికలలో ఖరీఫ్ 2026-27 సీజన్కు సంబంధించి సీడ్ మేళ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ హసీనా బానో మహదేవపూర్ వ్యవసాయ సహాయసంచాలకులు శ్రీపాల్,వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రైతులకు వరి సాగుకు అనువైన 7 రకాల సన్న విత్తనాలను పంపిణీ చేశారు. అలాగే నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించివాటిని రైతులకుఅందజేశారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ధ్రువీకరించిన విత్తనాలను వినియోగించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటుసాగువ్యయాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఖరీఫ్ సీజన్ను విజయవంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారి బొల్లపెల్లి శ్రీజ, ఏఈఓ ధర్మేందర్ పెద్ద సంఖ్యాలో రైతులుపాల్గొన్నారు

# ఫిఫా వరల్ కప్.. చరిత్ర సృష్టించిన మెస్సి

ఫిఫా ప్రపంచకప్ లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తన హవా కొనసాగిస్తోంది. టెక్సాస్ లోని డాలస్ స్టేడియంలో జరిగిన గ్రూప్-జే మ్యాచ్ లో 2-0 గోల్స్ తేడాతో ఆస్ట్రియాపై విజయం సాధించింది. ఆ రెండు గోల్స్ కూడా అర్జెంటీనా స్టార్ ప్లేయర్ మెస్సి నుంచే రావడం గమనార్హం.



అదేవిధంగా ఈ గేమ్ లో అతడు రికార్డు సృష్టించాడు. ఫిఫా వరల్ కప్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ (18) కొట్టిన ఆటగాడిగా నిలిచాడు. 38వ నిమిషంలో చేసిన గోల్ ద్వారా జర్మనీ ఆటగాడు మిరోస్లావ్ క్లోస్ (16 గోల్స్) రికార్డును బద్దలుకొట్టాడు. అనంతరం మరో గోల్ కూడా మెస్సినే సాధించాడు. ఫిఫా ప్రపంచకప్లకు సంబంధించి వరుసగా ఆరు మ్యాచ్ లలో గోల్ కొట్టిన మూడో ఆటగాడిగానూ నిలిచాడు. అంతకుముందు ఫ్రాన్స్ స్ట్రైకర్ జస్ట్ ఫాంటైన్, బ్రెజిల్ దిగ్గజం జైర్ జిన్హో లు ఈ ఘనత సాధించారు.

# వారసుడని ప్రేక్షకులు చూడరు: రామ్ చరణ్

సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ మన కష్టాన్ని చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు.

''నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, సార్‌డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి'' అని చెప్పారు.

ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. ''థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది.



దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. జపాన్లో కూడా సోషల్ మీడియా బజ్ వల్లే రూ.65 కోట్లకు పైగా వసూళ్లు వచ్చాయి. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం'' అని రామ్ చరణ్ తెలిపారు.




# తెలుగమ్మాయి శ్రీచరణి ప్రపంచ నంబర్ 1 బౌలర్

భారత్ స్పిన్నర్, తెలుగమ్మాయి శ్రీచరణిరికార్డు సృష్టించింది. ప్రపంచ నెంబర్ 1 ఉమన్ టీ20 బౌలర్ గా నిలిచింది. తాజా అంతర్జాతీయ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్ లో ఇంగ్లాండ్ స్పిన్నర్ లిన్సే స్మిత్ ను అధిగమించి అగ్రస్థానానికి ఎగబాకింది. తాజా టీ20 ప్రపంచకప్ లో మూడు మ్యాచ్ లు ఆడిన శ్రీచరణి 10 వికెట్లు పడగొట్టింది. నిరుడు జూన్ 28న ఇంగ్లండ్ తో మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్లోకి అడుగుపెట్టింది. శ్రీచరణి ప్రపంచ నంబర్ 1 ఉమన్ టీ20 బౌలర్గా నిలవడంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. గతేడాది ఆమెతో మాట్లాడానని, క్రికెట్లోకి అడుగుపెట్టిన తొలినాళ్లలో తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి ఆమె చెప్పిన విషయాలు ఇంకా గుర్తున్నాయని అన్నారు. ప్రతిభ, పట్టుదల, కఠోర శ్రమ ఉంటే.. ప్రతిఫలం తప్పక లభిస్తుందని చెప్పడానికి శ్రీచరణి నిదర్శనమన్నారు. '' యావత్ రాష్ట్రం నిన్ను చూసి గర్విస్తోంది. మరిన్ని రికార్డులు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'' అని ఎక్స్లో పోస్టు చేశారు.



# డార్లింగ్... ది ఎటర్నల్ వార్

ప్రపంచవ్యాప్తంగా ఇండియన్ సినిమా స్టామినాని చాటిచెప్పిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి మరో క్రేజీ ప్రాజెక్ట్ ముస్తాబవుతోంది. తాజాగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులకు ఓ సర్ప్రైజ్ ఇచ్చారు. 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' అనే కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను పంచుకుంటూ డార్లింగ్ ఫ్యాన్స్‌ను ఖుషీ చేశారు. ఈ పోస్టర్‌లో ప్రభాస్ యానిమేషన్ అవతార్లో యోధుడిలా కనిపిస్తూ గూస్బంప్స్ తెప్పిస్తున్నారు.

**అంతర్జాతీయ వేదికపై బాహుబలి**

ఫ్రాన్స్‌లోని అన్నెసీ వేదికగా జరిగే ప్రతిష్టాత్మక 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026' కి ఈ ప్రాజెక్ట్ ఎంపికైంది. ఇక్కడ జరిగే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్స్‌లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'ను ప్రదర్శించబోతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ప్రభాస్ పంచుకోవడంతో అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. పోస్ట్ పెట్టిన కొద్ది నిమిషాల్లోనే లక్షకు పైగా లైక్స్, వేలాది కామెంట్స్ రావడం విశేషం.

రాజమౌళి సమర్పణలో..

ఆర్కా మీడియా వర్క్స్ నిర్మాణంలో వస్తున్న ఈ భారీ యానిమేషన్ చిత్రానికి అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇషాన్ శుక్లా ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. బాహుబలి ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్.. అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా ఒక అద్భుతాన్ని సృష్టిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను అంటూ ప్రభాస్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

బాహుబలి సిరీస్ సినిమాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ కాంబో, ఇప్పుడు యానిమేషన్ రూపంలోనూ గ్లోబల్ లెవెల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. ఫ్రాంచైజీకి ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ కొత్త అవతార్ ప్రేక్షకులను అలరించడం ఖాయంగా కనిపిస్తోంది.



# వైభవ్ చేతికి టీమ్ఇండియా జెర్సీ

క్రికెట్ యువ సంచలనం, యూనివర్స్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ జాతీయ జట్టులో అరంగేట్రం చేస్తున్నాడు. మరికొద్ది రోజుల్లో అతడు టీమ్ఇండియా తరఫున తొలి మ్యాచ్ ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో తాజాగా భారత జెర్సీని అందుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ తాజాగా సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది.

''యావత్ దేశం ఎదురుచూస్తున్న క్షణం వచ్చేసింది. వైభవ్ సూర్యవంశీ టీమ్ఇండియా జెర్సీని అందుకున్నాడు. ఆ అద్భుత క్షణాలను మీరూ చూసేయ్యండి'' అని బీసీసీఐ రాసుకొచ్చింది. ఈ యువ సెన్సేషన్ 'నంబరు 3'తో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ప్రఖ్యాత త్రోడౌన్ స్పెషలిస్టు రఘు నుంచి వైభవ్ ఈ జెర్సీని అందుకున్నాడు. ఈ జెర్సీ ఇచ్చేందుకు రఘు గది వద్దకు రాగానే.. వైభవ్ అతడి కాళ్లకు నమస్కరించడం వీడియోలో కన్పించింది.

ఈ సందర్భంగా వైభవ్ మాట్లాడుతూ.. ''కొన్ని సార్లు మనం ఊహించని అద్భుతాలు జరుగుతుంటాయి. అలాంటి క్షణాల్లో ఎలా స్పందించాలో కూడా అర్థం కాదు. ప్రస్తుతం నేను అలాంటి పరిస్థితిలోనే ఉన్నా. క్రికెట్ బ్యాట్ పట్టుకుని గ్రౌండ్లో ప్రాక్టీస్కు వెళ్లిన తొలి రోజు నుంచే.. టీమ్ఇండియా జెర్సీ వేసుకోవాలని కలలు కన్నా. ఈ రోజు ఆ కల నెరవేరింది. నా క్రికెట్ ప్రయాణంలో కీలక దశ మొదలైంది. టీమ్ఇండియా జెర్సీ నా చేతికొచ్చింది. ఈ ఆనందాన్ని నేను మాటల్లో వర్ణించలేను. ఇదంతా ఓ కలలా ఉంది. జెర్సీని చేతిలో తీసుకోగానే సంతోషం పట్టలేకపోయా'' అని తన ఆనందాన్ని పంచుకున్నాడు.

గతంలో నంబరు 3 జెర్సీతో హర్భజన్ సింగ్, సురేశ్ రైనా జాతీయ జట్టులో ఆడారు. వారు రిటైర్మెంట్ తీసుకోవడంతో ఆ నంబరును ఇప్పుడు వైభవ్కు కేటాయించారు. కాగా.. మరికొద్ది రోజుల్లో ఐర్లాండ్, ఇంగ్లాండ్తో జరగబోయే టీ20 సిరీస్లకు వైభవ్ను బీసీసీఐ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. అయితే, తుది జట్టులో అతడికి చోటు దక్కుతుందా లేదా అనేదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఓపెనర్ స్థానం కోసం అతడు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్ వంటి సీనియర్లతో పోటీ పడాల్సి ఉంటుంది.

# నితీశ్ రెడ్డి ఔట్.. సూర్యాంశ్ కు ఛాన్స్

ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్ లకు టీమ్ఇండియా సిద్ధమవుతోన్న వేళ ఆటగాళ్ల గాయాల బెడద జట్టును వెంటాడుతోంది. ఇప్పటికే మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి టీ20 జట్టు నుంచి వైదొలగగా.. తాజాగా ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా దూరమయ్యాడు.



తొడ కండరాల గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లాండ్ తో టీ20 సిరీస్ కు అతడు అందుబాటులో ఉండడని బీసీసీఐ వెల్లడించింది. అతడి స్థానంలో సూర్యాంశ్ షెడ్గెను జట్టులోకి తీసుకుంది. ఈ మేరకు తాజాగా ప్రకటన విడుదల చేసింది.

అఫ్గాన్తో వన్డే సిరీస్ ఆడుతుండగా నితీశ్ గాయపడిన సంగతి తెలిసిందే. తొలుత చిన్న దెబ్బే అనిపించినా.. ఎమ్మారైలో తొడ కండరాలకు గాయమైనట్లు తెలిసింది. అతడు కోలుకునేందుకు కనీసం నాలుగు వారాల సమయం పడుతుందని వైద్యులు వెల్లడించారు. ఆ తర్వాత కూడా ఫిట్నెస్ నిరూపించుకునేందుకు మరికొంత సమయం అవసరం. దీంతో ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్ లకు బీసీసీఐ అతడిని జట్టు నుంచి తొలగించింది. నితీశ్ వైదొలగడంతో యువ ఆటగాడు సూర్యాంశ్ కు ఛాన్స్ లభించింది. ఇటీవల శ్రీలంక-ఎ జట్టుతో జరిగిన ముక్కోణపు సిరీస్ లో ఇతడు నిలకడైన ప్రదర్శన చేశాడు. ఈ మిడిలార్డర్ బ్యాట్స్మన్ ఐదు మ్యాచ్ ల్లో 147 పరుగులు సాధించాడు. బంతితోనూ రాణించాడు. 2024-25లో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబయి తరఫున 131 పరుగులు చేసి బీసీసీఐ సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. జూన్ 26-28 మధ్య ఐర్లాండ్తో టీమ్ఇండియా రెండు టీ20 మ్యాచ్లు ఆడనుంది. ఆ తర్వాత జులై 1 - 11 మధ్య ఇంగ్లాండ్ తో ఐదు టీ20ల సిరీస్ జరగనుంది.



# మాలీవుడ్‌కి భాగ్యశ్రీ...

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే చేసిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయాయి. అయినప్పటికీ ఈ భామ క్రేజ్, డిమాండ్ ఏ మాత్రం తగ్గలేదు. టాలీవుడ్లో వరుసగా క్రేజీ ఆఫర్లు దక్కించుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తెలుగుతో పాటు 'కాంత' అనే సినిమాతో తమిళ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెట్టింది. ఇటీవల 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన భాగ్యశ్రీ.. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ శివకార్తికేయన్ సరసన 'సెయాన్' సినిమాలో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది. అలాగే తెలుగులో అక్కినేని అఖిల్ నెక్స్ట్ మూవీ 'లెనిన్'లో హీరోయిన్గా నటిస్తోంది. ఈ క్రమంలోనే భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ తర్వాత ఈ బ్యూటీ ఇప్పుడు మాలీవుడ్ ఇండస్ట్రీలోకి కూడా గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు టాక్ నడుస్తోంది.

మలయాళ సూపర్ స్టార్ మోహన్లాల్ నటిస్తున్న ఒక భారీ బడ్జెట్ సినిమాలో భాగ్యశ్రీ ఒక కీలకమైన పాత్రకు ఎంపికైనట్లు సమాచారం. టాలెంటెడ్ డైరెక్టర్ విష్ణు మోహన్ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఒక హై-వోల్టేజ్ సర్వైవల్ థ్రిల్లర్ చిత్రంలో ఆమె నటించనుందనే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమా కథాంశం చాలా పవర్ఫుల్గా ఉండబోతోందని తెలుస్తోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం జరిగిన సమయంలో అక్కడ చిక్కుకుపోయిన భారతీయ పౌరులను, విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడం కోసం భారత ప్రభుత్వం చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మకమైన సీక్రెట్ మిషన్ ఆపరేషన్ గంగ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుంది. ఇంతటి భారీ దేశభక్తి చిత్రంలో భాగ్యశ్రీ బోర్సేకి ఒక ఇంపార్టెంట్ రోల్ దక్కడం విశేషం. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఆగస్టు మొదటి వారంలో జార్జియాలో ప్రారంభం కానుందని తెలుస్తోంది.



# ఆ అనుభూతి మర్చిపోలేను

యంగ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ 'సీతారామం' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయారు. ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో నటించిన ఆ భామ ఫుల్ క్రేజ్ రాబట్టుకున్నారు. తన యాక్టింగ్, అందం, అభినయంతో ప్రశంసలు పొందుతూ ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. ఇక మృణాల్ ఇటీవల నటించిన సినిమా 'డెకాయిట్'. ఇందులో ఆమె యాక్టింగ్కు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. అయినప్పటికీ ఈ మూవీ మాత్రం బాక్సాఫీసు వద్ద హిట్ అందుకోలేకపోయింది. ప్రస్తుతం మృణాల్ ఖాతాలో ఎలాంటి ప్రాజెక్ట్ లేకపోవడంతో సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ పలు పోస్టులు షేర్ చేస్తున్నారు. తమ్ముడి గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లిన మృణాల్.. సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. ''నా హృదయం సంతోషంతో నిండిపోయింది. నా కలల్లో ఒకటి నిజమవ్వడం.. అది కూడా నువ్వు అంత సులువుగా సాధించడం కళ్లారా చూడటం చాలా ప్రత్యేకమైన అనుభూతి. నిన్ను చూస్తే నాకు చాలా గర్వంగా ఉంది. నువ్వు ఎదుగుతున్న తీరు, నిజంగా నువ్వు ఎంత మంచి అబ్బాయివో, మనసున్న వాడివో చూస్తుంటే ముచ్చటేస్తోంది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినందుకు అభినందనలు బేటా. నీ భవిష్యత్తు చాలా అద్భుతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నిజం చెప్పాలంటే.. నాకేదో సినిమా సీన్లో ఉన్నట్లు అనిపించింది. హేహే.. ఆ గ్రాడ్యుయేషన్ వేడుక అంత అందంగా జరిగింది.. ఈ అనుభూతిని నా జీవితాంతం మర్చిపోలేను'' అని రాసుకొచ్చారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.